TARAJYOTHI TELUGU DAILY

తారాజ్యోతి

తెలుగుదిన పత్రిక

చీఫ్ ఎడిటర్ : డాక్టర్ జె.బి.ఎల్

మంగళవారం, అక్టోబర్ 06, 2026 | సంపుటి - 20 | సంచిక 362 | వెల - 4రూ | పేజీలు - 12

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar.

సర్ ప్రక్రియలో తప్పుడు దరఖాస్తులపై చర్యలు

సీఈవో సుదర్శన్ రెడ్డి

హైదరాబాద్ : తెలంగాణ సర్-2026పై రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి (సీఈవో) సుదర్శన్ రెడ్డి సోమవారం పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఓటర్ల జాబితా సవరణపై తప్పుడు ప్రకటనలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఫామ్-6, 6ఏ, 7, 8లో కావాలని తప్పుడు సమాచారం ఇస్తున్న దరఖాస్తుదారులపై చర్యలు తీసుకోవాలన్నారు. ఓటర్ల పేర్ల తొలగింపు, అభ్యంతరాల కోసం ఉద్దేశించిన ఫామ్-7లో తరువాయి 2లో

ప్రతి కుటుంబానికి సురక్షిత తాగునీరు అందించడమే ధ్యేయం

డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్

అమరావతి : ప్రొద్దుటూరులో బంగారం, వస్త్ర వ్యాపారం, దక్షిణాదికి ఇదొక మినీ ముంబయిగా ఉందని ఎపి డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ కొనియాడారు. చరిత్ర, ఆధ్యాత్మికత, సంస్కృతి కలగలిపిన పవిత్ర భూమి ప్రొద్దుటూరు అని అన్నారు. జల్ జీవన్ మిషన్, అమరజీవి జలధార కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. రూ.30,156 కోట్లతో ప్రొద్దుటూరు నుంచి జల్ జీవన్ మిషన్ పనులు ప్రారంభం చేశారు. 2లో

రాయలసీమ దశ, దిశ మార్చడమే లక్ష్యం



90 లక్షల కుటుంబాలకు సురక్షిత తాగునీరు
ఉద్ఘాటించిన ముఖ్యమంత్రి చంద్రబాబు
ప్రొద్దుటూరులో 'అమరజీవి జలధార' ప్రారంభం
రూ.30,156 కోట్లతో జలధార ప్రాజెక్టు నిర్మాణం

అమరావతి : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమగ్రాభివృద్ధికి, ముఖ్యంగా రాయలసీమ దశ, దిశ మార్చడమే లక్ష్యంగా ఎన్డీఏ ప్రభుత్వం పనిచేస్తోందని ముఖ్యమంత్రి చంద్ర బాబు ఉద్ఘాటించారు. ప్రొద్దుటూరులో జరిగిన భారీ బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర గ్రామీణాభివృద్ధికి ఇక్కడి నుంచే పొద్దుపొడుపు అవుతుందని అన్నారు. ఈ సభ వేదికగా రూ.30,156 కోట్ల భారీ బడ్జెట్‌తో ప్రతిష్ఠాత్మక 'అమరజీవి జలధార' (జల్ జీవన్ మిషన్ 2.0) పథకానికి ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో కలిసి శ్రీకారం చుట్టారు. ఈ పథకం ద్వారా తరువాయి 2లో



తెలంగాణలో 'సర్' పేరుతో 90 లక్షల ఓట్లు తీసేశారు

'సర్' ప్రక్రియ అవకతవకలపై నిరంతర కార్యక్రమాలు..
జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలి : మహేశ్ గౌడ్

ఢిల్లీ : తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)పేరుతో 90 లక్షల ఓట్లు తీసేశారని కాంగ్రెస్ తెలంగాణ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ఆరోపించారు. తెలంగాణలో ఉన్న ప్రజాసంఘాలు, ఎన్జీవోలు, కుల సంఘాలకు, ఓట్లు గల్లంతైన వారి ఓట్లను పరిరక్షించుకునే విధంగా లేఖ రాస్తామని తెలిపారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, కేసీ వేణుగోపాల్ అధ్యక్షతన సోమవారం ఢిల్లీలో కీలక సమావేశం జరిగిందని చెప్పుకొచ్చారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించామని మహేశ్ గౌడ్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో 'సర్' ప్రక్రియ అవకతవకలపై చర్చించామని తెలిపారు. రానున్న రెండు నెలల పాటు తరువాయి 2లో

రక్షకులే రాక్షసుల్లా మారితే ఎలా

బాధ్యులైన పోలీసులపై చర్యలు తీసుకోవాలి: రాహుల్‌గాంధీ

న్యూఢిల్లీ : రక్షకులే రాక్షసుల్లా మహిళలపై అరాచకాలకు పాల్పడు తున్నారని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ మండిపడ్డారు. ప్రశ్నించే మహిళలను చూసి కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ఎందుకు భయపడుతున్నారని ప్రశ్నించారు. మహిళలను అణచివేసే ధోరణి ఢిల్లీలో స్పష్టంగా కనిపిస్తోందని ఆయన అన్నారు. ఢిల్లీ పోలీసులు ఇటీవల మహిళలపై దాడులు, దురుసు ప్రవర్తనకు పాల్పడ్డారనే ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో రాహుల్ తీవ్ర విమర్శలు చేశారు. బాధితులకు న్యాయం చేయాలని రాహుల్‌గాంధీ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఇటీవల జర్నలిస్టులు షహీన్ ఖాన్, నఫీసా ఖాన్‌లతో జరిపిన సంభాషణకు సంబంధించిన వీడియోను ఆయన 'ఎక్స్' వేదికగా పంచుకున్నారు. పోలీసులు దురుసుగా ప్రవర్తించారని జర్నలిస్టులు తనతో చెప్పి ఆవేదన వ్యక్తంచేశారని రాహుల్ తెలిపారు. కెమెరాలు లాక్కొవడంతోపాటు వారిని ఈడ్చుకెళ్లడం ఏంటని ప్రశ్నించారు. తరువాయి 2లో

తెలంగాణను అంతర్జాతీయ విద్యా కేంద్రంగా అభివృద్ధి చేయడమే లక్ష్యం

దశలవారీగా యంగ్ ఇండియా స్కూళ్ల ఏర్పాటు..
సీఎస్ సంజయ్ జాజు

హైదరాబాద్ : తెలంగాణను అంతరా జతీయ విద్యా కేంద్రంగా అభివృద్ధి చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు పేర్కొ న్నారు. డిసెంబర్ 2027 నాటికి 67 ఇంటిగ్రేటెడ్ స్కూళ్లను పూర్తి చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మాణం, ఫ్యూచర్ సిటీలో విద్యాసంస్థల ఏర్పాటుపై సీఎస్ సంజయ్ జాజు సోమవారం సచివాల యంలో సమీక్షా సమా వేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు కీలక అంశాలపై అధికారులకు సీఎస్ దిశానిర్దేశం చేశారు. జూన్ 2028 నాటికి 87 స్కూళ్ల ఏర్పాటుకు ప్రణాళిక చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలోని 119 నియోజకవర్గాల్లో దశలవారీగా యంగ్ ఇండియా స్కూళ్లు ఏర్పాటు చేస్తున్నట్లు సీఎస్ వెల్లడించారు. ఒక్కో స్కూల్‌కు సుమారు 26 ఎకరాల్లో 2లో

భారత్-అమెరికా వాణిజ్య చర్చల్లో స్తబ్దత

ప్రస్తుతం వాణిజ్యం భారత్‌కే అనుకూలం
నిర్మలా సీతారామన్ కీలక వ్యాఖ్యలు
భారత్-అమెరికా వాణిజ్య చర్చలపై వివరణ

న్యూఢిల్లీ : భారత్, అమెరికాల మధ్య కొంతకాలంగా కొనసా గుతున్న వాణిజ్య ఒప్పంద చర్చలు దాదాపుగా తుది దశకు చేరుకున్నప్పటికీ, ప్రస్తుతం అవి ప్రతిష్టంభనలో ఉన్నట్లు కనిపిస్తున్నాయని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొ న్నారు. ఇరు దేశాల మధ్య వాణిజ్యం ప్రస్తుతం భారత్‌కు అనుకూలంగా ఉండటంతో, ఆ లోటును తగ్గించుకోవడానికి 2లో

సన్న బియ్యం ధరలపై హరీశ్ ఫైర్

నాలుగు నెలల్లో 25 శాతం పెరిగాయంటూ విమర్శలు

హైదరాబాద్ : రాష్ట్రంలో నిత్యావసర ధరల నియంత్రణపై కాంగ్రెస్ ప్రభుత్వం చేతులెత్తేసిందంటూ మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. ధరల పెరుగుదలతో సామా న్యుడిపై పెను భారం పడుతోందన్నారు. వెంటనే ధరల పెరుగుదలపై సమీక్ష నిర్వాహించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రికార్డు స్థాయిలో పంట ఉత్పత్తి సాధించామని ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటోందన్నారు. ఉత్పత్తి పెరిగితే బియ్యం ధరలు ఎందుకు ఆకాశాన్నంటుతున్నాయని మాజీ మంత్రి ప్రశ్నించారు. హరీశ్ రావు పోస్ట్.. 'సన్న బియ్యం ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి .. రేవంత్ సర్కార్ నేల చూపులు చేస్తోంది. నిత్యవసర ధరల నియంత్రణపై కాంగ్రెస్ ప్రభుత్వం చేతులెత్తేసింది. సామాన్యుడిపై పెనుభారం పడుతుంటే పౌరసరఫరాల శాఖ మొద్దు నిద్రలో ఉంది. వెంటనే ధరల పెరుగుదలపై సమీక్ష నిర్వహించి తగిన చర్యలు తీసుకోవాలి. 2లో

'ఫారం 6' సవరణలకు సుప్రీంకోర్టు ఆమోదం లేదు

ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్

న్యూఢిల్లీ : కొత్త ఓటర్ల నమోదు కోసం ఎన్నికల సంఘం (ఈసీ) వినియోగించే 'ఫారం 6'లో ఎలాంటి సవరణలకు తాము ఆమోదం తెలుపలేదని సుప్రీంకోర్టు సోమవారం స్పష్టం చేసింది. అయితే ఈ మార్పులు ఎవరు చేశారో నిర్ధారించేందుకు సంబంధిత రికార్డులను తాము పరిశీలిస్తామని భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) సూర్య కాంత్ తెలిపారు. సవరించిన ఫారం 6కు తాము ఆమోదం తెలుపలేదని, ఈ విషయంలో చాలా స్పష్టంగా ఉన్నామని ఆయన చెప్పారు. 'ఆ రికార్డులను సుప్రీంకోర్టుకు సమర్పించినప్పుడు 'ఫారం 6'లో ఎవరు మార్పులు చేశారో మేము చూడాలనుకుంటున్నాం' అని ఆయన అన్నారు. కాగా, మిగతా ఇద్దరు ఎన్నికల కమిషనర్ల ఏకాభిప్రాయం లేకుండా ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేష్ కుమార్ ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకున్నారన్న ఆరోపణలపై ఆయనను సస్పెండ్ చేస్తూ ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయడానికి సుప్రీంకోర్టు నిరాకరించింది. తమకు స్పందన అందేంత వరకు ఈసీ నిర్ణయాలు చట్టానికి అనుగుణంగానే ఉన్నాయని తాము భావిస్తామని ధర్మాసనం పేర్కొంది. 'ఆ నివేదిక కచ్చితమైనది కావచ్చు, కాకపోవచ్చు. కానీ దాని ఆధారంగా మేము ఉత్తర్వులు జారీ చేయలేం. తరువాయి 2లో

రామప్పకు మైనింగ్ ముప్పు లేదు

వెంకటాపూర్ ఓపెన్‌కాస్ట్‌పై సింగరేణి కీలక స్పష్టత

వరంగల్ : కాకతీయుల కాలం నాటి రామప్ప దేవాలయానికి మైనింగ్ కార్యకలాపాలతో ముప్పు పొంచి ఉందంటూ వస్తున్న వార్తలపై సింగరేణి సంస్థ స్పష్టత ఇచ్చింది. రామప్ప దేవాలయానికి మైనింగ్‌తో ముప్పు ఉంటుందనే ప్రచారంలో వాస్తవం లేదని పేర్కొంది. వెంకటాపూర్ ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టుకు సంబంధించి 2

మహిళలపై నేరాలను అరికట్టండి

శిక్షలతో దుండగులకు వణుకు పుట్టాలి
సామాజిక వ్యతిరేక శక్తుల్లో భయం సృష్టించాలి
ఢిల్లీ పోలీసులకు సుప్రీంకోర్టు కీలక సూచన
ఢిల్లీ-ఎన్‌సీఆర్‌లో అత్యాచార ఘటనలపై విచారణ

న్యూఢిల్లీ : మహిళలపై నేరాలకు పాల్పడే సామాజిక వ్యతిరేక శక్తుల మనసుల్లో భయాన్ని సృష్టించాల్సిన అవసరం ఉందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. నేరం జరిగిన తర్వాత చర్యలు తీసుకోవడం కంటే, నేరాలు జరగకుండా నివారించడమే అత్యంత ముఖ్యమని ఢిల్లీ పోలీసులకు హితవు పలికింది. ఇటీవల ఢిల్లీ-జాతీయ రాజధాని ప్రాంతం (ఎన్‌సీఆర్)లో వరుసగా చోటుచేసుకున్న అత్యాచార

సర్ ప్రక్రియలో తప్పుడు దరఖాస్తులపై చర్యలు

భారీగా దరఖాస్తులు దాఖలయ్యాయి. అయితే వాటిలో కొన్ని నకిలీవని ఆరోపణలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో సీఈవో సుదర్శన్ రెడ్డి ఈ ఆదేశాలు జారీ చేశారు. ఫామ్–7లో తప్పుడు సమాచారం సమర్పిస్తున్న వారిపై ప్రజాప్రాతినిధ్య చట్టం--1950లోని సెక్షన్ 31 ప్రకారం చర్యలు తీసుకోవాలని ఈఆర్ఓలకు ఆయన సూచించారు. చర్యలకు ముందు విచారణ నిర్వహించాలని తెలిపారు. రిజిస్ట్రేషన్ ఆఫ్ ఎలక్టర్స్ రూల్స్--1960లోని రూల్ 20 ప్రకారం విచారణ సాగాలని చెప్పారు. ఈ మేరకు జీహెచ్ఎంసీ కమిషనర్, హైదరాబాద్ డీఈఓతో పాటు అన్ని జిల్లాల కలెక్టర్లకు, డీఈఓలకు ఉత్తర్వులు జారీ చేశారు.

తెలంగాణను అంతర్జాతీయ విద్యా కేంద్రంగా అభివృద్ధి చేయడమే లక్ష్యం

ఆధునిక మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు చెప్పుకొచ్చారు. ఒకే క్యాంపస్‌లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ పాఠశాలలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. క్రీడా మైదానాలు, హాస్టళ్లు, డిజిటల్ క్లాస్‌రూమ్‌లు ఏర్పాటు చేస్తామని అన్నారు. ఫ్యూచర్ సిటీలో విదేశీ యూనివర్సిటీల క్యాంపస్‌లకు ప్రత్యేక విధానం తీసుకువస్తామని చెప్పారు. ఇందుకోసం లండన్, బర్మింగ్‌హామ్ యూనివర్సిటీలతో పాటు మరో 4 విదేశీ వర్సిటీలు ఆసక్తి చూపిస్తున్నాయని సీఎస్ వివరించారు. విదేశీ వర్సిటీలకు మౌలిక వసతులు, పెట్టుబడులు, అనుమతులపై సమగ్ర విధానం ప్రవేశపెడతామని అన్నారు. గ్లోబల్ సమ్మిట్ నాటికి స్పష్టమైన కార్యాచరణ, ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులను సీఎస్ సంజయ్ జాజు ఆదేశించారు.

రామప్పకు మైనింగ్ ముప్పు లేదు

సమగ్ర శాస్త్రీయ అధ్యయనాలు, సంబంధిత నివేదికలను పరిశీలించిన తర్వాతే తదుపరి నిర్ణయం తీసుకుంటామని తెలిపింది. రామప్ప దేవాలయం సమీపంలో మైనింగ్ కార్యకలాపాలపై ఎలాంటి నిర్ణయమైనా పురావస్తు శాఖతో పాటు ప్రతిష్టాత్మక సంస్థలు అందించే శాస్త్రీయ నివేదికల ఆధారంగానే ఉంటుందని సింగరేణి వెల్లడించింది. ఆలయానికి ఎట్టి పరిస్థితుల్లోనూ నష్టం చేకూర్చబోమని స్పష్టం చేసింది. ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తింపు పొందిన ఆలయ పరిరక్షణకు తమ సంస్థ కట్టుబడి ఉందని తెలిపింది. పర్యావరణహిత, చట్టబద్ధమైన విధానాల్లోనే మైనింగ్ కార్యకలాపాలను చేపట్టేందుకు ప్రాధాన్యం ఇస్తామని పేర్కొంది. ఆలయ రక్షణ విషయంలో ఎలాంటి రాజీ ఉండబోదని సింగరేణి స్పష్టం చేసింది. బాధ్యతాయుతమైన ప్రభుత్వ రంగ సంస్థగా శాస్త్రీయ అధ్యయనాలు, నిపుణుల సూచనలు, చట్టపరమైన నిబంధనలను పరిగణనలోకి తీసుకుంటామని తెలిపింది. ఆ తర్వాతే వెంకటాపూర్ ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టుపై ముందుకు వెళ్తామని సింగరేణి సంస్థ వెల్లడించింది.

ప్రతి కుటుంబానికి సురక్షిత తాగునీరు అందించడమే ధ్యేయం

ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ప్రతి ఇంటికీ కుళాయి కనెక్షన్ ద్వారా సురక్షిత తాగునీరు ఇవ్వాలనేది లక్ష్యం అని తెలియజేశారు. వైసిపి ప్రభుత్వంలో 2700 కోట్లే ఖర్చుచేసి ఏ ప్రాజెక్టూ సంపూర్ణంగా పూర్తిచేయలేదని పవన్ విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారం లోకి రాగానే జల్ జీవన్ మిషన్ పథకాన్ని మళ్లీ పొడిగించుకున్నామని, ఆగిపోయిన కార్యక్రమాన్ని కేంద్ర పెద్దలను సంప్రదించుకుంటున్నామని అన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో మునుపెన్నడూ లేని విధంగా అభివృద్ధి చేస్తున్నామని, నీటి కొరత లేని ఉమ్మడి గోదావరిలోనూ 6వేల కోట్లతో జేజే ఎం లు పనులు చేపడుతున్నామని పేర్కొన్నారు. తాగునీటి పథకాల్లో ఫిల్టర్ బెడ్ నిర్వహణ చాలా కీలకమని, వైసిపి ప్రభుత్వంలో నీటి నిర్వహణ సక్రమంగా జరగక చాలా దెబ్బతిన్నాయని పవన్ కల్యాణ్ మండిపడ్డారు.

మహిళలపై నేరాలను అరికట్టండి

ఘటనలపై సుమోటోగా విచారణ చేపట్టిన ధర్మాసనం ఈ కీలక వ్యాఖ్యలు చేసింది. విచారణ సందర్భంగా పోలీసుల పనితీరుపై పలు సూచనలు చేసింది. విచారణ సందర్భంగా జస్టిస్ పార్థీవాలా మాట్లాడుతూ.. "మహిళలపై దాడులకు పాల్పడాలనుకునే దుండగులకు తాము పట్టుబడితే తీవ్రమైన పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందనే భయం ఉండాలి. అలాంటి వాతావరణాన్ని మీరు కల్పించాలి" అని పోలీసులను ఆదేశించారు. నేరాలను అరికట్టేందుకు నివారణ చర్యలను మరింత బలోపేతం చేయాలని ఈ సందర్భంగా న్యాయస్థానం నొక్కి చెప్పింది. ఢిల్లీలో మహిళల భద్రతకు సంబంధించి పలు నిర్దిష్ట ఆదేశాలను ధర్మాసనం జారీ చేసింది. సమస్యాత్మక ప్రాంతాల్లో బీట్ పెట్రోలింగ్‌ను సమర్థవంతంగా నిర్వహించాలని, వెలుతురు సరిగా లేని ప్రదేశాలను గుర్తించి వెంటనే లైటింగ్ సౌకర్యం మెరుగుపరచాలని సూచించింది. అలాగే, నిఘా వ్యవస్థలను పటిష్ఠం చేయాలని తెలిపింది. దుండగులు, పోకిరీలు ఎక్కువగా గుమికూడే అక్రమ తినుబండారాల కేంద్రాలు, మద్యం దుకాణాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. ముఖ్యంగా విద్యాసంస్థల సమీపంలో అమ్మాయిలను వేధించే వారిపై ఉక్కుపాదం మోపాలని స్పష్టం చేసింది. దేశ రాజధాని పరిధిలో మైనర్లపై జరిగిన లైంగిక దాడులతో సహా వరుస అత్యాచార ఘటనల నేపథ్యంలో సుప్రీంకోర్టు ఈ కేసును సుమోటోగా విచారణకు స్వీకరించింది. గతంలో కూడా కోర్టు మహిళల భద్రతపై ఆడిట్ నిర్వహించాలని, ఇతర తాత్కాలిక చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. తాజా విచారణలో తీసుకున్న చర్యలపై పూర్తి వివరాలతో నివేదిక సమర్పించాలని ఢిల్లీ పోలీసులను ధర్మాసనం ఆదేశించింది.

మమ్మల్ని ఎవరూ పెళ్లి చేసుకోవడం లేదు సార్!

సీఎం ఎదుట గోడు వెళ్లబోసుకున్న యువ రైతు

కర్ణాటకలో ఓ యువరైతు వింత విజ్ఞప్తి

మైసూరు, అక్టోబర్ 05 : కర్ణాటకలో ఓ యువరైతు డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌కు చేసిన ఓ విజ్ఞప్తి ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. గ్రామాల్లో యువ రైతులకు పెళ్లిళ్లు కావడం లేదని, ఈ తీవ్రమైన సమస్యను ప్రభుత్వం పరిష్కరించాలని ఆయన కోరడం అందరి దృష్టిని ఆకర్షించింది. ఈ సంభాషణకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. మైసూరు జిల్లాలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొన్న ఓ యువరైతు, తమ గోడును నేరుగా డీకే శివకుమార్ ముందుంచారు. "గ్రామాల్లో యువకులకు సొంత ఇళ్లు, పొలాలు ఉండి, కష్టపడి పనిచేస్తున్నా పెళ్లిళ్లు కావడం లేదు. అమ్మాయిలు, వారి కుటుంబ సభ్యులు ప్రభుత్వ ఉద్యోగులు, ఎక్కువ జీతం వచ్చే వారినే కోరుకుంటున్నారు. దీంతో 30, 40 ఏళ్లు దాటినా చాలా మంది బ్రహ్మచారులుగానే మిగిలిపోతున్నారు. ఈ మానసిక వేదనతో కొందరు ఆత్మహత్యలకు కూడా పాల్పడుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఐదు గ్యారంటీలు ఇచ్చినట్లే, మా పెళ్లిళ్ల సమస్యను ఆరో గ్యారంటీగా భావించి పరిష్కరించాలి" అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. యువరైతు వినతికి డీకే శివకుమార్ మొదట ఆశ్చర్యపోయినా, ఆ తర్వాత అతడు చెప్పేది శ్రద్ధగా విన్నారు. సభలో కొందరు నవ్వడంతో, ఇది నవ్వుకోవాల్సిన విషయం కాదని, తీవ్రమైన సామాజిక సమస్య అని వారికి సూచించారు. మారుతున్న సామాజిక ప్రాధాన్యతలు, పట్టణ జీవనశైలి ప్రభావం, ఉద్యోగాల స్వరూపం వంటివి వివాహ నిర్ణయాలను ప్రభావితం చేస్తున్నాయని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ వీడియో వైరల్ కావడంతో, వ్యవసాయంపై యువతలో తగ్గుతున్న ఆసక్తి, గ్రామాల నుంచి పట్టణాలకు వలసలు వంటి అంశాలపై విస్తృత చర్చ జరుగుతోంది. మంచి ఆస్తులున్న భూస్వాములకు కూడా ఇలాంటి ఇబ్బందులు తప్పడం లేదని నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు.

సన్న బియ్యం ధరలపై హరీశ్ ఫైర్

నిత్యావసరాల ధరలు సామాన్యుడి నడ్డి విరుస్తుంటే.. ధరలకు అడ్డుకట్ట వేయాల్సిన ప్రభుత్వం మొద్దు నిద్రలో ఉండటం దారుణం. ప్రభుత్వ నిర్లక్ష్యం, పర్యవేక్షణ వైఫల్యానికి సామాన్య ప్రజలే మూల్యం చెల్లిస్తున్నారు. సన్నబియ్యం ధరలు కేవలం నాలుగు నెలల్లోనే 25 శాతం పెరగడం ప్రభుత్వానికి కనిపించడం లేదా? రికార్డు స్థాయిలో పంట ఉత్పత్తి సాధించామని గొప్పలు చెప్పుకున్న ప్రభుత్వం... మరి ఉత్పత్తి పెరిగినప్పుడు ధరలు తగ్గాల్సింది పోయి.. బియ్యం ధరలు ఎందుకు ఆకాశాన్ని అంటుతున్నాయి?' అని ప్రశ్నించారు. 'మీరు ఇస్తున్న సన్నబియ్యం పథకం సఫలం అయితే, ఎందుకు బియ్యం ధరలు అదుపు తప్పుతున్నాయి? మీరు ఇస్తున్న నాణ్యత లేని సన్నబియ్యాన్ని ప్రజలు వినియోగించడం లేదని చెప్పడానికి ఇది నిదర్శనం కాక మరేమిటి? ఆరుగాలం శ్రమించి పంట పండించిన రైతన్నకు ఎమ్ఎస్‌పీ(మీరా) పేరిట దక్కుతున్నది నామమాత్రపు ధర. కానీ మధ్య దళారులుకు దక్కుతున్నది క్వింటాకు రూ.8000 పై మాటే. రైతుకు గిట్టుబాటు ధర లేదు.. వినియోగదారుడికి అందుబాటు ధర లేదు.. లాభపడుతున్నది మాత్రం మధ్య దళారులు? కళ్లముందే ఈ తతంగం అంతా జరుగుతుంటే, ప్రభుత్వంలో ఎందుకు చలనం లేదు? బియ్యం మాత్రమే కాదు.. ఉల్లి రూ.70, వెల్లుల్లి రూ.240, పల్లినూనె రూ.210, పెసరపప్పు రూ.125, కందిపప్పు రూ.165 ధరలు అడ్డగోలుగా పెరిగితే సామాన్య కుటుంబం ఎలా బతకాలి? వంటింటి బడ్జెట్ తారుమారవుతున్నా.. పౌరసరఫరాల శాఖ ఏం చేస్తోంది? ధరల పర్యవేక్షణ గాలికి ప్రభుత్వం ఏం చేస్తున్నట్లు? ప్రజల జేబులు ఖాళీ అవుతుంటే ప్రభుత్వం ప్రేక్షక పాత్ర పోషించడం కాదు.. వెంటనే చర్యలు తీసుకోవాలి. బ్లాక్ మార్కెట్, అక్రమ నిల్వలు, కృత్రిమ కొరత, అధిక మార్జిన్లపై తక్షణం నిఘాలు నిర్వహించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు.. సన్నబియ్యం సహా నిత్యావసరాల ధరలకు వెంటనే అడ్డుకట్ట వేసి, సామాన్యుడిపై పడుతున్న భారం నుంచి ఉపశమనం కల్పించాలని డిమాండ్ చేస్తున్నాం' అంటూ ఎక్స్‌లో హరీశ్ రావు పోస్ట్ చేశారు.

'ఫారం 6' సవరణలకు సుప్రీంకోర్టు ఆమోదం లేదు

మేము వారి స్పందన కోసం వేచి ఉండాలి' అని సీజేఐ సూర్య కాంత్ పేర్కొన్నారు. మరోవైపు 'ఫారం 6' అనేది 'ఓటర్ల నమోదు నియమావళి 1960'లో ఒక భాగం. దీనిని కేవలం ఒక సవరణ ద్వారా మాత్రమే మార్చడం సాధ్యమవుతుంది. అయితే 'ఫారం 6'కు ఒక అనుబంధ పత్రం జతచేయాలని 2025లో ఈసీ పేర్కొంది. ఓటరు జాబితాల సవరణ ప్రక్రియ (సర్)లో భాగంగా కొత్త ఓటర్లు తమ తల్లిదండ్రులు లేదా తాత, నానమ్మలు లేదా తాత, అమ్మమ్మల గత ఓటర్ల జాబితాలతో అనుసంధానించే వివరాలను అందించాలని కోరడం వివాదస్పదమైంది. అయితే తమకు తెలియకుండా లేదా తమ సిఫార్సు లేకుండా ఓటర్ల జాబితాల సవరణ ప్రక్రియ (సర్), 'ఫారం 6' సవరణకు సంబంధించి సీఈసీ జ్ఞానేష్ కుమార్ ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకున్నారని, ఉత్తర్వులు జారీ చేశారంటూ ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి ఆరోపించినట్లు సెప్టెంబర్ 25న ఇండియన్ ఎక్స్‌ప్రెస్ పత్రిక వార్తా కథనాన్ని ప్రచురించింది. ఆ ఇద్దరు ఎన్నికల కమిషర్లు గత 10 నెలల్లో కనీసం 14 సార్లు రికార్డుల్లో తమ అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు పేర్కొంది. ఈ నేపథ్యంలో 'సర్' ప్రక్రియపై వివాదం తారాస్థాయికి చేరింది. కాగా, సెప్టెంబర్ 28న ఈ వివాదంపై ఈసీ స్పందించింది. 'ఫారం 6' సవరణకు సుప్రీంకోర్టు ఆమోదం తెలిపినట్లు పేర్కొంది. అలాగే జతచేయాల్సిన డిక్లరేషన్‌ను కూడా సుప్రీంకోర్టు సమర్థించినట్లు ఈసీ వెల్లడించింది. అయితే 'ఫారం 6'లో ఎలాంటి సవరణలకు తాము ఆమోదం తెలుపలేదని సుప్రీంకోర్టు సోమవారం స్పష్టం చేసింది. ఈ మార్పులు ఎవరు చేశారో నిర్ధారించేందుకు సంబంధిత రికార్డులను తాము పరిశీలిస్తామని సీజేఐ సూర్య కాంత్ పేర్కొన్నారు.

రాయలసీమ దశ, దిశ మార్చడమే లక్ష్యం

రాష్ట్రంలోని 90 లక్షల కుటుంబాలకు ఇంటింటికీ కుళాయి ద్వారా సురక్షితమైన తాగునీటిని అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా గత ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పిస్తూ, పలు కీలక అంశాలపై ప్రతిపక్ష నేతకు సవాల్ విసిరారు. సభలో చంద్రబాబు మాట్లాడుతూ, "ప్రజల తాగునీటి కష్టాలకు శాశ్వత పరిష్కారం చూపేందుకే ఈ రోజు ప్రొద్దుటూరులో ఈ బృహత్కార్యక్రమాన్ని ప్రారంభించాం. తెలుగు జాతి కోసం ప్రాణత్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు గారి స్ఫూర్తితో ఈ పథకానికి 'అమరజీవి జలధార' అని పేరు పెట్టాం. నీళ్లు తాగిన ప్రతిసారీ ఆయన త్యాగం గుర్తుకురావాలి. ఈ పథకం ద్వారా రాష్ట్రంలోని 3 కోట్ల 30 లక్షల మంది ప్రజలకు లబ్ధి చేకూరుతుంది. మహిళల నీటి కష్టాలు తీరడంతో పాటు వారి శ్రమ, సమయం, ఖర్చు ఆదా అవుతాయి" అని వివరించారు. గత ప్రభుత్వం కేంద్రం నిధులను సద్వినియోగం చేసుకోలేకపోయిందని, ఇతర రాష్ట్రాలు వేల కోట్లు వినియోగించుకుంటే, గొడ్డలి పార్టీ కేవలం రూ.2,600 కోట్లు మాత్రమే ఖర్చు చేసి రాష్ట్రానికి అన్యాయం చేసిందని ఆయన ఆరోపించారు. రాయలసీమ అభివృద్ధిపై తనకున్న దార్శనికతను వివరిస్తూ, "ఒకప్పుడు కరువు సీమ, రాళ్ల సీమగా పిలిచిన ఈ ప్రాంతాన్ని రత్నాల సీమగా, దేశంలోనే అగ్రగామిగా నిలబెడతాం. మదనపల్లెలో లక్ష కోట్ల రూపాయలతో ప్రపంచానికి ఒక హార్టికల్చర్ హబ్‌గా తయారు చేసే కార్యక్రమానికి ఇప్పటికే శ్రీకారం చుట్టాం. రెండేళ్లలో రూ.24,000 కోట్లు ఖర్చు చేశాం. గొడ్డలి పార్టీ ఐదేళ్లలో ఖర్చు చేసింది కేవలం రూ.2,500 కోట్లు మాత్రమే. తేడా మీరే గమనించండి" అని అన్నారు."రాయలసీమలో కేవలం హార్టికల్చర్ మాత్రమే కాదు, రాబోయే రెండేళ్లలో నెలకు రెండు శాటిలైట్లను ఇక్కడి నుంచే ప్రయోగించేలా స్పేస్ టెక్నాలజీ, పుట్టపర్తి నుంచి శత్రుదేశాల గుండెల్లో వణుకు పుట్టించే ఐదో తరం ఫైటర్ జెట్‌లను తయారు చేసే ఏరోస్పేస్, డ్రోన్ సిటీ, ఆటోమొబైల్, ఎలక్ట్రానిక్స్, స్టీల్, సిమెంట్, గ్రీన్ ఎనర్జీ వంటి ఎన్నో పరిశ్రమలు రానున్నాయి. ఒకప్పుడు స్వర్ణగిరిగా పిలిపించుకున్న జొన్నగిరిలో మళ్లీ బంగారు గనులు వచ్చాయి. రాయలసీమ సత్తా ఇది. కొప్పర్తి, ఓర్వకల్లు పారిశ్రామిక కేంద్రాలుగా అభివృద్ధి చెందుతాయి. బుల్లెట్ రైళ్లు, రాయల్ ఎన్‌ఫీల్డ్ బుల్లెట్ తయారీ పరిశ్రమ కూడా ఇక్కడికే వస్తుంది. ఈ ప్రాంత యువత బుల్లెట్‌లా దూసుకుపోవాలి" అని చంద్రబాబు పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పనితీరును చంద్రబాబు ప్రశంసించారు. "నా మిత్రుడు పవన్ కల్యాణ్ గ్రామీణాభివృద్ధికి కొత్త రూటు వేశారు. మరెక్కడా లేని విధంగా పవన్ కల్యాణ్ రికార్డు స్థాయిలో ఒకేరోజు 13,326 గ్రామాల్లో గ్రామసభలు పెట్టించారు. ఆయన నాయకత్వంలో రెండున్నర దశాబ్దాల తర్వాత 10 వేల మందికి పైగా ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాం. పంచాయతీలకు రూ.4,136 కోట్ల నిధులు విడుదల చేయించాం. లక్షకు పైగా పంట కుంటలు, గోకులాలు ఏర్పాటు చేశారు. ఆయన నేతృత్వంలో గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కోసం ఐదేళ్లలో రూ.1.30 లక్షల కోట్లు ఖర్చు చేయబోతున్నాం" అని ప్రకటించారు.స్థానిక ఎమ్మెల్యే వరదరాజులు రెడ్డి కోరిక మేరకు ప్రొద్దుటూరు అభివృద్ధికి పలు వరాలు ప్రకటించారు. డ్రైనేజీల నిర్మాణం కోసం రూ.35 కోట్లు, కొర్రపాడు రోడ్డు విస్తరణకు రూ.8 కోట్లు తక్షణమే మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. పెండింగ్‌లో ఉన్న మున్సిపల్ మార్కెట్ రీమోడలింగ్ పనులను త్వరలోనే పరిష్కరిస్తామని, ఇంజినీరింగ్, పాలిటెక్నిక్ కాలేజీల భవన నిర్మాణాలను పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. రాజోలి, అలగనూరు రిజర్వాయర్ల పనులను కూడా పూర్తి చేసి సాగునీటి సమస్యను తీరుస్తామని చంద్రబాబు భరోసా ఇచ్చారు.చివరగా, ప్రజల మద్దతును కోరుతూ, "కేంద్రంలో మోడీ గారి నాయకత్వంలో, రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి పాలనతో డబుల్ ఇంజన్ సర్కార్ బుల్లెట్ వేగంతో దూసుకెళ్తోంది. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా కూటమి అభ్యర్థులను గెలిపిస్తే, ట్రిపుల్ ఇంజన్ సర్కార్ వస్తుంది. అప్పుడు అభివృద్ధి మరింత వేగవంతం అవుతుంది. కుట్ర రాజకీయాలను తిప్పికొట్టి, అభివృద్ధికి పట్టం కట్టండి," అని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సభకు హాజరైన ప్రజల ఉత్సాహాన్ని చూసి, వారికి ధన్యవాదాలు తెలుపుతూ, "భారత్ మాతా కీ జై, తెలుగు తల్లికి జై" నినాదాలతో తన ప్రసంగాన్ని ముగించారు. ఈ క్రమంలో గత ప్రభుత్వంపై చంద్రబాబు తీవ్ర స్వరంతో విరుచుకుపడ్డారు. "ఈ కడప గడ్డ, ప్రొద్దుటూరు నుంచే సవాల్ విసురుతున్నా. వివేకానంద రెడ్డి హత్య కేసులో వాస్తవాలు బయటకు వచ్చాయి. అంతిమ లబ్ధిదారు ఎవరో తేలిపోయింది. రూ.40 కోట్ల సుపారీ గుట్టు విప్పింది. దీనిపై సమాధానం చెప్పే ధైర్యం ఉందా? లిక్కర్ స్కామ్‌లో వేల కోట్లు దోచిన అంతిమ లబ్ధిదారు కూడా నువ్వేనని అన్ని వేళ్లూ నీ వైపే చూపిస్తున్నాయి. సమాధానం చెప్పగలవా?" అని నిలదీశారు. "ఏపీపీఎస్సీ గ్రూప్–1 పరీక్షల్లో అక్రమాలు చేసి యువత జీవితాలతో ఆడుకున్నారు. ఇసుకను దోచుకున్నారు. మేము అధికారంలోకి వచ్చాక ఉచిత ఇసుక విధానం తెచ్చాం. మద్యం ధరల విషయంలోనూ పారదర్శకంగా ఉన్నాం. కానీ, వాళ్లు నేరాలు చేసి, ఆ నెపాన్ని ఎదుటివారిపై రుద్దడమే పనిగా పెట్టుకున్నారు. అదే వారి డీఎన్ఏ. వారికి అభివృద్ధి సిద్ధాంతం కాదు, కుట్రలు, హింసా రాజకీయాలే వారి సిద్ధాంతం" అని దుయ్యబట్టారు.

సిరిసిల్ల పూర్తయింది... ఇక సిద్దిపేట

మెదక్, అక్టోబరు 5 : ఉమ్మడి కరీంనగర్, మెదక్ జిల్లాల్లో గులాబీ పార్టీ బలమైన అడ్డాగా ఉన్న నియోజకవర్గాలపై వ్యూహాత్మకంగా దృష్టి సారించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, సిరిసిల్ల సభ తర్వాత తన తదుపరి పొలిటికల్ టార్గెట్‌గా సిద్ధిపేటను ఎంచుకోవడం తెలంగాణ రాజకీయంలో ఆసక్తిని రేకెత్తిస్తోంది. బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న సిరిసిల్లపై నిధుల వర్షం కురిపిస్తూనే రాజకీయ విమర్శలతో దాడి చేసిన సీఎం రేవంత్, ఇప్పుడు బిఆర్ఎస్ ట్రబుల్ షూటర్ హరీష్ రావు స్వక్షేత్రమైన సిద్ధిపేటలో భారీ బహిరంగ సభకు సిద్ధమవుతున్నారు. అయితే, సిరిసిల్ల రాజకీయ సమీకరణలతో పోలిస్తే సిద్ధిపేట గడ్డపై బిఆర్ఎస్‌ను ఢీకొట్టడం కాంగ్రెస్‌కు అంత సులువైన విషయం కాదన్నది ప్రాథమిక అంచనా.సిద్ధిపేట నియోజకవర్గం దశాబ్దాలుగా గులాబీ జెండాకు తిరుగులేని బలమైన కోటగా ఉంది. 1985లో తొలిసారిగా కేసీఆర్ ఇక్కడి నుంచి గెలిచిన నాటి నుంచి నేటి వరకు ఈ నియోజకవర్గం కేసీఆర్ కుటుంబం చేతుల్లోనే ఉంది. కేసీఆర్ ముఖ్యమంత్రిగా రాష్ట్ర స్థాయి రాజకీయాలకు పరిమితమైన తర్వాత, సిద్ధిపేట బాధ్యతలను స్వీకరించిన హరీష్ రావు నియోజకవర్గాన్ని కేవలం ఒక రాజకీయ స్థానంగా కాకుండా తన సొంత ఇల్లుగా మార్చుకున్నారు. వరుసగా ఆరుసార్లు రికార్డు స్థాయి భారీ మెజార్టీలతో విజయం సాధించడమే కాకుండా, ప్రత్యర్థి పార్టీల ఉనికిని కూడా ప్రశ్నార్థకం చేసే స్థాయికి నియోజకవర్గంలో పట్టు సాధించారు.హరీష్ రావు రాజకీయ విజయంలో ప్రధాన బలం ఆయన పెంపొందించుకున్న వ్యక్తిగత అనుబంధం, నిరంతర అందుబాటు . సిద్ధిపేటలోని ప్రతి గ్రామంలోనూ, ప్రతి వార్డులోనూ హరీష్ రావుకు సొంత కేడర్ ఉంది. ప్రతీ శుభకార్యానికి లేదా అశుభకార్యానికి పలకరించే స్థాయి కార్యకర్తల నెట్‌వర్క్, నియోజకవర్గంలోని ప్రతి కుటుంబంతో ఏదో ఒక రూపంలో నేరుగా కనెక్టివిటీ ఉండటం ఆయనకు శ్రీరామరక్షగా మారింది. దానికి తోడు మంత్రిగా పనిచేసిన సమయంలో రంగనాయక సాగర్ జలాశయం, వైద్య కళాశాల, ఐటీ పార్కు, మోడల్ బస్టాండ్ వంటి ప్రాజెక్టులతో సిద్ధిపేటను అభివృద్ధి నమూనాగా తీర్చిదిద్దడం ఆయన బలాన్ని మరింత ద్విగుణీకృతం చేసింది. సిద్ధిపేటలో కాంగ్రెస్ పార్టీ చారిత్రాత్మకంగా అత్యంత బలహీనమైన స్థితిలోనే ఉందనేది వాస్తవం. ఇక్కడ కాంగ్రెస్ పార్టీకి స్థానిక స్థాయిలో గులాబీ పార్టీ పట్టును తట్టుకోగల బలమైన, జనాకర్షణ కలిగిన నాయకత్వం కరువైంది. సిరిసిల్లలో చేరికలు లేదా అంతర్గత విభేదాలను ఆసరాగా చేసుకుని విమర్శలు గుప్పించే వెసులుబాటు కాంగ్రెస్‌కు ఉన్నప్పటికీ, సిద్ధిపేటలో హరీష్ రావు కేడర్‌ను లేదా ఓటు బ్యాంకును చీల్చడం కాంగ్రెస్‌కు పెద్ద సవాలు. దీంతో, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సభ ఎంత భారీ స్థాయిలో నిర్వహించినప్పటికీ, అది స్థానిక రాజకీయ సమీకరణలను ఎంతవరకు ప్రభావితం చేస్తుందనేది ప్రశ్నార్థకమే సీఎం రేవంత్ రెడ్డి వ్యూహం కేవలం ఎన్నికల విజయం కోసమే కాకుండా, బిఆర్ఎస్ ప్రధాన నాయకత్వంలో మానసిక అభద్రతాభావాన్ని పెంచడమే లక్ష్యంగా కనిపిస్తోంది. హరీష్ రావు అసెంబ్లీలో ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడుతున్న తరుణంలో, ఆయన సొంత నియోజకవర్గంలోనే బహిరంగ సభ పెట్టి అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలతో పాటు రాజకీయంగా సవాల్ విసరడం ద్వారా రేవంత్ రెడ్డి డిఫెన్సివ్ రాజకీయాల కంటే ఎదురుదాడి రాజకీయాలకే ప్రాధాన్యత ఇస్తున్నారని స్పష్టమవుతోంది. ముఖ్యంగా కాంగ్రెస్ కేడర్‌లో ధైర్యం నూరిపోసి, భవిష్యత్తు స్థానిక సంస్థల ఎన్నికల నాటికి పార్టీకి ఊపిరి పోయడం కూడా ఈ పర్యటన ముఖ్య ఉద్దేశం. సిరిసిల్ల తరహాలో సిద్ధిపేటను ఒకే దెబ్బతో డిఫెన్స్‌లో పడేయడం రేవంత్ రెడ్డికి ఏమాత్రం సులభం కాదు. హరీష్ రావు నిర్మించుకున్న వ్యక్తిగత సంబంధాలు, అభివృద్ధి మార్కు , తిరుగులేని సంస్థాగత నిర్మాణం ముందు కాంగ్రెస్ కమ్యూనికేషన్ వ్యూహాలు ఎంతవరకు పారుతాయనేది వేచి చూడాలి. సభ ద్వారా కాంగ్రెస్ కొంత సంచలనం సృష్టించినప్పటికీ, సిద్ధిపేట 'కోట'ను బద్దలు కొట్టాలంటే కేవలం బహిరంగ సభలు మాత్రమే సరిపోవని, సుదీర్ఘమైన క్షేత్రస్థాయి వ్యూహం అవసరమని భావిస్తున్నారు.

ఘనంగా అశోక్ సింఘాల్ శత జయంతి వేడుకలు

హైదరాబాద్ : హైదరాబాద్‌లో విశ్వహిందూ పరిషత్ అగ్రనేత దివంగత అశోక్ సింగల్ శతజయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు భారత మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అశోక్ సింగల్ శత జయంతి వేడుకల సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్వహిందూ పరిషత్ హిందూ సమాజ సంఘటితం కోసం మరియు ధార్మిక చైతన్యం కోసం అయోధ్య శ్రీరామ జన్మభూమి ఉద్యమంలో అశోక్ సింగల్ పోషించిన కీలక పాత్రను స్మరించుకున్నారు. అలాగే విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఢిల్లీలో నిర్వహించిన కార్యక్రమంలో అశోక్ సింగల్ పాత్ర పోషించిన గురించి తెలిపారు. 25 లక్షల మందితో ప్రోగ్రాంను నిర్వహించడాన్ని కొనియాడారు . శ్రీరామ జన్మభూమి ఏర్పాటు చేయడంలో అశోక్ సింగల్ పాత్ర గణనీయమైందని అన్నారు

తెలంగాణలో 'సర్' పేరుతో 90 లక్షల ఓట్లు తీసేశారు

నిరంతర కార్యక్రమాలు నిర్వహించాలని చర్చించామని అన్నారు. కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌కు వ్యతిరేకంగా ధర్నాలు, ర్యాలీలు నిర్వహిస్తున్నామని చెప్పుకొచ్చారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఒత్తిడితోనే ఎన్నికల కమిషనర్ ఇలా వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. వెంటనే కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని మహేశ్ గౌడ్ డిమాండ్ చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు ఉండాలని రాహుల్ గాంధీ చెప్పారని అన్నారు. ఈ నెల 6,7వ తేదీల్లో గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు టీపీసీసీ ఆధ్వర్యంలో ధర్నాలు, ర్యాలీలు నిర్వహిస్తామని వెల్లడించారు. అక్టోబరు 8వ తేదీన లోక్‌భవన్ ఎదుట ఆందోళన నిర్వహిస్తామని మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.

రక్షకులే రాక్షసుల్లా మారితే ఎలా

వారి ఫిర్యాదుపై కనీసం ఎఫ్ఐఆర్ కూడా నమోదు చేయలేదని పేర్కొన్నారు. మహిళలు ఫిర్యాదు చేసేందుకు వెళ్తే.. పోలీస్‌స్టేషన్‌లోనే ఇలాంటి ఘటనలు జరగడం దారుణమని రాహుల్‌గాంధీ ఆవేదన వ్యక్తంచేశారు. రక్షించాల్సిన వారే వారికి ప్రమాదంగా మారుతున్నారని ఆరోపించారు. సాకేత్ పోలీస్‌స్టేషన్‌లోని సీసీటీవీ దృశ్యాలను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. బాధ్యులైన పోలీసు అధికారులపై తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. కాగా ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామాను డిమాండ్ చేస్తూ ఇటీవల పెద్దఎత్తున ఆందోళనలు జరిగాయి. ఈ సందర్భంగా మహిళా నిరసనకారులు, జర్నలిస్టులపై పోలీసులు అనుచితంగా ప్రవర్తించారని తీవ్రమైన ఆరోపణలు వెల్లువెత్తు తున్నాయి.

భారత్-అమెరికా వాణిజ్య చర్చల్లో స్తబ్దత

అమెరికా తీవ్రంగా ప్రయత్నిస్తోందని ఆమె వెల్లడించారు. సోమవారం ఢిల్లీలో నిర్వహించిన 'మ్యూనిచ్ లీడర్స్ మీటింగ్ 2026'లో ఆమె మాట్లాడారు. "వాణిజ్య ఒప్పందం కోసం ఇరు దేశాలు పట్టుదలగా చర్చలు జరిపాయి. ప్రస్తుతం ఇచ్చిపుచ్చుకునే ధోరణికి అతీతంగా చర్చలను ముందుకు తీసుకెళ్లడం కష్టతరంగా మారింది" అని ఆమె అభిప్రాయపడ్డారు. అయినప్పటికీ, ఈ చర్చలను మరింత ముందుకు తీసుకెళ్లే అవకాశాలను ఇరుపక్షాలు అన్వేషించవచ్చని సూచించారు. భారత్‌తో వాణిజ్యం వల్ల తమకు ఏళ్లుగా నష్టం జరుగుతోందన్న అమెరికా ఆందోళన ఈ చర్చల్లో స్పష్టంగా ప్రతిబింబిస్తోందని ఆమె తెలిపారు. ఫిబ్రవరి 2026లో ప్రకటించిన మధ్యంతర వాణిజ్య ఒప్పంద ముసాయిదా ప్రాతిపదికన ఈ చర్చలు కొనసాగుతున్నాయి. ఇదే క్రమంలో భారత్–యూరోపియన్ యూనియన్ (ఈయూ) మధ్య కుదిరిన వాణిజ్య ఒప్పందాన్ని ఆమె ఒక విజయవంతమైన ఉదాహరణగా పేర్కొన్నారు. యూరోపియన్ కమిషన్ ప్రెసిడెంట్ అభివర్ణించినట్లుగా ఇది 'తల్లి లాంటి ఒప్పందం' అని ఆమె కొనియాడారు. ఈ ఒప్పందంలో భాగంగా భారత్ 92.5 శాతం టారిఫ్ లైన్లను, 97 శాతం వాణిజ్య విలువను అందుబాటులోకి తెస్తే, ఈయూ తన వైపు నుంచి 97 శాతం టారిఫ్ లైన్లను, 99 శాతం వాణిజ్య విలువను విముక్తం చేసిందని ఆమె వివరించారు.

9లోగా రూ.లక్ష కట్టకపోతే ఇందిరమ్మ ఇల్లు రద్దు!

హైదరాబాదు లబ్ధిదారులకు అల్టిమేటం..

ఇళ్ల లబ్ధిదారులకు ప్రభుత్వం తుది హెచ్చరిక

అక్టోబరు 9 లోగా డబ్బులు చెల్లించాలని ఆదేశం

హైదారాబాద్, అక్టోబర్ 05 : హైదరాబాద్ నగరంలో క్యూర్ పరిధిలోని ఇందిరమ్మ ఇళ్ల టవర్ల లబ్ధిదారులకు తెలంగాణ హౌసింగ్ బోర్డు కీలక ప్రకటన చేసింది. లబ్ధిదారులు తమ వాటాగా చెల్లించాల్సిన లక్ష రూపాయల మొత్తానికి అక్టోబరు 9వ తేదీని తుది గడువుగా నిర్ణయించింది. ఈ గడువులోగా డబ్బు చెల్లించని వారి ప్రొవిజినల్ అలాట్‌మెంట్ లెటర్లను ఎలాంటి ముందస్తు నోటీసు లేకుండానే రద్దు చేస్తామని స్పష్టం చేసింది. తెలంగాణ హౌసింగ్ బోర్డు వైస్ చైర్మన్, హౌసింగ్ కమిషనర్ వి.పి.గౌతమ్ ఆదివారం ఈ వివరాలు వెల్లడించారు. క్యూర్ పరిధిలోని 16 అసెంబ్లీ నియోజకవర్గాల్లో మొత్తం 5,501 మందికి ప్రొవిజినల్ అలాట్‌మెంట్ లెటర్లు జారీ చేయగా, ఇప్పటివరకు 3,271 మంది (దాదాపు 59.46 శాతం) మాత్రమే తమ చెల్లింపులు పూర్తి చేసినట్లు తెలిపారు. మిగిలిన లబ్ధిదారులు కూడా వెంటనే స్పందించి, గడువులోగా ఆన్‌లైన్‌లో చెల్లింపులు పూర్తి చేయాలని ఆయన కోరారు. అక్టోబరు 9 తర్వాత గడువును పొడిగించే ప్రసక్తే లేదని కమిషనర్ గౌతమ్ తేల్చిచెప్పారు. గడువులోగా చెల్లించడంలో విఫలమైన వారి కేటాయింపులను రద్దు చేసి, ఆ ఖాళీలను వెయిటింగ్ లిస్టులో ఉన్న సుమారు 35 వేల మంది అర్హులైన దరఖాస్తుదారులకు కేటాయిస్తామన్నారు. రాబోయే నెలల్లో లాటరీ పద్ధతిలో ఈ కేటాయింపులు ఉంటాయని ఆయన వివరించారు. అయితే, ప్రభుత్వం ఆన్‌లైన్‌లో డబ్బు చెల్లించాలని చెబుతుండటంతో, ఆ పద్ధతి తెలియని పలువురు లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. పథకం, కేటాయింపు, చెల్లింపులకు సంబంధించిన పూర్తి సమాచారం కోసం లబ్ధిదారులు తెలంగాణ హౌసింగ్ బోర్డు అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించాలని లేదా హౌసింగ్ బోర్డు కాల్ సెంటర్ 040–24603572లో సంప్రదించాలని అధికారులు సూచించారు.

బీజేపీ బూచి రాజకీయాలకు ముగింపు

చెన్నై : తమిళనాడు రాజకీయాలు ఎప్పుడూ దేశ రాజకీయాలకు భిన్నమైన వైఖరితో నడుస్తుంటాయి. ద్రవిడ భావజాలం, స్వయంప్రతిపత్తి నినాదాలతో దశాబ్దాలుగా కేంద్రంలోని బీజేపీని బద్ధ శత్రువుగా చిత్రీకరిస్తూ నడిచిన తమిళ రాజకీయం.. ఇప్పుడు ఊహించని మలుపు తిరిగింది. ఒకప్పుడు బీజేపీని , కాషాయ రాజకీయాలను తీవ్రంగా వ్యతిరేకించడమే తమిళనాడులో గెలుపు మంత్రంగా ఉండేది. కానీ ఇప్పుడు ఆ భావజాలం కనుమరుగై, అన్ని ప్రధాన శక్తులూ కేంద్రంతో ఘర్షణను పక్కనపెట్టి వ్యూహాత్మక సర్దుబాట్ల వైపు అడుగులు వేస్తున్నట్లు స్పష్టమవుతోంది. రాష్ట్రంలోని ఏ ఒక్క ప్రధాన పార్టీ కూడా ఇప్పుడు బీజేపీపై బాహాటంగా యుద్ధం ప్రకటించే స్థితిలో లేకపోవడం సరికొత్త రాజకీయ వాస్తవికతను ఆవిష్కరిస్తోంది.ఒకవైపు ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న అన్నాడీఎంకే మళ్లీ అధికారికంగా ఎన్డీయే గూటికి చేరి బీజేపీతో పొత్తును కొనసాగిస్తుండగా.. అధికారం కోల్పోయిన ద్రవిడ మున్నేట్ర కళగం వైఖరిలో వచ్చిన విస్మయకర మార్పు రాజకీయ వర్గాలను ఆశ్చర్యపరుస్తోంది. ఓటమి ఎదురైన వెంటనే కాంగ్రెస్‌తో బంధాన్ని తెంచుకుని దూరంగా జరిగిన డీఎంకే.. ఇప్పుడు బీజేపీపై ఒక్క విమర్శ కూడా చేయకుండా పూర్తిగా మౌనముద్ర దాల్చింది. సనాతన ధర్మం, హిందీ వ్యతిరేకత, కేంద్ర నిధుల వివక్ష అంటూ గతంలో రోజూ విరుచుకుపడే ఉదయనిధి స్టాలిన్ వంటి దూకుడు నేతలు సైతం ఇప్పుడు కేంద్రంపై తీవ్రమైన వ్యాఖ్యలు చేయకుండా నోరు కట్టేసుకున్నారు. కేంద్ర దర్యాప్తు సంస్థల భయం, ద్రవిడ ఓటు బ్యాంకులో మార్పులు డీఎంకేను బీజేపీపై సైలెంట్ అయ్యేలా ఒత్తిడి చేశాయన్నది బహిరంగ రహస్యం.మరోవైపు నూతన రాజకీయ శక్తిగా అవతరించి ప్రభుత్వం ఏర్పాటు చేసిన తలపతి విజయ్ నేతృత్వంలోని టీవీకే తీరు మరింత ఆసక్తికరంగా ఉంది. కాంగ్రెస్, వామపక్షాలు, ఇతర పార్టీల మద్దతుతో సెక్యులర్ సోషల్ జస్టిస్ విక్టరీ అలయన్స్ పేరిట సంకీర్ణ ప్రభుత్వాన్ని నడుపుతున్నప్పటికీ.. విజయ్ జాతీయ స్థాయిలో రాహుల్ గాంధీ కూటమి ప్రాబల్యంలోకి వెళ్లలేదు. ఢిల్లీ వేదికగా ఇండియా కూటమి కేంద్ర ఎన్నికల సంఘంపై సాగిస్తున్న సేవ్ డెమోక్రసీ ఉద్యమానికి గానీ, ఈవీఎంల వ్యతిరేక ప్రచారాలకు గానీ విజయ్ ప్రభుత్వం ఎలాంటి మద్దతు ప్రకటించకపోవడం గమనార్హం. కాంగ్రెస్‌ను తన కూటమిలో ఒక భాగస్వామిగా మాత్రమే ఉంచుకుంటూ.. ఢిల్లీ స్థాయిలో బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వంతో ఎటువంటి ఘర్షణాత్మక వైఖరి లేకుండా సమదూర సంబంధాన్ని కొనసాగిస్తున్నారు.గతంలో తమిళనాడు ఎన్నికల్లో బలంగా పనిచేసిన యాంటీ-బీజేపీ సెంటిమెంట్ ఇప్పుడు తన పదును పూర్తిగా కోల్పోయింది. అన్నాడీఎంకే పొత్తుతో ఉండగా, అధికారం కోల్పోయిన డీఎంకే రాజీ ధోరణిలోకి వెళ్లిపోయింది. అటు కొత్తగా అధికారంలోకి వచ్చిన విజయ్ టీవీకే కేంద్రంతో ఘర్షణ పడే సాహసం చేయడం లేదు. ఈసీ వ్యవహారాలు, కేంద్ర విధానాలపై తమిళనాడు పార్టీలు గళం విప్పకపోవడం.. ద్రవిడ ఉద్యమ పునాదుల్లో సిద్ధాంతాల కంటే అధికార మనుగడ, లబ్ధి మాత్రమే మిగిలాయని నిరూపిస్తోంది. ఒకప్పుడు తీవ్ర ప్రతిఘటనను ఎదుర్కొన్న బీజేపీ.. నేడు తమిళనాట తన వ్యతిరేకతను పూర్తిగా పలుచన చేసి, రాష్ట్ర రాజకీయాలను తన నియంత్రణలోకి తెచ్చుకోవడంలో తెరవెనుక వ్యూహాత్మక విజయం సాధించిందని అనుకోవచ్చు.

దేశంలో మునుపటి శాంతి కనిపించడం లేదు

బీజేపీ పాలనలో ప్రజలకు భద్రత కరువు

బాలీవుడ్ నటుడు సంజయ్ దత్ సంచలన వ్యాఖ్యలు

సంజయ్ దత్ వ్యాఖ్యలపై రాజకీయ దుమారం

సంజయ్ వ్యాఖ్యలకు మద్దతు తెలిపిన కాంగ్రెస్

సరదాగా చేసిన వ్యాఖ్యలని సంజయ్ దత్ వివరణ

న్యూఢిల్లీ, అక్టోబర్ 05 : బాలీవుడ్ నటుడు సంజయ్ దత్ చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా పెను దుమారాన్ని రేపాయి. దేశంలో మునుపటిలా శాంతియుత వాతావరణం కనిపించడం లేదంటూ ఆయన చేసిన వ్యాఖ్యలకు కాంగ్రెస్ పార్టీ మద్దతుగా నిలిచింది. బీజేపీ ప్రభుత్వాల హయాంలో ప్రజలకు భద్రత కరవైందని కాంగ్రెస్ నేతలు ఆరోపించారు. అయితే, తన వ్యాఖ్యలు కేవలం సరదా సంభాషణలో భాగమని సంజయ్ దత్ తర్వాత వివరణ ఇచ్చారు. కాంగ్రెస్ నేత నానా పటోలే మాట్లాడుతూ, సంజయ్ దత్ "నికార్సయిన నిజం" పలికారన్నారు. బీజేపీ పాలిత ప్రాంతాల్లో పట్టపగలే హత్యలు జరుగుతున్నాయని, ప్రజలు అభద్రతాభావంతో ఉన్నారని ఆరోపించారు. ప్రజల ఆందోళనలను ప్రభుత్వం తీవ్రంగా పరిగణించాలని ఆయన సూచించారు. మరో కాంగ్రెస్ ఎంపీ ప్రమోద్ తివారీ కూడా సంజయ్ దత్‌కు మద్దతిచ్చారు. ఒత్తిడి కారణంగానే ఆయన తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకున్నారని, ఆయన మాటలు హృదయాంతరాల నుంచి వచ్చాయని అన్నారు. అయితే, శివసేన (యూబీటీ) అధికార ప్రతినిధి ఆనంద్ దూబే భిన్నంగా స్పందించారు. సంజయ్ దత్ వ్యాఖ్యలను ఆయన మాట్లాడిన సందర్భాన్ని బట్టి అర్థం చేసుకోవాలన్నారు. దేశం శాంతియుతంగానే ఉందని, ఉజ్వల భవిష్యత్తు వైపు సాగుతోందని తెలిపారు. "ఇక్కడ ఏదైనా తప్పుగా అనిపించిన వారు, వేరే చోటికి వెళ్లిపోవచ్చు" అని ఆయన వ్యాఖ్యానించారు. ఈ వివాదంపై సంజయ్ దత్ ఆదివారం స్పష్టత ఇచ్చారు. శేఖర్ సుమన్ టాక్ షోలో తాను చేసిన వ్యాఖ్యలు సరదా సంభాషణలో భాగమని, ఎవరినీ కించపరిచే ఉద్దేశం లేదని ఎక్స్‌లో పోస్ట్ చేశారు. 'గాంధీగిరి' స్ఫూర్తితో ప్రేమ, ఐక్యతను ప్రోత్సహించే ఉద్దేశంతోనే ఆ వ్యాఖ్యలు చేసినట్లు వివరించారు. గాంధీ జయంతి సందర్భంగా జరిగిన ఈ షోలో, "దేశంలో మునుపటి శాంతి కనిపించడం లేదు. ఆ మంచి రోజులు మళ్లీ రావాలని శివుడిని ప్రార్థిస్తున్నా" అని సంజయ్ దత్ వ్యాఖ్యానించారు.

శంషాబాద్ విమానాశ్రయంలో బంగారం సీజ్

రూ.1.20 కోట్ల విలువైనదిగా గుర్తింపు

హైదారాబాద్, అక్టోబర్ 05 : శంషాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం (ఆర్‌జీఐఏ)లో డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్‌ఐ) అధికారులు భారీగా బంగారం పట్టుకున్నారు. సోమవారం ఓ ప్రయాణికుడి నుంచి సుమారు 800 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ రూ. 1.20 కోట్లు ఉంటుందని అంచనా వేశారు.

వణికిస్తున్న అనుమానాస్పద వైరస్

రష్యా ల్యాబ్‌లో గుర్తుతెలియని ఇన్ఫెక్షన్?

ఒకరు మృతి.. వందలమంది క్వారంటైన్

అప్రమత్తమైన అమెరికా, ప్రపంచ దేశాలు!



న్యూఢిల్లీ, అక్టోబర్ 05 : ష్యాలో కొత్త ఇన్?ఫెక్షన్? భయాలు చెలరేగాయి. సైబీరియాలోని ఓ పరిశోధన కేంద్రంలో పనిచేసే ల్యాబ్? టెక్నీషియన్? తెలియని ఇన్ఫెక్షన్?తో మరణించడంతో, అధికారులు ముందు జాగ్రత్త చర్యగా వందల మందిని క్వారంటైన్?లో ఉంచారు. అమెరికా విదేశాంగ శాఖ ఈ వార్తపై స్పందించింది. ఈ ఇన్?ఫెక్షన్?/ వ్యాధి గురించి కచ్చితమైన సమాచారాన్ని వెంటనే విడుదల చేయాలని మాస్కోను కోరింది. అమెరికా విదేశాంగ శాఖకు చెందిన ఓ అధికారి మీడియాతో మాట్లాడుతూ, ఆగ్నేయ సైబీరియాలో వెలుగుచూసిన ఈ ఇన్?ఫెక్షన్ వ్యాధి గురించి తమకు సమాచారం ఉందని అన్నారు. ఈ పరిస్థితిని అమెరికా వ్యాధి నియంత్రణ, నివారణ కేంద్రాల(సీడీసీ)తో పాటు ఇతర సంస్థలు నిశితంగా పరిశీలిస్తున్నట్లు తెలిపారు. మరోవైపు అమెరికా సెంట్రల్ ఇంటెలిజెన్స్ మాజీ అధికారి డాన్ హాఫ్?మెన్ మాట్లాడుతూ, ఈ ఘటనకు సంబంధించిన సమాచారాన్ని అమెరికా గూఢచార యంత్రాంగం సేకరిస్తున్నట్లు తెలిపారు. సైబీరియాలోని యాంటీ-ప్లేగ్? పరిశోధన కేంద్రంలో ఇటీవల ఓ ప్రమాదం జరిగినట్లు సీఎన్ఎన్ వార్త సంస్థ నివేదించింది. ఆ తర్వాత అక్కడ పనిచేసిన ఒక ల్యాబరేటరీ టెక్నీషియన్? తెలియని ఇన్?ఫెక్షన్?తో మరణించారు. ఇర్కుట్స్క్? సమీపంలోని షెలెఖోవ్?లో ఉన్న యాంటీ-ప్లేగ్? రీసెర్చ్? ఇన్?స్టిట్యూట్?లో ఈ ఘటన జరిగిందని రష్యా ప్రభుత్వ వార్త సంస్థ టాస్ పేర్కొంది. మరోవైపు అంటువ్యాధుల పర్యవేక్షణ సంస్థ రోస్పోట్రెబ్నాడ్జోర్? దీనిపై కీలక విషయాలు వెల్లడించింది. సదరు ఉద్యోగి మరణానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదని పేర్కొంది. అతనికి న్యుమెనియా లాంటి లక్షణాలు మాత్రం కనిపించాయని, అయితే ఆ వ్యాధి లేదా ఇన్?ఫెక్షన్ ఏమిటో ఇంకా నిర్ధరణ చేయాల్సి ఉందని పేర్కొంది. ఇర్కుట్స్క్? , షెలెఖోవ్? నగరాల్లో పారిశుద్ధ్యం లేక అంటువ్యాధులు బాగా ప్రబలుతున్నాయని రోస్పోట్రెబ్నాడ్జోర్? పేర్కొంది. ఏది ఏమైనపప్పటికీ, ల్యాబ్? ఉద్యోగి మృతి కేసులో తాము ప్రత్యేక ప్రోటోకాల్?ను అమలు చేస్తున్నట్లు తెలిపింది. అయితే న్యూమోనిక్ ప్లేగ్? సంభవించి ఉండవచ్చనే ఆందోళనలు చెలరేగాయి. మరణించిన ల్యాబ్ టెక్నీషియన్? ఒక 28 ఏళ్ల మహిళ అని, ఆమె బహుశా ప్లేగ్? వ్యాధితో మరణించి ఉంటుందని బురియాటియా రిపబ్లిక్ నాయకుడు అలెక్సీ సిడెనోవ్? పేర్కొన్నారు. ప్లేగ్ వ్యాధి వ్యాపిస్తోందని వార్తల నేపథ్యంలో, ప్రధాన వైద్యాధికారులతో స్థానిక అంటువ్యాధుల నివారణ మండలి అత్యవసర సమావేశం నిర్వహించింది. ఆ తర్వాత ఇర్కుట్స్క్? గవర్నర్? ఇగోర్ కోబ్జెన్? మాట్లాడుతూ, ప్రజలు ఆందోళన చెందవద్దని, ప్రశాంతంగా ఉండాలని కోరారు. షెలెఖోవ్ పరిసర ప్రాంతాల్లో అదనపు భద్రతా చర్యలు ఏర్పాటు చేశామని చెప్పారు. మరోవైపు ఇన్?ఫెక్షన్? ప్రబలిన పరిశోధన కేంద్రానికి సమీపంలో ఉన్న అల్యూమినియం కర్మాగారం తమ సిబ్బందిని ముఖానికి మాస్కులు ధరించాలని ఆదేశించింది. సదరు కర్మాగారం అధిపతి ఆర్టెమ్ ఫోమినిఖ్? మాట్లాడుతూ, ఈ ఇన్?ఫెక్షన్ వ్యాప్తిపై దేశంలో ఊహాగానాలు, రూమర్లు, పరస్పర విరుద్ధంగా ఉన్న నివేదికలు ప్రచారంలో ఉన్నాయని అన్నారు. ప్రజలు వాటిని నమ్మవద్దని, ప్రశాంతంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. అంతేకాదు మరణించిన ల్యాబ్? టెక్నీషియన్?తో సన్నిహితంగా ఉన్న వారందరినీ వైద్యుల పర్యవేక్షణలో ఉంచారని, ప్రస్తుతం వారిలో ఎలాంటి వ్యాధి లక్షణాలు కనిపించలేదని ఆయన అన్నారు.

కేబీఆర్ పార్క్ చుట్టూ శాశ్వతంగా వన్‌వే

జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్ ప్రకటన

హైదారాబాద్, అక్టోబర్ 05 : హైదరాబాద్ నగరంలోని కేబీఆర్ పార్క్ చుట్టూ ప్రస్తుతం ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్న వన్-వే ట్రాఫిక్ విధానాన్ని శాశ్వతం చేయనున్నట్లు జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్ సోమవారం ప్రకటించారు. దీనితో పాటు, ఈ ప్రాంతంలో గతంలో ప్రతిపాదించిన హెచ్-సిటీ ఇన్‌ఫ్రా పనుల్లో కొన్నింటిని రద్దు చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ నిర్ణయం ద్వారా సుమారు రూ. 400 కోట్ల మేర ప్రజాధనం ఆదా కానుంది. సోమవారం కేబీఆర్ పార్క్, జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ మార్గాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించిన అనంతరం కమిషనర్ మీడియాతో మాట్లాడారు. వన్-వే విధానం, ఫ్రీ-లెఫ్ట్ టర్న్‌ల ఏర్పాటు వల్ల ట్రాఫిక్ రద్దీ గణనీయంగా తగ్గి, వాహనాల రాకపోకలు మెరుగుపడ్డాయని ఆయన తెలిపారు. సవరించిన ప్రణాళిక ప్రకారం, నాగార్జున సర్కిల్ నుంచి జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ వరకు ఆరు వరుసల స్టీల్ బ్రిడ్జి (ఫ్లైఓవర్) నిర్మిస్తామని, దీనిని ఏడాది కాలంలోనే పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు. అలాగే కేబీఆర్ పార్క్ సమీపంలో ఒక అండర్‌పాస్?ను కూడా నిర్మించనున్నట్లు పేర్కొన్నారు. గతంలో హెచ్-సిటీ ప్రాజెక్టు కింద రూ. 1,090 కోట్ల అంచనా వ్యయంతో కేబీఆర్ పార్క్ చుట్టూ పలు ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు నిర్మాణాన్ని ప్రతిపాదించారు. అయితే, ప్రస్తుతం అమలు చేస్తున్న వన్-వే విధానం విజయవంతం కావడం, కోర్టు కేసుల వంటి పరిణామాల నేపథ్యంలో అధికారులు ఈ ప్రణాళికలను పునఃసమీక్షించారు. ట్రాఫిక్ సమస్యను నివారించేందుకు అత్యవసరమైన చోట మాత్రమే ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు నిర్మించాలని నిర్ణయించారు. ఈ మార్పుల ద్వారా నగరంలోని అత్యంత రద్దీ ప్రాంతాల్లో ట్రాఫిక్ ఇబ్బందులకు శాశ్వత పరిష్కారం లభించడమే కాకుండా, పెద్ద ఎత్తున ప్రజాధనం ఆదా అవుతుందని అధికారులు భావిస్తున్నారు.

ఓటర్ల జాబితా సవరణ ఈసీ ప్రక్రియే

ప్రజలను విపక్షాలు తప్పుదోవ పట్టిస్తున్నాయి

దొంగ ఓటర్లను తొలగించడమే లక్ష్యం

రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు రామచందర్ రావు

హైదారాబాద్, అక్టోబర్ 05 : ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్) ప్రక్రియపై ప్రతిపక్షాలు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రామచందర్ రావు విమర్శించారు. ఇది బీజేపీ చేస్తున్న కార్యక్రమం కాదని, భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) చేపట్టిన ప్రక్రియ అని స్పష్టం చేశారు. దొంగ ఓట్లు, చనిపోయిన వారి ఓట్లను జాబితా నుంచి తొలగించడమే దీని ముఖ్య ఉద్దేశమని ఆయన తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ, "ఈ ప్రక్రియను బీజేపీ ప్రవేశపెట్టలేదు, ఇది ఎన్నికల సంఘం చేపట్టిన ప్రక్రియ అని ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఓవైసీ, ఇతర నేతలు తెలుసుకోవాలి. కాంగ్రెస్ హయాంలో కూడా ఇది జరిగింది. అప్పుడు వ్యతిరేకించని వారు ఇప్పుడు ఎందుకు వ్యతిరేకిస్తున్నారు?" అని ప్రశ్నించారు. కేరళలో ఎస్ఐఆర్ తర్వాత కాంగ్రెస్ గెలిచినా, దానికి వారి వద్ద సమాధానం లేదని ఎద్దేవా చేశారు. "కాంగ్రెస్ లేదా ఇండియా కూటమి ఎన్నికల్లో ఓడిపోయినప్పుడల్లా ఈసీపై లేదా ఈవీఎంలపై నిందలు వేయడం అలవాటుగా మారింది. గత 12 ఏళ్లుగా బీజేపీ అధికారంలో ఉండటంతో ఓవైసీ, కాంగ్రెస్ పార్టీలు ఉన్నాయి. అందుకే ఎస్ఐఆర్ గురించి ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నాయి" అని రావు ఆరోపించారు. చనిపోయినవారు, నకిలీ ఓటర్లు, విదేశీయుల పేర్లను తొలగించడం, వేరే ప్రాంతాలకు వలస వెళ్లిన వారి ఓట్లను అక్కడికి మార్చడమే ఎస్ఐఆర్ ఉద్దేశమని ఆయన వివరించారు. కాగా, ఈ ప్రక్రియ ద్వారా ఓటర్లను ఉద్దేశపూర్వకంగా తొలగిస్తున్నారని, ఇది బీజేపీకి లబ్ధి చేకూర్చేందుకేనని ఆరోపిస్తూ ప్రతిపక్షాలు ఆదివారం ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద, దేశంలోని పలు ప్రాంతాల్లో నిరసనలు చేపట్టాయి. ముసాయిదా జాబితా నుంచి 13 కోట్ల పేర్లను తొలగించారని వారు ఆరోపిస్తున్నారు. అయితే, అధికార బీజేపీ ఈ ఆరోపణలను తోసిపుచ్చింది.

పంటలు ఎండిపోతున్న ప్రభుత్వానికి పట్టదా..

కరెంటు కోతలకు నిరసనగా సబ్ స్టేషన్ ఎదుట ఆందోళన

హత్నూర, అక్టోబర్05 : చేతికొస్తున్న వరి పంటలు ఎండిపోతుంటే నిరంతరం కరెంటు కోతలు విధిస్తూ రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్న ప్రభుత్వానికి రైతుల కష్టాలు పట్టవా అంటూ సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం నస్తీపూర్ సబ్ స్టేషన్ ఎదుట మంగాపూర్ గ్రామ రైతులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి రైతులను నానా ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. పంట సాగు నుండి పంట చేతికొచ్చే దశ వరకు రైతులను అన్ని రకాలుగా ప్రభుత్వం ఇబ్బందులు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మొన్నటి వరకు యూరియా కోసం నానా ఇబ్బందులకు గురిచేసిన ప్రభుత్వం చేతికొచ్చిన పంటలను దక్కించుకుందామంటే కరెంటు కోతలు విధిస్తూ పంటలు ఎండిపోయే దుస్థితికి తీసుకువస్తుందన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఏనాడూ ఇంతటి కష్టం రైతులకు రాలేదని ఇప్పుడే ఎందుకు ఇంత అద్వాన పరిస్థితులు వస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒకవైపు 24 గంటల కరెంటు ఇస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్న ప్రభుత్వం ఆచరణలో మాత్రం కేవలం 6 గంటలు కూడా వ్యవసాయానికి సక్రమంగా ఇవ్వలేకపోతుందని ఆరోపించారు. రాత్రి సమయంలో కరెంటు కోతలు విధిస్తూ పగలు కరెంటు ఇస్తున్నాం అంటున్న విద్యుత్ అధికారులు పగలు సైతం సక్రమంగా ఇవ్వకపోగా ఇచ్చే కరెంటు సైతం లో వోల్టేజీ ఇస్తూ కోతలు విధిస్తుందన్నారు. దీంతో చేతికి వస్తున్న పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రైతులకు నాణ్యమైన కరెంటు ఇవ్వాలని లేని పక్షంలో ఎక్కడికక్కడ ఆందోళన ఉదృతం చేస్తామని హెచ్చరించారు.

క్రికెట్ బ్రోచర్లను విడుదల చేసిన మంత్రులు

తెలంగాణలో డిగ్రీ కాలేజీ విద్యార్థుల్లో యువ క్రికెట్ ప్రతిభను వెలికితీసేందుకు టోర్ని నిర్వహించడం అభినందనీయమని మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పోన్నం ప్రభాకర్ లు తెలిపారు. సోమవారం మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పోన్నం ప్రభాకర్ లు క్రికెట్ బ్రోచర్లను విడుదల చేశారు.జనవరిలో జరిగే ఈ టోర్నమెంట్ లో విద్యార్థులు పాల్గొనాలని సూచించారు. విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీసేందుకు చేస్తున్న క్రిషిని మంత్రి శ్రీధర్ బాబు అభినందించారు. మరో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ గ్రామీణ విద్యర్థులను ప్రోత్సహించేందుకు ఈ తరహా పోటీలు అవసరమని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల ప్రతిభావంతులకు వేదికగా నిలుస్తూ కళాశాలల స్థాయిలో క్రికెట్ టోర్నీ నిర్వహిస్తున్నారు.గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు టీ 20 క్రికెట్ బాష్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు డాక్టర్ ఆకునూరు గౌతమ్, వి. అజయ్, రామక్రిష్ణలు తెలిపారు. ఈ టోర్నీలో ఆడి సత్తా చాటుకోవాలనుకునేవారు వెంటనే తమ పేర్లు నమోదు చేసుకోవాలి. జిల్లా, ప్రాంతీయ స్థాయిల మ్యాచ్‌లు నాకౌట్ పద్ధతిలో జరుగుతాయి. మ్యాచ్ సమయంలో రెండు జట్ల ఆటగాళ్లు తమ కళాశాల గుర్తింపు కార్డు (ఒరిజినల్), వయసు ధ్రువీకరణకు పదో తరగతి మెమో (ఒరిజినల్)ను నిర్వాహకులకు తప్పనిసరిగా చూపించాలి. మ్యాచ్ జరిగే సమయంలో బ్యాటర్లు, వికెట్ కీపర్ తప్పనిసరిగా హెల్మెట్లు, లెగ్ ప్యాడ్లు, అండర్ గార్డ్స్, హ్యాండ్ గ్లోవ్స్, వైట్ డ్రెస్, వైట్ షూ ధరించాలి. అన్ని విషయాల్లో నిర్వాహకులదే తుది నిర్ణయ కానుంది. నాకౌట్ పద్ధతిలోజిల్లా, ప్రాంతీయ, తుది దశల్లో పోటీలు జరుగుతాయి తెలంగాణ రాష్ట్రాలలో కొత్త జిల్లాల ప్రాతిపదికన పోటీలు నిర్వహిస్తారు. మరిన్ని వివరాలకు అజయ్ 8186936117 నెంబర్లలో సంప్రదించాలి

ఓటుకు నోటు కేసులో కీలక మలుపు

సుప్రీంకోర్టులో స్టీఫెన్‌సన్ ఇంప్లీడ్ పిటిషన్

బాధితుడిగా వాదనలు వినాలని కోర్టుకు విజ్ఞప్తి

రేవంత్ రెడ్డి పిటిషన్‌పై వాడీవేడీగా విచారణ

హైదారాబాద్, అక్టోబర్ 05 : తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన 2015 నాటి ఓటుకు నోటు కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ప్రధాన ఫిర్యాదుదారు, నామినేటెడ్ మాజీ ఎమ్మెల్యే స్టీఫెన్‌సన్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. తన వాదనలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని కోరుతూ ఆయన సర్వోన్నత న్యాయస్థానంలో ఇంప్లీడ్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ కేసు విచారణలో భాగంగా అదనపు వాదనలు వినిపించేందుకు తనకు అవకాశం కల్పించాలని స్టీఫెన్‌సన్ తన పిటిషన్‌లో కోరారు. ప్రధాన ఫిర్యాదుదారుగా తన వాదనలను వినడం నిష్పక్షపాత విచారణకు అత్యంత కీలకమని ఆయన తరఫు న్యాయవాది కోర్టుకు నివేదించారు. ఈ ఇంప్లీడ్ పిటిషన్‌ను భారత ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని ధర్మాసనం పరిగణనలోకి తీసుకుంటూ, తదుపరి విచారణను వాయిదా వేసింది. 2015 జూన్‌లో జరిగిన తెలంగాణ శాసనమండలి ఎన్నికల సందర్భంగా ఈ ఉదంతం వెలుగులోకి వచ్చింది. టీడీపీ అభ్యర్థికి అనుకూలంగా ఓటు వేసేందుకు అప్పటి టీడీపీ ఎమ్మెల్యే రేవంత్ రెడ్డి (ప్రస్తుత తెలంగాణ ముఖ్యమంత్రి) రూ. 50 లక్షలు అడ్వాన్స్‌గా ఇచ్చేందుకు ప్రయత్నించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ వ్యవహారంలో తెలంగాణ ఏసీబీ కేసు నమోదు చేసి రేవంత్ రెడ్డి సహా ముగ్గురిని అరెస్ట్ చేయడంతో పాటు నగదును స్వాధీనం చేసుకుంది. ఈ కేసులో ఆడియో, వీడియో రికార్డింగులను కీలక ఆధారాలుగా పేర్కొన్నారు. తనపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాలని కోరుతూ రేవంత్ రెడ్డి ఇప్పటికే సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ క్వాష్ పిటిషన్‌పై విచారణ జరుగుతున్న తరుణంలో స్టీఫెన్‌సన్ ఇంప్లీడ్ పిటిషన్ దాఖలు చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. తాజా పరిణామాలతో తెలుగు రాష్ట్రాల రాజకీయ, న్యాయ వర్గాల్లో ఈ కేసు మరోసారి చర్చనీయాంశంగా మారింది. తదుపరి విచారణలో ధర్మాసనం ఎలాంటి నిర్ణయం తీసుకోనుందోనన్న ఉత్కంఠ నెలకొంది.

భారీగా పెరిగిన ఇండిగో విమాన ఛార్జీలు

అక్టోబర్ 6 నుంచి అమల్లోకి కొత్త ఛార్జీలు

న్యూఢిల్లీ, అక్టోబర్ 05 : దేశీయ విమానయాన రంగంలో అగ్రగామి సంస్థ అయిన ఇండిగో, ప్రయాణికులపై అదనపు భారాన్ని మోపనుంది. విమాన ఇంధనం (ఏటీఎఫ్) ధరలు భారీగా పెరగడంతో ఫ్యూయల్ సర్‌చార్జ్‌ను పెంచుతున్నట్లు సోమవారం ప్రకటించింది. ఈ నూతన ఛార్జీలు అక్టోబర్ 6వ తేదీ నుంచి చేసే అన్ని కొత్త బుకింగ్‌లకు వర్తిస్తాయని సంస్థ స్పష్టం చేసింది. గత కొన్ని నెలలుగా ఏటీఎఫ్ ధరలు నిరంతరాయంగా పెరుగుతున్నాయని, గత నెలతో పోలిస్తే తాజాగా 14 శాతానికి పైగా ధర పెరిగిందని ఇండిగో ఒక ప్రకటనలో తెలిపింది. గడిచిన దశాబ్ద కాలంలో ఇదే అత్యధికమని పేర్కొంది. విమానయాన సంస్థల నిర్వహణ వ్యయంలో ఇంధన ఖర్చులే కీలకమని, ఈ పెరుగుదల తమ సంస్థతో పాటు మొత్తం ఏవియేషన్ రంగంపై తీవ్ర ప్రభావం చూపుతుందని వివరించింది. నూతన ఛార్జీల ప్రకారం.. దేశీయ మార్గాల్లో 500 కిలోమీటర్ల వరకు ప్రయాణించే వారిపై రూ. 375... 501 నుంచి 1,000 కిలోమీటర్ల వరకు రూ. 600 వసూలు చేయనున్నారు. అదేవిధంగా, 1,001-1,500 కి.మీ. ప్రయాణానికి రూ. 900... 1,501-2,000 కి.మీ. దూరానికి రూ. 1,150... 2,000 కిలోమీటర్లు దాటిన ప్రయాణాలకు రూ. 1,300 చొప్పున ఫ్యూయల్ సర్‌చార్జ్ వర్తిస్తుంది. అంతర్జాతీయంగా సార్క్ దేశాలకు రూ. 1,000 నుంచి రూ. 3,000 వరకు, సౌత్ ఈస్ట్ ఆసియా, గల్ఫ్, మిడిల్ ఈస్ట్ దేశాలకు రూ. 5,500, ఆఫ్రికా, యూరప్ దేశాలకు రూ. 6,000 ఫ్యూయల్ ఛార్జ్‌ను నిర్ణయించారు. వాస్తవానికి పెరిగిన ఇంధన వ్యయాన్ని భర్తీ చేయడానికి ఇంకా అధిక మొత్తంలో ఛార్జీలు పెంచాల్సి ఉన్నప్పటికీ, ప్రయాణికులపై భారాన్ని తగ్గించే ఉద్దేశంతోనే పరిమితంగా సర్దుబాటు చేసినట్లు ఇండిగో వెల్లడించింది.

హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సామ్ కోషి

హైదారాబాద్ : తెలంగాణ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా సీనియర్ న్యాయమూర్తి జస్టిస్ పి. సామ్ కోషి నియమితులయ్యారు. ప్రస్తుత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్ సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టనున్నారు. ఈ నేపథ్యంలో.. ఆయన స్థానంలో జస్టిస్ సామ్ కోషి తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టనున్నారు. జస్టిస్ పి. సామ్ కోషికి సుదీర్ఘ న్యాయ అనుభవం ఉంది. 1967 ఏప్రిల్ 30న జన్మించిన ఆయన.. 1987లో కామర్స్‌లో బ్యాచిలర్ డిగ్రీ, 1990లో న్యాయశాస్త్రంలో డిగ్రీ పూర్తి చేశారు. 1991 మార్చి 9న న్యాయవాదిగా నమోదు చేసుకుని న్యాయవృత్తిలోకి ప్రవేశించారు. సివిల్, రాజ్యాంగ, సర్వీస్, కార్మిక చట్టాలకు సంబంధించిన కేసుల్లో వాదనలు వినిపించారు. తొలుత మధ్యప్రదేశ్ హైకోర్టు జబల్‌పూర్‌లో 1991 నుంచి 2000 అక్టోబర్ వరకు న్యాయవాదిగా ప్రాక్టీస్ చేశారు. అనంతరం 2000 నవంబర్ నుంచి ఛత్తీస్‌గఢ్ హైకోర్టు బిలాస్‌పూర్‌లో ప్రాక్టీస్ చేస్తూ దాదాపు 13 ఏళ్ల పాటు న్యాయవాదిగా కొనసాగారు. న్యాయవాదిగా ఉన్న సమయంలో ప్రభుత్వానికి కూడా న్యాయసేవలు అందించారు. 2002 నుంచి 2004 వరకు ఛత్తీస్‌గఢ్ హైకోర్టులో ప్రభుత్వ న్యాయవాదిగా పనిచేశారు. 2005-06లో డిప్యూటీ అడ్వకేట్ జనరల్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. హిదాయతుల్లా నేషనల్ లా యూనివర్సిటీ, రాయ్‌పూర్ అకాడమిక్ కౌన్సిల్‌లో సభ్యుడిగా కూడా పనిచేశారు. న్యాయవాదిగా ఉన్న సమయంలో సౌత్ ఈస్ట్ సెంట్రల్ రైల్వే, కోల్ ఇండియా లిమిటెడ్, సౌత్ ఈస్టర్న్ కోల్‌ఫీల్డ్స్ లిమిటెడ్, నేషనల్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, హిందుస్థాన్ పెట్రోలియం, భారత్ పెట్రోలియం తదితర ప్రముఖ ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలకు న్యాయపరమైన వ్యవహారాల్లో ప్రాతినిధ్యం వహించారు. సుదీర్ఘ న్యాయవాద వృత్తి అనంతరం 2013 సెప్టెంబర్ 16న ఛత్తీస్‌గఢ్ హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా జస్టిస్ సామ్ కోషి నియమితులయ్యారు. అనంతరం 2016 మార్చి 8న శాశ్వత న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించారు. న్యాయమూర్తుల బదిలీలో భాగంగా తెలంగాణ హైకోర్టుకు బదిలీ అయిన ఆయన.. 2023 జూలై 27న తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తిగా ప్రమాణ స్వీకారం చేశారు. అప్పటి నుంచి తెలంగాణ హైకోర్టులో కీలక బాధ్యతలు నిర్వహిస్తూ సీనియర్ న్యాయమూర్తిగా కొనసాగుతున్నారు. జస్టిస్ సామ్ కోషికి తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి బాధ్యతలు నిర్వహించడం ఇది మొదటిసారి కాదు. గతంలో 2025 జూలై 18 నుంచి 19 వరకు అప్పటి ప్రధాన న్యాయమూర్తి అందుబాటులో లేని సమయంలో తాత్కాలికంగా చీఫ్ జస్టిస్ విధులను నిర్వహించారు. ఇప్పుడు జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్ సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా నియమితులైన నేపథ్యంలో మరోసారి తెలంగాణ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ పి. సామ్ కోషి బాధ్యతలు చేపట్టనున్నారు. దాదాపు మూడు దశాబ్దాల న్యాయవృత్తి అనుభవం, ప్రభుత్వ న్యాయవాదిగా, డిప్యూటీ అడ్వకేట్ జనరల్‌గా పనిచేసిన అనుభవం, ఛత్తీస్‌గఢ్ హైకోర్టు అదనపు, శాశ్వత న్యాయమూర్తిగా నిర్వహించిన బాధ్యతలు, తెలంగాణ హైకోర్టులో సీనియర్ న్యాయమూర్తిగా కొనసాగుతున్న అనుభవం.. ఇవన్నీ జస్టిస్ సామ్ కోషి న్యాయ ప్రస్థానంలో కీలక మైలురాళ్లుగా నిలిచాయి. తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా ఆయన బాధ్యతలు చేపట్టడంతో తెలంగాణ హైకోర్టు పరిపాలనా వ్యవహారాల్లో ఆయన సుదీర్ఘ న్యాయ అనుభవం కీలకంగా మారనుంది.

సంపాదకీయం

వేగంగా తగ్గిపోతున్న యువ జనాభా

ప్రపంచంలోనే అత్యధిక యువజనాభా కలిగిన దేశంగా పేరుగాంచిన భారత్‌లో ఇప్పుడు జననాల రేటు భారీగా తగ్గిపోవడం తీవ్ర చర్చకు దారితీస్తోంది. ఒకప్పుడు వేగంగా పెరిగిన జనాభా ఇప్పుడు క్రమంగా క్షీణించడం వైపు అడుగులు వేస్తోంది. తాజా నివేదికల ప్రకారం దేశంలో జననాలు గణనీయంగా పడిపోగా, సంతానోత్పత్తి రేటు కూడా 1.9కి పడిపోయింది. రాబోయే రోజుల్లో యూరప్, తూర్పు ఆసియా దేశాల మాదిరిగా భారత్ కూడా వృద్ధాప్య జనాభా సమస్యను ఎదుర్కొనే దిశగా మారుతుందా అనే దానిపై ఇప్పుడు ఆందోళన వ్యక్తమవుతోంది జనాభా పెరుగుదల నుంచి క్షీణత వైపు మలుపు: దశాబ్దాల పాటు జనాభా విస్ఫోటనం గురించి చర్చించుకున్న మన దేశం, ఇప్పుడు సరిగ్గా వ్యతిరేకమైన పరిస్థితిని ఎదుర్కొంటోంది. 2023 నాటికి దేశంలో జననాల సంఖ్య ఏకంగా 1974 నాటి స్థాయికి పడిపోవడం గమనార్హం. జనాభా స్థిరత్వానికి లేదా వృద్ధికి కనీసం 2.1 సంతానోత్పత్తి రేటు అవసరం కాగా, ప్రస్తుతం అది 1.9కి చేరింది. ఈ గణాంకాలు భవిష్యత్తులో దేశ జనాభా స్వరూపంలో రాబోతున్న పెను మార్పులకు స్పష్టమైన సంకేతాలుగా నిలుస్తున్నాయి. ప్రపంచ దేశాలన్నింటికీ మన దేశమే అతిపెద్ద శ్రామిక శక్తిని అందిస్తుందని గర్వంగా చెప్పుకునేవాళ్లం. కానీ, సంతానోత్పత్తి రేటు ఇలాగే పడిపోతూ వస్తే, రాబోయే కొన్ని దశాబ్దాల్లో మనకు యువ ఉద్యోగుల కొరత ఏర్పడే ప్రమాదం ఉంది. ఒకప్పుడు దేశ అభివృద్ధికి ప్రధాన బలముగా మారిన 'డెమోగ్రాఫిక్ డివిడెండ్' క్రమంగా ముగింపు దశకు చేరుకుని, వృద్ధుల సంఖ్య పెరిగే 'డెమోగ్రాఫిక్ ట్రాన్సిషన్' వైపు భారత్ వేగంగా పయనిస్తోంది. స్థిరపడిన తర్వాతే పెళ్లి చేసుకోవాలనుకుంటారు కొంత మంది. స్థిరపడేసరికి వయసయిపోతుంది. ఇలాంటి సమస్య దేశానికి వస్తే ఎలా ఉంటుంది? ఇప్పుడు భారత్ అలాంటి పరిస్థితులలోకి వెళ్తోంది. దేశం ఇప్పటికి అభివృద్ధి చెందుతున్న దేశమే. 2047కి అభివృద్ధి చెందిన దేశంగా మారాలని టార్గెట్ పెట్టుకున్నారు. అప్పటికి ఆ లక్ష్యం సాధించినా దేశం మాత్రం వృద్ధాప్యంలోకి వెళ్లబోతోంది.దక్షిణాదికి చెందిన ముఖ్యమంత్రులు, ముఖ్య నాయకులు ఎక్కువ మంది పిల్లల్ని కనండి.. జనాభాను పెంచండి అని చేసిన ప్రకటనలను చూసి సోషల్ మీడియాలో, సాధారణ చర్చల్లో చాలా మంది తేలిగ్గా నవ్వుకున్నారు. నిరుద్యోగం, ద్రవ్యోల్బణం వేధిస్తున్న ప్రస్తుత కాలంలో మళ్లీ పిల్లల్ని కనమని చెప్పడమేమిటంటూ వ్యంగ్యాస్త్రాలు విసిరారు. కానీ, ఆ నాయకుల మాటల్లో కేవలం రాజకీయ స్వార్థం మాత్రమే కాదు.. భవిష్యత్ భారతదేశాన్ని ముంచెత్తబోతున్న ఒక పెను జనాభా సంక్షోభం తాలూకు ఆందోళన కూడా దాగి ఉందన్న కఠిన వాస్తవాన్ని ప్రముఖ అంతర్జాతీయ రేటింగ్స్ సంస్థ మూడీస్ తాజా నివేదిక కళ్లకు కట్టింది.భారత్‌లో సంతానోత్పత్తి రేటు ఇప్పటికే స్థిరీకరణ స్థాయిగా భావించే రీప్లేస్‌మెంట్ లెవల్ 2.1 కంటే కిందకు పడిపోయింది. 2024 నాటికే మన దేశంలో 65 ఏళ్లు పైబడిన వారి శాతం 7 దాటి, భారత్ అధికారికంగా ఏజింగ్ దశలోకి అడుగుపెట్టింది. 2049 నాటికి ఈ వాటా 14 శాతానికి పెరిగి ఏజ్డ్ సమాజంగా, ఆ తర్వాత కేవలం 16 ఏళ్ల వ్యవధిలోనే అంటే 2065 నాటికి 21 శాతానికి చేరి సూపర్ ఏజ్డ్ దేశంగా భారత్ మారబోతోంది. అమెరికా వంటి అగ్రరాజ్యానికి ఏజ్డ్ నుంచి సూపర్ ఏజ్డ్ కావడానికి 19 ఏళ్లు, ఇండోనేసియాకు 29 ఏళ్లు పడితే.. భారత్ అత్యంత వేగంగా ఆ విషవలయంలోకి చేరిపోతుంది.ఇక్కడ అసలైన ప్రమాదం వృద్ధుల సంఖ్య పెరగడం ఒక్కటే కాదు. మనం ఎంత సంపన్నమైన తర్వాత వృద్ధులవుతున్నామన్నదే అసలు సమస్య. జపాన్, యూరప్, అమెరికా వంటి అభివృద్ధి చెందిన దేశాలు ముందుగా పారిశ్రామికంగా ఎదిగి, ఆర్థికంగా పరిపుష్టమై, పూర్తిస్థాయిలో ధనిక దేశాలు గా మారిన తర్వాతే వృద్ధాప్య సమాజాలుగా మారాయి. కానీ భారత్ వంటి వర్ధమాన దేశాలు ఇంకా తలసరి ఆదాయంలో అట్టడుగున ఉన్న తరుణంలోనే వృద్ధాప్యంలోకి జారుకుంటున్నాయి. అంటే, ధనిక దేశం కాకముందే వృద్ధ దేశంగా మారే ప్రమాదం మన ముంగిట ఉంది. అత్యంత తక్కువ ఆదాయం ఉన్న దశలోనే కోట్లాది మంది వృద్ధులకు ఉచిత వైద్యం, పెన్షన్లు, దీర్ఘకాలిక సంరక్షణ భారాన్ని ప్రభుత్వాలు మోయాల్సి రావడం దేశ ఆర్థిక వ్యవస్థనే కుదేలు చేసే అంశం.పనిచేసే చేతులు తగ్గడం వల్ల ఉత్పాదకత తగ్గి, పన్నులు కట్టే యువతరం క్షీణిస్తే దేశ అభివృద్ధి చక్రం ఆగిపోతుంది. వినియోగదారులు తగ్గితే మార్కెట్ డిమాండ్ పడిపోయి పరిశ్రమలు నష్టపోతాయి. కేరళ కంటే ప్రస్తుతం చాలా రాష్ట్రాలు తక్కువ సంతానోత్పత్తి రేటును కలిగి ఉన్నప్పటికీ, అక్కడ సుదీర్ఘ కాలంగా సంతానోత్పత్తి రేటు తక్కువగా నమోదవుతోంది... 25 ఏళ్లలోపు జనాభా 37.4% జనాభాలో మూడవ వంతు ఉన్నారు. కేరళలో సంతానోత్పత్తి రేటు 1991 నాటికి 1.8కి పడిపోయింది. ప్రస్తుతం కేరళ (1.7 శాతం) కంటే తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, జమ్మూ కశ్మీర్, హిమాచల్‌ప్రదేశ్, పంజాబ్‌లో సంతానోత్పత్తి రేటు 1.6 శాతంగా ఉంది. 1991 నాటికి ఈ రాష్ట్రాల్లో సంతానోత్పత్తి రేటు 3 కన్నా ఎక్కువ ఉండగా.. తమిళనాడులో మాత్రమే 2.2 శాతంగా ఉంది. తత్ఫలితంగా కేరళ కంటే 25 ఏళ్లలోపు జనాభా ఎక్కువ ఉంది.పట్టణ ప్రాంతాల్లో సంతానోత్పత్తి తక్కువగా ఉన్నందున, 25 ఏళ్లలోపు వారి సంఖ్య గ్రామీణ ప్రాంతాల కంటే తక్కువగా ఉంది. పట్టణ ప్రాంతాలకు వలసలు కూడా ఇందులో ప్రధాన పాత్ర పోషిస్తున్నాయి. కొన్ని రాష్ట్రాల్లో మహిళల్లో ఎక్కువ ఆయుఃప్రమాణం.. దశాబ్దాలుగా లింగ నిష్పత్తులు క్షీణించడం వల్ల మహిళల్లో 25 ఏళ్లలోపు వారి నిష్పత్తి పురుషుల కంటే తక్కువగా ఉంటుంది. జాతీయంగా 47.4 శాతం ఉన్న పురుష జనాభాతో పోలిస్తే 25 ఏళ్ల కంటే తక్కువ వయస్సు మహిళల శాతం 46.3 శాతంగా ఉంది.దేశానికి లభించిన అతిపెద్ద వరం డెమోగ్రాఫిక్ డివిడెండ్ . ఈ కాలం ముగిసిపోవడానికి మనకు మిగిలి ఉన్న సమయం చాలా తక్కువ. ఈ ముప్పును గుర్తించి హెచ్చరిస్తున్న నాయకులను ఎగతాళి చేస్తూ కాలం గడిపితే.. యువ భారతం అతి త్వరలోనే భరించలేని ఆర్థిక భారంతో కుంగిపోయే వృద్ధ భారతం గా మిగిలిపోవడం తథ్యం.

ఎల్‌నినో ఎఫెక్ట్...కొత్త జాబ్ కార్డు రెడీ



హైదరాబాద్ : ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో గ్రామీణ కూలీలకు నిరంతర ఉపాధి కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కొత్త జాబ్‌కార్డులు జారీ చేయాలని నిర్ణయించింది. వీబీ జీరాంజీ పథకం కింద కొత్తగా దరఖాస్తు చేసుకునే వారికి 15 రోజుల్లోనే కార్డులు అందించాలని ఆదేశించింది. ఇప్పటికే 18 జిల్లాల్లోని 265 మండలాలను కరవు ప్రభావిత ప్రాంతాలుగా గుర్తించారు. పంటల సాగు తగ్గడంతో కూలీలకు పనులు, ఆదాయం తగ్గిన నేపథ్యంలో ప్రతి గ్రామంలో రోజుకు 100 నుంచి 150 మందికి ఉపాధి కల్పించేలా ఏర్పాట్లు చేస్తున్నారు.ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో గ్రామీణ కూలీలకు నిరంతర ఉపాధి కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వీబీ జీరాంజీ పథకం కింద కొత్తగా దరఖాస్తు చేసుకునే వారికి జాబ్‌కార్డులు త్వరగా జారీ చేయాలని నిర్ణయించింది. కొత్త దరఖాస్తుదారులకు 15 రోజుల్లోనే జాబ్‌కార్డు అందించేలా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితుల కారణంగా ఇప్పటికే 18 జిల్లాల్లోని 265 మండలాల్లో కరవు పరిస్థితులు ఉన్నట్లు ప్రభుత్వం గుర్తించింది. ఆయా ప్రాంతాల్లో వర్షాలు ఆశించిన స్థాయిలో కురవకపోవడంతో పంటల సాగు తగ్గింది. దీంతో వ్యవసాయ పనులపై ఆధారపడే కూలీలకు పనిదినాలు తగ్గి ఆదాయం కోల్పోయే పరిస్థితి ఏర్పడినట్లు ప్రభుత్వం నిర్ధారించింది.ఈ నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలను పెంచేందుకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖలను ప్రభుత్వం అప్రమత్తం చేసింది. ప్రస్తుత జాబ్‌కార్డుదారులతో పాటు కొత్తగా ఉపాధి కోరుకునే వారిని కూడా నమోదు చేయాలని సూచించింది. గ్రామాల్లో ఉపాధి అవసరమున్న కుటుంబాలను గుర్తించి వారికి పనులు కల్పించేలా కార్యాచరణ రూపొందిస్తోంది. ప్రతి గ్రామం నుంచి రోజుకు 100 నుంచి 150 మందికి ఉపాధి కల్పించేలా చర్యలు చేపట్టాలని పంచాయతీరాజ్ శాఖ నిర్ణయించింది. వ్యవసాయ పనులు తగ్గిన సమయంలో గ్రామీణ కుటుంబాలకు ప్రత్యామ్నాయ ఆదాయ వనరుగా ఉపాధి హామీ పనులు అందుబాటులో ఉండేలా అధికారులు ఏర్పాట్లు చేయనున్నారు. ముఖ్యంగా కరవు ప్రభావిత మండలాల్లో ఉపాధి కల్పనకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు.ప్రస్తుతం రాష్ట్రంలో 52.46 లక్షల కుటుంబాలకు చెందిన 1.08 కోట్ల మంది జాబ్‌కార్డులు కలిగి ఉన్నారు. వీరికి కొనసాగుతున్న ఉపాధి అవకాశాలతో పాటు కొత్తగా పనులు కోరుకునే కుటుంబాలను కూడా పథకంలోకి తీసుకురావడం ద్వారా కరవు పరిస్థితుల్లో ఆదాయ నష్టాన్ని కొంతమేర తగ్గించాలన్నది ప్రభుత్వ ఉద్దేశంగా ఉంది.18 ఏళ్లు నిండిన గ్రామీణులు జాబ్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. ఇందుకోసం నిర్ణీత దరఖాస్తు ఫారాన్ని పూర్తి చేసి ఆధార్‌కార్డు, ఫొటోను జత చేయాలి. సంబంధిత పత్రాలతో దరఖాస్తును గ్రామ పంచాయతీ కార్యదర్శికి సమర్పించాలి. కార్యదర్శి దరఖాస్తును పరిశీలించిన అనంతరం మండల కార్యాలయానికి పంపిస్తారు. మండల స్థాయిలో ఎంపీడీవో దరఖాస్తు, సంబంధిత పత్రాలను పరిశీలించి అర్హతను నిర్ధారిస్తారు. అనంతరం జాబ్‌కార్డు జారీ చేస్తారు. కొత్తగా దరఖాస్తు చేసుకునే వారికి ఈ ప్రక్రియను వేగవంతం చేసి 15 రోజుల్లోనే కార్డు అందించాలని ప్రభుత్వం ఆదేశించింది. వర్షాభావ పరిస్థితుల్లో వ్యవసాయ పనులు తగ్గినప్పటికీ గ్రామీణ కుటుంబాలకు ఉపాధి అవకాశాలు అందుబాటులో ఉండేలా చేయడం ప్రధాన ఉద్దేశంగా కనిపిస్తోంది. ముఖ్యంగా కరవు ప్రభావిత ప్రాంతాల్లో స్థానికంగా పనులు కల్పించడం ద్వారా కూలీలు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లే అవసరాన్ని తగ్గించే అవకాశం ఉంది.

ఏపీలో మరో భారీ బీపీసీఎల్ ప్రాజెక్టు

విజయవాడ : ఏపీకి పెట్టుబడులు క్యూ కడుతున్నాయి. ఈ క్రమంలో మరో భారీ ప్రాజెక్టు ఏర్పాటుకు కీలక అడుగు పడింది. ఆంధ్రప్రదేశ్‌లో భారీ పెట్టుబడితో చేపట్టనున్న భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ ప్రాజెక్ట్‌కు కేంద్రం నుంచి గ్రీన్ సిగ్నల్ లభించింది. నెల్లూరు జిల్లాలో రూ. లక్ష కోట్ల భారీ వ్యయంతో ఏర్పాటు చేయనున్న ఈ మెగా రిఫైనరీ ప్రాజెక్ట్‌కు అవసరమైన పర్యావరణ అనుమతులు మంజూరయ్యాయి. అయిదేళ్లలో మొత్తం పెట్టుబడులు రూ.1.5 లక్షల కోట్లకు చేరే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. మౌలిక సదుపాయాల కల్పనతో పాటు రాష్ట్ర పారిశ్రామిక ప్రగతికి ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ అత్యంత కీలకం కానుంది.నెల్లూరు జిల్లా రామాయపట్నం సమీపంలో 96,862 కోట్లు వ్యయంతో సుమారు 5,200 ఎకరాల విస్తీర్ణంలో గ్రీన్‌ఫీల్డ్ రిఫైనరీ, పెట్రోకెమికల్ కాంప్లెక్స్ నిర్మించనుంది. ఏటా 9 మిలియన్ మెట్రిక్ టన్నుల ఉత్పాదక సామర్థ్యంతో ఏర్పాటు కానున్న ఈ ప్లాంట్‌లో పెట్రోల్, డీజిల్, వివిధ రకాల పెట్రోకెమికల్ ఉత్పత్తుల తయారీ చేపట్టనున్నారు. పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యమిస్తూ, ప్రాజెక్ట్ ప్రాంగణంలో 30 శాతం మేర గ్రీన్ బెల్ట్ అభివృద్ధి చేయడానికి బీపీసీఎల్ ప్లాన్ రెడీ చేసింది.ఃఖఅఆ నిర్మించనున్న గ్రీన్‌ఫీల్డ్ చమురు శుద్ధి కర్మాగారం, పెట్రోకెమికల్ కాంప్లెక్స్‌కు పర్యావరణ, సీఆర్జెడ్ అనుమతులను పర్యావరణ శాఖ ఆధ్వర్యంలోని నిపుణుల మదింపు కమిటీ మంజూరు చేసింది. ఏపీ ప్రభుత్వంతో కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం రామాయపట్నం పోర్టు సమీపంలో రూ.96,862 కోట్లు పెట్టుబడిగా పెట్టడానికి బీపీసీఎల్ అంగీకరించింది. ఆ తర్వాత పెట్రోకెమికల్ కాంప్లెక్స్ అభివృద్ధి చేయాలని నిర్ణయించడంతో మొత్తం పెట్టుబడి సుమారు రూ.1.50 లక్షల కోట్లకు చేరుతుందని భావిస్తున్నారు. బీపీసీఎల్ చేపట్టనున్న ఈ భారీ ప్రాజెక్టుకు ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా శంకుస్థాపన చేయించాలని సంస్థ, రాష్ట్ర ప్రభుత్వం భావిస్తున్నాయి. పర్యావరణ అనుమతులు రావడంతో శంకుస్థాపన చేసేందుకు ప్రధాని కార్యాలయంతో సంప్రదింపులు జరుపుతున్నాయని సమాచారం. శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లోని కావలి, గుడ్లూరు మండలాల పరిధిలో ఈ ప్లాంటు ఏర్పాటు చేస్తారు. ఈ ప్లాంట్ ఏడాదికి 9 మిలియన్ టన్నుల ముడిచమురు శుద్ధి చేయనుంది. పర్యావరణ పరిరక్షణ ప్లాన్స్ అమలు కోసమే బీపీసీఎల్ ప్రత్యేకంగా రూ.3,300 కోట్లు ఖర్చు చేయనుంది. ఈ ప్రాజెక్టు నిర్మాణ సమయంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా 14 వేల మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని అంచనా వేశారు. బీపీసీఎల్ రిఫైనరీ ప్లాంట్ ప్రారంభమైన తర్వాత 1,250 మందికి ప్రత్యక్షంగా, 3,750 మందికి పరోక్షంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. ఏపీ కాలుష్య నియంత్రణ మండలి నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణలో వెల్లడైన వివరాలను, బీపీసీఎల్ సమర్పించిన రిపోర్ట్స్ పరిశీలించిన తరువాత కేంద్ర పర్యావరణ శాఖకు చెందిన నిపుణుల కమిటీ ఈ అనుమతులను ఇచ్చింది.బీపీసీఎల్ చేపట్టనున్న ఈ గ్రీన్‌ఫీల్డ్ రిఫైనరీ, పెట్రోకెమికల్స్ కాంప్లెక్స్ ప్రాజెక్టు నిర్మాణానికి రామాయపట్నం పోర్టు పరిధిలో మొత్తం 6000 ఎకరాలు కావాలని బీపీసీఎల్ కోరింది. గత ఏడాది అక్టోబరులోనే ఏపీ ప్రభుత్వం ఇందుకు అనుమతులు మంజూరు చేస్తూ ఇప్పటికే 4,500 ఎకరాలను ఏపీఐఐసీ సేకరించి బీపీసీఎల్ పేరిట రిజిస్టర్ చేసింది.

అక్బరుద్దీన్ రాజకీయ సన్యాసం..

హైదరాబాద్ : హైదరాబాద్ పాతబస్తీ రాజకీయాల్లోనూ, ఎంఐఎం శాసనసభా పక్ష నేతగానూ క్రియాశీలక పాత్ర పోషిస్తున్న అక్బరుద్దీన్ ఓవైసీ? వచ్చే ఎన్నికల్లో పోటీ చేయకపోవచ్చంటూ స్వయంగా చేసిన వ్యాఖ్యలు హాట్ టాపిక్ అవుతున్నాయి. తన విద్యాసంస్థ కార్యక్రమంలో విద్యార్థులతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. నాకు వయస్సు అయిపోయింది, వచ్చే ఎన్నికల్లో పోటీ చేస్తానో లేదో తెలియదు, అసలు పోటీ చేయాలనే ఆలోచన కూడా నాకు లేదు అని ఆయన సంచలన ప్రకటన చేశారు.అక్బరుద్దీన్ ఈ నిర్ణయానికి రావడం వెనుక ప్రధాన కారణంగా ఆయన ఆరోగ్య పరిస్థితిని చెప్పుకోవచ్చు. 2011లో బార్కాస్‌లో ఆయనపై జరిగిన దాడి అనంతరం ఆయన ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడింది. రెండు, మూడు సార్లు ఆయన పరిస్థితి విషమం అనే ప్రచారం జరిగింది. గత కొన్నేళ్లుగా వెన్నునొప్పి, ఇతర అంతర్గత ఆరోగ్య సమస్యలతో నిరంతరం వైద్య సంరక్షణలో ఉంటున్న ఆయన, నిరంతర ప్రచార ఒత్తిడిని , అసెంబ్లీలో సుదీర్ఘ రాజకీయ కసరత్తును తట్టుకోవడం శారీరకంగా సవాలుగా మారిందని సన్నిహిత వర్గాలు పేర్కొంటున్నాయి.మరోవైపు పాతబస్తీలో ఓవైసీ కుటుంబ తదుపరి తరం ఫీల్డులోకి రాబోతోందని చెబుతున్నారు. చంద్రాయణగుట్ట నియోజకవర్గం దశాబ్దాలుగా ఓవైసీ కుటుంబానికి కంచుకోటగా ఉంది. అక్బరుద్దీన్ స్థానంలో ఆయన కుమారుడు నూరుద్దీన్ ఓవైసీని రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో బరిలోకి దింపేందుకు రంగం సిద్ధమవుతోందనే చర్చ జోరందుకుంది. పాతబస్తీ ఓటర్లకు నూరుద్దీన్‌ను పరిచయం చేస్తూ, అక్బరుద్దీన్ వెనుక ఉండి మార్గదర్శకత్వం వహించే దిశగా పార్టీ నాయకత్వం ప్రణాళిక రచిస్తున్నట్లు సమాచారం. వయసు అయిపోయింది అనే కారణం అయితే.. ఆయన సోదరుడు అసదుద్దీన్.. అక్బరుద్దీన్ కంటే పెద్ద. మరి ఆయనేం అనుకోవాలన్న ప్రశ్నలు వస్తున్నాయి.తాను కేవలం 12వ తరగతి వరకే చదివానని చెప్పడానికి ఏమాత్రం సిగ్గుపడనని ఎమ్మెల్యే అక్బరుబ్బీన్ అన్నారు. తక్కువ చదువు చదివినప్పటికీ, ఎంతో కీర్తి ప్రతిష్ఠలు సంపాదించడంతో పాటు ఎన్నో ఒవైసీ విద్యాసంస్థల భవనాలను నిర్మించినందుకు గర్వంగా ఉందన్నారు. కొందరు ఉద్దేశపూర్వకంగానే తన పరువు తీయడానికి, ఇబ్బందులకు గురిచేయడానికి రకరకాల కుట్రలు చేస్తున్నారని, కానీ తాను ఎవరి ముందూ తలవంచే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఈ దేశం, ఈ గడ్డ అందరిదని, ఇక్కడ ప్రతి పౌరుడికి సమాన హక్కులు ఉన్నాయని చాంద్రాయణగుట్ట ఎమ్మెల్యే పేర్కొన్నారు.ఒకవేళ తాను భౌతికంగా ఉన్నా, లేకపోయినా తాను నెలకొల్పిన ఒవైసీ విద్యాసంస్థల భవనాల్లో తన గళం శాశ్వతంగా నిలిచిపోతుందని అక్బరుద్దీన్ ఒవైసీ భావోద్వేగానికి లోనయ్యారు. రాజకీయాలు, ఇక్కడి మిగతా వ్యవహారాలు అన్నింటినీ వదిలేసి మక్కాలోనే ఉండిపోవాలని ఉందన్నారు. మక్కాలోనే కన్నుమూయాలనేది తన చివరి కోరికని ప్రసంగంలో తెలిపారు. 2024లో ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ ఒవైసీ సోదరులను ఎలా చంపుతారో తెలియదంటూ చేసిన వ్యాఖ్యలు అప్పట్లో కలకలం రేపాయి.అయితే అసెంబ్లీ బయటా, లోపలా ఎంతో డేరింగ్ అండ్ డాషింగ్ గా వ్యవహరించే అక్బరుద్దీన్.. తాను ముసలివాడినయ్యానని, వచ్చే ఎన్నికల్లో పోటీ చేస్తానో లేదోనని చెప్పడం. తాను ఉన్నా, లేకపోయినా ఒవైసీ విద్యాసంస్థల భవనాల్లో తన గళం శాశ్వతంగా ఉంటుందంటూ భావోద్వేగానికి లోనవడం హాట్ టాపిక్ అవుతోంది. ఎంతో ఆవేశంగా వ్యవహరించే అక్బరుద్దీన్ ఇలా కూడా మాట్లాడతారా అని చర్చించుకుంటున్నారు. హిజాబ్ మన ఆయుధం అని.. ఎవరు వ్యతిరేకించినా వదలకూడదని హైదరాబాద్ పాతబస్తీ యువతులకు అక్బరుద్దీన్ ఒవైసీ సూచించారు. హిజాబ్‌తోనే జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకోవాలని, కష్టపడి పైకి రావాలని ఒవైసీ విద్యాసంస్థల విద్యార్థినులకు సూచించారు.

ప్రపంచం.. పంచ సూక్తాత్మకం

'సూక్తం' అంటే మంచిమాట. 'బాగా చెప్పింది' అనే అర్థం కూడా ఉంది. సమగ్రంగా నిరూపణ చేయడాన్ని కూడా 'సూక్తం' అని అంటారు. ఈ అర్థాలన్నిటినీ సమన్వయం చేస్తే.. మనిషికి సమున్నతమైన మార్గదర్శనం చేసే బోధన 'సూక్తం' అని చెప్పొచ్చు. ప్రకృతి పరిణామ కమం, దానిపై మనిషికి ఉండాల్సిన అవగాహన, చేయాల్సిన పనులు, చేయకూడని చర్యలు, సాధించాల్సిన అద్వైతభావన మొదలైన విషయాలన్నిటినీ వేదాల్లోని సూక్తాలు వివరిస్తాయి. భక్తుడి మనసు ఎప్పుడూ నిశ్చలంగా ఉండటానికి, పరమాత్మ మీద లగ్నం కావడానికి భారతీయ రుషులు ప్రతిపాదించిన ప్రాథమిక సూచన వేద సూక్త పఠనం. నిజానికి ఇవి వేదాల్లో ఒకే చోట, ఒకే మంత్రభాగంగా ఉండవు. విభిన్న భాగాల నుంచి గ్రహించిన మంత్రాలతో సూక్తం తయారవుతుంది. వేదంలో చెప్పిన కొన్ని పరమ ప్రామాణికమైన అంశాలు, మనిషికి అత్యవసరంగా అందాల్సిన సందేశాన్ని గుర్తించి మహర్షులు చేసిన క్రోడీకరణే సూక్తాలు. నాలుగు వేదాల్లో వందలాదిగా ఉన్న సూక్తాల్లో పురుషసూక్తం, శ్రీసూక్తం, నారాయణసూక్తం, భూ, నీలాసూక్తం%ా% పంచసూక్తాలుగా ప్రసిద్ధిపొందాయి. పురుష సూక్తం.. 'పురుష' అనే పదానికి భగవంతుడు అని అర్థం చేసుకోవాలి. విశ్వానికి మూలశక్తి అయిన విరాట్పురుషుడి స్వరూప, స్వభావ వర్ణన, విశ్లేషణ ఈ సూక్తంలో ప్రధానంగా ఉంటాయి. సాధారణభావనలో మనం ఊహించుకునే విష్ణుమూర్తి, పురుషసూక్తం ప్రకటించే నారాయణుడు ఇద్దరూ వేర్వేరు. ఈయన త్రిమూర్తుల్లో ఒకరైన విష్ణువు కన్నా పూర్వమే ఉన్నాడు. విశ్వం ఆవిర్భావానికి మూలకారణశక్తి ఇతనే.



ఆధ్యాత్మికం

ప్రైవేటుకు ధీటుగా ప్రభుత్వ బడులు

● రూ. 200 కోట్లతో రామునిపల్లెలో ప్రతిష్టాత్మక ఇంటిగ్రేటెడ్ స్కూల్ ● రెండున్నరేళ్లలోనే నియోజకవర్గ పాఠశాలల అభివృద్ధికి రూ. 70 కోట్లు ఖర్చు ● గత పదేళ్ల పాలకుల నిర్లక్ష్యంపై తీవ్ర ధ్వజం ● ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు

సుల్తానాబాద్, అక్టోబర్ 05: తెలంగాణ రాష్ట్రంలో పేద, మధ్యతరగతి విద్యార్థులకు అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన కార్పొరేట్ స్థాయి ఉచిత విద్యను అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ ముఖ్య ధ్యేయమని రాష్ట్ర ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు స్పష్టం చేశారు. ఎలిగేడు మండలం రామునిపల్లె (రాములపల్లి) వద్ద రూ. 200 కోట్లతో నూతనంగా నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ (సమన్వయ) పాఠశాల నిర్మాణ పనులను సోమవారం రోజున ఆయన స్థానిక నాయకులు, అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పనుల ప్రగతిని అడిగి తెలుసుకుంటూ, నాణ్యతలో ఎక్కడా రాజీ పడకూడదని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ విజయరమణ రావు మాట్లాడుతూ... కుల, మత బేధాలు లేకుండా సమాజంలోని అన్ని వర్గాల పిల్లలు ఒకే వేదికపై పెద్ద ఎత్తున నాణ్యమైన విద్యాభ్యాసం చేయాలనే చారిత్రాత్మక ఆలోచనతో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ప్రతి నియోజకవర్గానికి రూ. 200 కోట్లతో ఈ ఇంటిగ్రేటెడ్ పాఠశాలలను మంజూరు చేశారని తెలిపారు. తాను శాసనసభ్యుడిగా ఎన్నికైన ఈ రెండున్నర సంవత్సరాల కాలంలోనే పెద్దపల్లి నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలల మౌలిక వసతుల కోసం రూ. 70 కోట్ల నిధులు మంజూరు చేశామని వివరించారు. ఈ నిధులతో నియోజకవర్గ వ్యాప్తంగా పాఠశాల భవనాలు, ఆధునిక మరుగుదొడ్లు, రక్షణ ప్రహరీ గోడల నిర్మాణాలు చేపట్టామన్నారు. గత ప్రభుత్వంలో 10 ఏళ్లు పరిపాలన చేసిన అప్పటి ఎమ్మెల్యే ప్రభుత్వ బడులను పూర్తిగా గాలికొదిలేసి, కేవలం తన సొంత ప్రైవేటు పాఠశాలల లాభాల కోసమే తాపత్రయపడ్డారని తీవ్రంగా విమర్శించారు. **ఇంటర్నేషనల్ స్కూళ్లకు ధీటుగా రామునిపల్లె పాఠశాల:** రామునిపల్లెలో నిర్మిస్తున్న ఈ మెగా స్కూల్ కాంప్లెక్స్‌లో 2,560 మంది విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి ఉచిత విద్యతో పాటు అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన హాస్టల్, విశాలమైన ప్లే గ్రౌండ్ (ఆట స్థలం), అధునాతన డైనింగ్ హాల్ నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. **దేశంలోనే తొలిసారిగా వినూత్న పథకాలు:** దేశంలోని ఏ 29 రాష్ట్రాలలో లేని విధంగా సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ లలో మధ్యాహ్న భోజనంతో పాటు రెండు మాసాల క్రితమే అల్పాహార పథకాన్ని ప్రవేశపెట్టారని కొనియాడారు. విద్యార్థులకు ఉదయం టిఫిన్‌తో పాటు వారంలో మూడు రోజులు పాలు, మూడు రోజులు రాగి జావ అందిస్తున్నామని తెలిపారు. అదేవిధంగా, స్వాతంత్ర్యం వచ్చిన 80 ఏళ్లలో దేశంలో ఎక్కడా లేని విధంగా మన రాష్ట్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇంటర్ విద్యార్థులకు కూడా హరేరామ హరేకృష్ణ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించుకోవడం గర్వకారణమన్నారు. **ప్రభుత్వ బడుల్లోనే పిల్లలను చేర్పించండి:** ప్రైవేటు పాఠశాలల్లో నర్సరీ, ఎల్‌కేజీ చదివించేందుకే తల్లిదండ్రులు సంవత్సరానికి రూ. 30 వేల నుండి రూ. 40 వేల వరకు ఫీజుల రూపంలో వృథా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో అత్యున్నత బీఈడీ అర్హత సాధించి, ప్రభుత్వ పరీక్షల్లో నెగ్గిన నిష్ణాతులైన ఉపాధ్యాయులు ఉన్నారని గుర్తుచేశారు. కాబట్టి తల్లిదండ్రులందరూ తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించి, ప్రభుత్వం కల్పిస్తున్న ఈ కార్పొరేట్ స్థాయి ఉచిత వసతులను, పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంబంధిత ప్రభుత్వ శాఖల అధికారులు, వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్, సింగిల్ విండో ఛైర్మన్లు, సొసైటీ డైరెక్టర్లు, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు, పలు గ్రామాల ప్రజాప్రతినిధులు, మాజీ సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు , కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఘనంగా కాకా వెంకటస్వామి జయంతి వేడుకలు

ధర్మపురి, అక్టోబర్ 5, : ధర్మపురి పట్టణంలోని స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మాజీ కేంద్ర మంత్రి దివంగత కాకా గడ్డం వెంకటస్వామి జయంతి వేడుకలను పట్టణ మరియు మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కాకా గడ్డం వెంకటస్వామి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ధర్మపురి మున్సిపల్ చైర్‌పర్సన్ వేముల నాగలక్ష్మి పాల్గొని కాకా వెంకటస్వామి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మాజీ కేంద్ర మంత్రి కాకా గడ్డం వెంకటస్వామి జీవితాంతం పేదలు, బడుగు బలహీన వర్గాలు, కార్మికుల సంక్షేమం కోసం కృషి చేసిన మహోన్నత నాయకుడని అన్నారు. నిరుపేదలు, ఇళ్లు లేని పేద ప్రజలకు ఇళ్ల నిర్మాణం కల్పించేందుకు ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. కార్మికుల పక్షపాతిగా నిలిచి వారి హక్కులు, సంక్షేమం కోసం పోరాడారని, విద్యా సంస్థల స్థాపనకు కృషి చేసి విద్యాభివృద్ధికి విశేష సేవలు అందించారని తెలిపారు. తెలంగాణ ఉద్యమంలోనూ కాకా వెంకటస్వామి పాత్ర ఎంతో కీలకమైందని అన్నారు. తన సుదీర్ఘ రాజకీయ జీవితాన్ని ప్రజా సంక్షేమానికి అంకితం చేసి, పేదలు మరియు బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి నిరంతరం కృషి చేసిన కాకా వెంకటస్వామి సేవలు ఎప్పటికీ స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయని వేముల నాగలక్ష్మి అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ(డి.సి.సి) అధ్యక్షులు గాజెంగి నందయ్య, జిల్లా గ్రంధాలయ ఛైర్మెన్ సంఘనబట్ల దినేషజ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చిలుముల లక్ష్మణ్, పలు మండలాల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలి

అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు

పెద్దపల్లి ప్రతినిధి : అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలని, ప్రజావాణి దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి అర్జీలను పెండింగ్ లో ఉంచకుండా పరిష్కరించాలని అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు కలెక్టరేట్ సమావేశం మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు. పెద్దపల్లి మండలం కనగర్తి గ్రామానికి చెందిన బండ్రి అజయ్ కుమార్ తమకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా పీడీ హౌసింగ్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ తెలిపారు. పెద్దపల్లి మండలం రాంపల్లి గ్రామానికి చెందిన గౌడ అశోక్ తన కుమార్తె గౌడ శ్రీవల్లికు 100% వికలాంగత్వం ఉందని తనకు పెన్షన్ మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారికి రాస్తూ నిబంధనల ప్రకారం పరిశీలించి చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ తెలిపారు. ఎలిగేడు మండలం నర్సాపూర్ గ్రామానికి చెందిన తంగెళ అనిత తాను బిఎస్సి నర్సింగ్ పూర్తి చేశానని తనకు జిల్లాలో ఖాళీగా ఉన్న స్టాఫ్ నర్స్ పోస్టర్లో ఏదైనా ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా వారిది సొసైటీ కి రాస్తూ ఔట్సోర్సింగ్ కింద అవకాశాలు వచ్చినప్పుడు పరిశీలించాలని అదనపు కలెక్టర్ తెలిపారు. రామగిరి మండలం రాజాపూర్ గ్రామానికి చెందిన మల్లేశ్వరి తన ఇంటికి సింగరేణి ప్రాజెక్టు వారు ప్రాజెక్టు నెంబర్ కేటాయించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కు రాస్తూ పరిశీలించి చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ తెలిపారు. ప్రజావాణి కార్యక్రమంలో సంబంధిత జిల్లా అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల పక్షపాతి కాకా వెంకటస్వామి జయంతి వేడుకలు

ఘనంగా నివాళులర్పించిన బిజెపి నేత ములుమురి శ్రీనివాస్



రామగిరి, అక్టోబర్ 05:- రామగిరి మండలం సెంటనరీ కాలనీలో మాజీ ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు బిజెపి నేత మొలుమూరి శ్రీనివాస్ కాకా వెంకటస్వామి 97వ జయంతి సందర్భంగా ఘనంగానివాళులు అర్పించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెద్దపల్లి పార్లమెంటు నియోజకవర్గం కు పార్లమెంట్ లో కార్మికుల కోసం వారి పింఛన్ల కోసం పోరాడి ప్రభుత్వాన్ని ఒప్పించి కార్మికులకు ప్రావిడెంట్ ఫండ్ తో పాటు ఆరోగ్య జీవిత కాలం వారికి పింఛన్ ఇప్పించడంలో వెంకట్ స్వామి కృషి మరువలేనిది దేశంలోనే ప్రథమంగా కార్మికుల కోసం పోరాడిన నాయకుడిగా దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన ఈ ప్రాంత బిడ్డ బడుగు బలహీన వర్గాలకు నిజమైన ఆశాజ్యోతి వెంకటస్వామి అని ఆయన అన్నారు కార్మికులకు హక్కులు పొందే విధంగా ఎనలేని కృషిచేసి చిరస్థాయిగా కార్మికుల గుండెల్లో తెలిసిపోయిన మహోన్నతమైన వ్యక్తి వెంకటస్వామి అని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేసుకున్నారు.

ధర్మపురికి కొత్త కోర్టు మంజూరుకు సహకరించిన మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌ను సన్మానించిన న్యాయవాదులు

ధర్మపురి, అక్టోబర్ 5, (ది క్రైమ్ న్యూస్): ధర్మపురిలో మరో కొత్త అదనపు జూనియర్ సివిల్ జడ్జి-కమ్-అదనపు జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఫస్ట్ క్లాస్ కోర్టు ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతి మంజూరు చేయడంపై ధర్మపురి బార్ అసోసియేషన్ న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి కి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతూ, రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ను శాలువాతో సన్మానించి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ధర్మపురి కోర్టుకు శాశ్వత స్థలం కేటాయించి, భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని మంత్రిని ఈ సందర్భంగా న్యాయవాదులు కోరారు. ఎండపల్లి మండలానికి చెందిన మూడు గ్రామాలు ప్రస్తుతం గోదావరిఖని కోర్టు పరిధిలో ఉన్నందున, ఆయా గ్రామాల ప్రజలు కోర్టు పనుల కోసం అక్కడికి వెళ్లడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రజల సౌకర్యార్థం ఆ మూడు గ్రామాలను ధర్మపురి కోర్టు పరిధిలోకి చేర్చాలని మంత్రికి వినతిగా కోరారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బందేల రమేష్, ఉపాధ్యక్షుడు మామిడాల శ్రీకాంత్, లీగల్ ఎయిడ్ కౌన్సిల్ జాజాల రమేష్, సీనియర్ న్యాయవాదులు అప్పాల నిరంజన్, రౌతు రాజేష్, అలుక వినోద్, గూడ జితేందర్ రెడ్డి, గడ్డం అనిల్ పాల్గొన్నారు.

కామారెడ్డి జిల్లా వాసి హిమాచల్ ప్రదేశ్‌లోని తరంగ్ 2

అతి ఎత్తైన పర్వతాశీ 6,021 మీటర్ల ఎత్తైన పర్వతాన్ని అధిరోహించిన గిరిజన విద్యార్థివి- విద్యార్థి బన్నీని సన్మానించిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి ప్రతినిధి,: కామారెడ్డి జిల్లా రాజంపేట మండలం ఎల్లాపూర్ తండాకు చెందిన తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాల, కామారెడ్డిలో బీకాం తుది సంవత్సరం చదువుతున్న విశ్లావత్ బన్నీ హిమాచల్ ప్రదేశ్‌లోని 6,021 మీటర్ల ఎత్తైన పర్వతాన్ని అధిరోహించి చారిత్రాత్మక ఘట్టాన్ని నమోదు చేశారు. ఈ సందర్భంగా జిల్లా సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ విద్యార్థి విశ్లావత్ బన్నీని శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, విద్యతో పాటు సాహస క్రీడల్లోనూ ప్రతిభ కనబరుస్తూ జిల్లాకు గుర్తింపు తీసుకురావడం అభినందనీయమన్నారు. బన్నీ విజయాన్ని స్ఫూర్తిగా తీసుకొని ఇతర విద్యార్థులు కూడా తమ ప్రతిభను వివిధ రంగాల్లో చాటాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సుల్తానాబాద్‌లో ఘనంగా కాకా వెంకటస్వామి 97వ జయంతి వేడుకలు

నివాళులర్పించిన ప్రభుత్వ విప్ చింతకుంట విజయరమణ రావు

సుల్తానాబాద్, అక్టోబర్ 05(: పెద్దపల్లి పార్లమెంట్ ముద్దుబిడ్డ, కార్మిక నేత, స్వర్గీయ మాజీ కేంద్రమంత్రి గడ్డం వెంకటస్వామి (కాకా) 97వ జయంతి వేడుకలను సుల్తానాబాద్ పట్టణ కేంద్రంలో సోమవారం అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సుల్తానాబాద్ పట్టణ చౌరస్తాలో ఉన్న కాకా వెంకటస్వామి విగ్రహానికి గౌరవ ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ విజయరమణ రావు మాట్లాడుతూ... బడుగు, బలహీన వర్గాల, కార్మికుల సంక్షేమం కోసం, తెలంగాణ ప్రాంత ప్రగతి కోసం కాకా వెంకటస్వామి చేసిన సేవలు ఎనలేనివని కొనియాడారు. పెద్దపల్లి నియోజకవర్గ అభ్యున్నతికి ఆయన వేసిన బాటలు, చూపిన మార్గం ఎప్పటికీ స్మరణీయమని, ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సుల్తానాబాద్ మున్సిపల్ చైర్మన్, బిరుదు రాధాకృష్ణ వైస్ చైర్మన్ అంతటి పుష్పలత, మున్సిపల్ కమిషనర్ రమేష్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రకాశరావు, స్థానిక వార్డు కౌన్సిలర్లు, సింగిల్ విండో చైర్మన్లు, డైరెక్టర్లు, కాంగ్రెస్ పార్టీ పట్టణ, మండల, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, వివిధ గ్రామాల సర్పంచులు, ఇతర ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు కాకా వెంకటస్వామి అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రద్ధాంజలి ఘటించారు.

ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా భాస్కర్ ఏకగ్రీవం

సుల్తానాబాద్, అక్టోబర్ 05: సుల్తానాబాద్ పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా కొమురవెల్లి భాస్కర్ వరుసగా మూడోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక వైశ్య భవనంలో సంఘం నూతన కార్యవర్గ ఎన్నికలను శనివారం అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించారు. ఈ ఎన్నికల ప్రక్రియకు జిల్లా కార్యదర్శి అల్లంకి లింగమూర్తి ఎన్నికల అధికారిగా వ్యవహరించి పర్యవేక్షించారు. పట్టణ ఆర్యవైశ్య సంఘంతో పాటు శ్రీ వాసవి మాత దేవాలయ కమిటీ, మహిళా విభాగం నూతన కమిటీలను కూడా సభ్యులంతా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆర్యవైశ్య సంఘం: గౌరవ అధ్యక్షుడిగా కొమురవెల్లి రామ్మూర్తి, అధ్యక్షుడిగా కొమురవెల్లి భాస్కర్, సెక్రటరీగా పుల్లూరి రమేష్, క్యాషియర్గా కొమురవెల్లి (కేబీ) శ్రీనివాస్ ఎన్నికయ్యారు. వాసవి మాత దేవాలయ కమిటీ: చైర్మన్‌గా చకిలం మారుతి, సెక్రటరీగా నార్ల శ్రీనివాస్ ఏకగ్రీవంగా నియామకమయ్యారు. మహిళా విభాగం: పట్టణ ఆర్యవైశ్య సంఘం మహిళా అధ్యక్షురాలిగా పల్ల అపర్ణ ఎన్నికయ్యారు. ఈ నూతన కమిటీల నియామకం పట్ల ఆర్యవైశ్య సంఘం నాయకులు, సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. నూతన కార్యవర్గం ఆధ్వర్యంలో సంఘం మరింత బలోపేతం కావాలని, సమాజ సేవా కార్యక్రమాల్లో అగ్రగామిగా నిలవాలని ఆకాంక్షిస్తూ పలువురు ప్రముఖులు వారికి అభినందనలు శుభాకాంక్షలు తెలియజేశారు.

వాహనదారులు నిబంధనలు పాటించాలి

రామగుండం ట్రాఫిక్ సీఐ బి. రాజేశ్వరరావు

మైనర్లకు వాహనాలు ఇస్తే యజమానులపై కేసులు.. రాంగ్ రూట్‌పై నిఘా

గోదావరిఖని క్రైమ్ : వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించి రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలని రామగుండం ట్రాఫిక్ సీఐ బి. రాజేశ్వరరావు కోరారు. రామగుండం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన పాత్రికేయ సమావేశంలో ఆయన మాట్లాడారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ లేకుండా ప్రయాణించరాదని, నాలుగు చక్రాల వాహనాలు నడిపే వారు సీట్‌బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు. రాంగ్ రూట్‌లో వాహనాలు నడపకుండా ట్రాఫిక్ సిగ్నల్స్‌ను పాటించాలని తెలిపారు. ద్విచక్ర వాహనాలపై ముగ్గురు ప్రయాణించడం నిబంధనలకు విరుద్ధమని, ఎవరూ ట్రిపుల్ రైడింగ్ చేయరాదని స్పష్టం చేశారు. రహదారులపై వాహనాలను నిలిపి ఉంచడం వల్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడటంతోపాటు ప్రమాదాలు పెరుగుతున్నాయని, వాహనాలను రోడ్లపై పార్కింగ్ చేయవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మైనర్లకు వాహనాలు అప్పగించవద్దని, నిబంధనలకు విరుద్ధంగా మైనర్లకు వాహనం ఇస్తే సంబంధిత వాహన యజమానిపై కేసు నమోదు చేస్తామని తెలిపారు. వాహనదారులు తమ వాహనాలకు సంబంధించిన అన్ని పత్రాలు సక్రమంగా ఉన్నాయో లేదో ముందుగానే పరిశీలించుకోవాలని సూచించారు. ట్రాఫిక్ నియమాలను ప్రతి ఒక్కరూ బాధ్యతగా పాటించడం ద్వారా ప్రమాదాలను తగ్గించవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై ఎన్. రామరాజు పాల్గొన్నారు.

అర్హులైన లబ్ధిదారులకు రూ.49.21 లక్షల విలువైన సి.ఎం.ఆర్.ఎఫ్ చెక్కుల పంపిణీ చేసిన మంత్రి అడ్లూరి

ధర్మపురి, అక్టోబర్ 5, : ధర్మపురి క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ముఖ్యమంత్రి సహాయనిధి (సి.ఎం.ఆర్.ఎఫ్) చెక్కుల పంపిణీ కార్యక్రమంలో సోమవారం తెలంగాణ రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని అర్హులైన 146 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.49,21,400 విలువైన చెక్కులను మంత్రి లక్ష్మణ్ కుమార్ పంపిణీ చేశారు. ఆపదలో ఉన్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతో అండగా నిలుస్తుందని మంత్రి పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు, సహాయ కార్యక్రమాలు అందేలా కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

రాజకీయాలను దిగజారుస్తున్న బజారు భాష

● సమస్యల మళ్లింపుకే ఆస్తుల ఆరోపణలు ● ప్రజల పాత్ర లేని దిశగా ప్రజాస్వామ్యం ● ఐక్య కార్యాచరణ తర్వాతే ఐక్యత - అధికారం ఉన్నప్పుడు భూములు పంచేందుకు జంకేందుకు...? ● ఐజెయు మీట్ ద ప్రెస్లో సిపిఎం నేత తమ్మినేని

ఖమ్మం ప్రతినిధి, అక్టోబర్ 05: రాష్ట్రంలో అధికార, విపక్ష నేతలు వాడుతున్న బజారు భాష రాష్ట్ర రాజకీయాలను దిగజారుస్తుందని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు, మాజీ ఎంపి తమ్మినేని వీరభద్రం తెలిపారు. గౌరవనీయ భాష ప్రయోగించకుండా నీచ పదజాలం రాజకీయాల్లో సరైంది కాదని ఆయన తెలిపారు. ప్రజా సమస్యలను పక్కదారి పట్టించుకే భూ కబ్జాలు, ఆక్రమణల వ్యవహారాన్ని తెరపైకి తెస్తున్నారని ఆయన అభిప్రాయపడ్డారు. సోమవారం టియుడబ్ల్యూజె (ఐజేయు) ఆధ్వర్యంలో తమ్మినేనితో మీట్ ద ప్రెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. టియుడబ్ల్యూజె (ఐజెయు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రాంనారాయణ సమన్వయ కర్తగా వ్యవహరించగా టియుడబ్ల్యూజె (ఐజెయు) జిల్లా అధ్యక్షులు ఏనుగు వెంకటేశ్వరరావు అధ్యక్షులుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో తమ్మినేని మాట్లాడుతూ నేతల భాష ఆక్షేపణీయమని ఈ భాష సరైంది కాదన్నారు. విమర్శించడానికి ఈ పద్ధతి తగదని ఆయన కాంగ్రెస్, బిఆర్ఎస్లకు సూచించారు. రాష్ట్రంలో రెండు పార్టీల మధ్య భూ ఆక్రమణలు, అక్రమ సంపాదనలకు సంబంధించి పరస్పర విమర్శల పర్వం సాగుతుందని కేవలం ప్రజా సమస్యలను పక్కదారి పట్టించడానికే పథకం ప్రకారం రెండు పార్టీలు వ్యవహరిస్తున్నాయని ఆయన ఆరోపించారు. పాపాలు చేయడంలో రెండు పార్టీలు సమానమేనని రేవంత్ రెడ్డి కుటుంబ సభ్యుల భూ వ్యవహారాలకు సంబంధించి బిఆర్ఎస్ కేవలం ఆరోపణలకే పరిమితం అవుతుండగా అధికారం చేతిలో ఉన్న కాంగ్రెస్ కూడా కేవలం ఆరోపణలు మాత్రమే చేస్తుందని ఈ వ్యవహారం పలు అనుమానాలకు తావిస్తుందన్నారు. కాంగ్రెస్ భూ ఆక్రమణలపై బిఆర్ఎస్ కార్యాచరణ చేపట్టదని బిఆర్ఎస్ భూ ఆక్రమణలపై అధికార పార్టీ చర్యలకు పూనుకోదని ఈ విషయం ప్రజలకు కూడా తెలుసునన్నారు. అధికారం చేతిలో ఉన్నప్పుడు భూములు పంచేందుకు జంకేందుకని తమ్మినేని ప్రశ్నించారు. హామీలు అమలు పరచలేని కాంగ్రెస్ వల్ల కార్యాచరణ లేని బిఆర్ఎస్ వల్ల ఈ రాష్ట్ర ప్రజలకు ఒరిగింది ఏమి లేదన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా చెప్పుకునే భారతదేశంలో ప్రజల పాత్ర క్రమేపి తగ్గిపోతుందన్నారు. ఒకప్పుడు రిగ్గింగులు, ఓట్ల కొనుగోలు, ఇప్పుడు గెలిచిన అభ్యర్థులను కొనుగోలు చేయడం ఏకంగా ఓటింగ్ మిషన్ల ద్వారా ఓట్లను సానుకూలంగా వేయించుకునే పద్ధతికి తెరలేపారన్నారు. ఎన్నికల ఫలితాలను ప్రజల అభిప్రాయాలకు భిన్నంగా తీసుకు వచ్చే ప్రయత్నంలో బిజెపి 2024లోనే సఫలీకృతమైనట్లు అనేక సర్వేలు చెబుతున్నాయన్నారు. భారత రాజ్యాంగం ప్రకారం పాలన సాగడం లేదని ప్రజల విమర్శకు కనీసం సమాధానం చెప్పే స్థితిలో కేంద్ర ప్రభుత్వం లేదన్నారు. ఎవరైనా విమర్శిస్తే దేశ ద్రోహులుగా ముద్రిస్తున్నారని తమ్మినేని ఆరోపించారు. ఎన్నికల కమిషన్ ఎంపికే తప్పని పద్ధతి ప్రకారం జరగని ఎన్నికల కమిషన్ ఎంపికతో అధికారానికి ఎన్నికల కమిషనర్ దాసోహం అన్నారని ఆయన తప్పనిసరిగా రాజీనామా చేయాల్సిందేనని తమ్మినేని స్పష్టం చేశారు. దేశంలో ప్రజాస్వామ్య వ్యతిరేక శక్తులు పెత్తనం చేసే ప్రయత్నం చేస్తున్నాయని ఆ క్రమంలోనే దిమాగినక్సల్స్ పదాన్ని తెరపైకి తెచ్చారన్నారు. నక్సల్స్ పేరుతో అడవుల్లోని సాయుధులను హతమార్చినట్లు ఆలోచించగలిగి సమాజం కోసం పనిచేసే వారిని దిమాగి నక్సల్స్ పేరుతో హతమారుస్తారా అని తమ్మినేని ప్రశ్నించారు. బిజెపి గ్రాఫ్ పడిపోతుందని 2014లో సంక్షేమం, ఆర్థిక ప్రణాళికతో ముందుకు వచ్చిన బిజెపి 2024 నాటికి మతాన్ని ఎజెండాగా చేసిందని బిజెపి కేవలం టిడిపి, ఇతర మిత్ర పక్షాల మద్దతుతోనే అధికారంలోకి రాగలిగిందన్నారు. అమెరికాకు మోడీ దాసోహం అంటుండగా అమెరికాలో తీవ్ర ఆర్థిక సంక్షోభం నెలకొందని అక్కడి ప్రజలు పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరల పట్ల నిరసన వ్యక్తం చేస్తున్నారని తమ్మినేని తెలిపారు. భారతదేశంలో అవినీతి వ్యవస్థీకృతమవుతుందని ఆయన తెలిపారు. వ్యవస్థీకృతమైన అవినీతి పేద, సామాన్య ప్రజలకు తీవ్ర నష్టాన్ని, కష్టాలను తెచ్చిపెడుతుందన్నారు. జర్నలిస్టులు అడిగిన పలు ప్రశ్నలకు ఆయన సమాధానం ఇస్తూ రాష్ట్ర ప్రభుత్వం సమస్యలను పక్కదారి పట్టించేందుకే విపక్షంపై ఆరోపణలు చేసి రాద్ధాంతం చేస్తుందని చివరకు ఏమి తేల్చలేని స్థితికి దిగజారుతుందన్నారు. ఏ ఒక్క హామీని నెరవేర్చే స్థితిలో ఈ ప్రభుత్వం లేదన్నారు. బిఆర్ఎస్ కూడా ప్రకటనలకే పరిమితం అవుతుంది తప్ప కార్యాచరణ ప్రకటించడం లేదన్నారు. రాష్ట్రంలో మూడో ఫ్రంట్కు అవకాశం లేదని తమ్మినేని తెలిపారు. కమ్యూనిస్టుల సమీకరణ శక్తి తగ్గుతుందన్న ప్రశ్నకు తమ్మినేని సమాధానం ఇస్తూ సామాజిక, ఆర్థిక, రాజకీయ వ్యవహారాల్లో వచ్చిన మార్పులు కొంత కారణమని కానీ ప్రజల సమస్యలపై నిరంతర ఆందోళనలు చేస్తూనే ఉన్నామన్నారు. ఎన్నికల ఫలితాలపై తమ్మినేని మాట్లాడుతూ బలమైన ఎజెండాతో ఎన్నికల్లోకి వెళ్తున్న బూర్జువా పార్టీల ఆర్థిక, వ్యవహారాలు ఎన్నికల సంఘం వ్యవహార శైలితో ఆశించిన ఫలితాలను బట్టలేకపోతున్నామన్నారు. కాంగ్రెస్తో 2024లో పొత్తు చెడిపోవడానికి పాలేరు కారణం కాదని తమ్మినేని స్పష్టం చేశారు. రెండు పార్టీల మధ్య సరైన అవగాహన లేదని కాంగ్రెస్ పార్టీ ఏకపక్షంగా వ్యవహరించిందన్నారు. ప్రజలను కదిలించడం ద్వారా ప్రజా ఉద్యమ నిర్మాణానికి సిపిఎం ప్రాధాన్యతనిస్తుందన్నారు. వామపక్షాల ఐక్యత గురించి అడిగిన ప్రశ్నకు సమాధానం ఇస్తూ ఐక్య కార్యాచరణ లేకుండా ఐక్యత సాధ్యం కాదని సిపిఐ, సిపిఎంల మధ్య పార్టీ కార్యక్రమంలోనే తేడా ఉందని దాని సరిచేసుకుంటేనే ఐక్యత సాధ్యమవుతుందన్నారు. విలీనానికి సిపిఎం వ్యతిరేకం కాదని ఆయన తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికార కాంక్షతో వ్యవహరిస్తుందని ఇండియా కూటమిలో ఉన్న పార్టీలను సైతం ఓడించేందుకు ప్రయత్నిస్తుందని అదే విషయం కేరళలో స్పష్టమైందన్నారు. జన్జ ఉద్యమం అంతకు ముందు రైతు ఉద్యమం ఈ దేశంలో ఇటీవల కాలంలో అపూర్వ విజయాలు సాధించాయని రైతు ఉద్యమం నల్ల చట్టాలను రద్దు చేయించగలిగితే జనీ ధర్మేంద్ర ప్రధాన న్ను రాజీనామా చేయించిందని ఇప? చేయాలని లేని పక్షంలో జన్జీతో పాటు వామపక్షాలు, కలిసి వచ్చే శక్తులను కలుపుకుని ఉద్యమిస్తాయన్నారు. జనీ డిమాండ్ లు కమ్యూనిస్టుల డిమాండ్ లనని ఆయన తెలిపారు. సిపిఎం నాయకుని హత్యకు సంబంధించి ఉప ముఖ్యమంత్రి నియోజక వర్గంలో జరిగినప్పుడు ఎవరు హత్య చేశారో తేల్చాల్సిన బాధ్యత ఆయనకే ఉందని హంతకులను అరెస్టు చేయండి అంటూ ఇప్పటికే సిపిఎం పలు ఆందోళనలు చేపట్టిందని ఒక ప్రశ్నకు సమాధానంగా తమ్మినేని తెలిపారు. ఒకరిద్దరు వ్యక్తుల వ్యక్తిగత వ్యవహారశైలి కారణంగానే ఏదులాపురం మున్సిపాలిటీలో ఒక స్థానం ఏకగ్రీవమైందని అది పార్టీ నిర్ణయం కాదన్నారు. ఖమ్మం జర్నలిస్టులు తమ్మినేనిని శాలువతో సత్కరించారు.

ఎస్ఐఆర్ ప్రక్రియలో పెండింగ్ నోటీసులు, విచారణలు పండుగకు ముందే పూర్తి చేయాలి

● ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ బి. బాల మాయాదేవి ● అన్ని రికార్డులను రీకన్సైల్ చేసి నిర్ణీత కాలపట్టికను తప్పనిసరిగా పాటించాలి ● పెద్దపల్లి ఐడీఓసీలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, అదనపు కలెక్టర్ జె. అరుణ శ్రీతో కలిసి సమీక్ష

పెద్దపల్లి ప్రతినిధి : ఎస్ఐఆర్-2026 ప్రక్రియలో పెండింగ్లో ఉన్న నోటీసులు, విచారణలను పండుగకు ముందే పూర్తి చేయాలని, నిర్ణీత కాలపట్టికను ఖచ్చితంగా పాటించాలని ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ బి. బాల మాయాదేవి అధికారులను ఆదేశించారు. సోమవారం పెద్దపల్లి జిల్లా సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, అదనపు కలెక్టర్ జె. అరుణ శ్రీతో కలిసి ఎస్ఐఆర్-2026 ప్రక్రియపై అధికారులతో ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ బి. బాల మాయాదేవి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ బి. బాల మాయాదేవి మాట్లాడుతూ పెద్దపల్లి జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియలో అధికారులు చాలా మంచి పని చేస్తున్నారని అభినందించారు. ప్రస్తుతం పెండింగ్లో ఉన్న నోటీసులు, విచారణలను పండుగకు ముందే పూర్తి చేయాలని సూచించారు. పండుగ సమయంలో సిబ్బందికి విధుల నిర్వహణలో ఇబ్బందులు ఏర్పడే అవకాశం ఉన్నందున, అప్పటిలోగా పెండింగ్ పనులన్నింటినీ పూర్తి చేయాలని స్పష్టం చేశారు. అన్ని రికార్డులను రీకన్సైల్ చేయాలి ఎస్ఐఆర్ ప్రక్రియకు సంబంధించిన అన్ని రికార్డులను తప్పనిసరిగా రీకన్సైల్ చేయాలని ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ సూచించారు. ప్రతి చిన్న క్లెయిమ్, అభ్యంతరంపై కూడా నిర్దేశిత స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ (ఎస్ఓపీ) ప్రకారం చర్యలు చేపట్టాలని తెలిపారు. నిర్ణీత గడువులను ఎట్టి పరిస్థితుల్లోనూ అధిగమించకుండా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఈ నెల చివరి వారంలో మరోసారి జిల్లాను సందర్శించి ఎస్ఐఆర్ ప్రక్రియలో పనుల పురోగతిని పరిశీలిస్తామని తెలిపారు. ఎక్కువ తొలగింపులు, చేర్పులున్న పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి ఏయే పోలింగ్ కేంద్రాల్లో ఎక్కువ సంఖ్యలో ఓటర్ల తొలగింపులు, చేర్పులు నమోదయ్యాయో గుర్తించి, ఆయా పోలింగ్ కేంద్రాల వివరాలను ప్రత్యేకంగా పరిశీలించాలని బి.బాలమాయాదేవి అధికారులను ఆదేశించారు. సంబంధిత వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి, అవసరమైన చోట్ల నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని సూచించారు. రాజకీయ పార్టీలతో సమావేశాలు నిర్వహించాలి. ఎస్ఐఆర్ ప్రక్రియకు సంబంధించి రాజకీయ పార్టీలతో అన్ని స్థాయిల్లో క్రమం తప్పకుండా సమావేశాలు నిర్వహించాలని ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ సూచించారు. ప్రతి సమావేశానికి సంబంధించిన మినిట్స్ కాపీలను తప్పనిసరిగా రికార్డుల్లో నమోదు చేసి భద్రపరచాలని తెలిపారు. అర్హులైన ఓటర్లను గుర్తించి తుది నివేదికలో పొందుపరుస్తున్నాం జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ ఎస్ఐఆర్ ప్రక్రియలో గుర్తించిన అన్ని అనామలీలు, నో మ్యాపింగ్ ఓటర్లకు నోటీసులు జారీ చేసి, వారి నుంచి అవసరమైన పత్రాలను సేకరిస్తున్నామని తెలిపారు. సేకరించిన పత్రాలు, వివరాలను పరిశీలించి తుది నివేదికలో పొందుపరుస్తున్నామని వివరించారు. ప్రస్తుతం బీఎల్ఓలు ఇంటింటికీ వెళ్లి ఓటర్ల నుంచి అవసరమైన పత్రాలను సేకరిస్తున్నారని తెలిపారు. పత్రాలు అందుబాటులో లేని

సందర్భాల్లో కూడా ఓటరు అర్హత కలిగి ఉన్నట్లయితే, నిబంధనలకు అనుగుణంగా అవసరమైన ఇతర పత్రాలను సమర్పించేలా వారికి సహకరిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. 18 సంవత్సరాలు పూర్తిచేసుకునే వారి నుంచి ఫారం-6 దరఖాస్తుల స్వీకరణ ఇంటింటి సర్వే సందర్భంగా 01.10.2026 నాటికి 18 సంవత్సరాలు పూర్తిచేసుకునే అర్హులైన యువత నుంచి ఫారం-6 దరఖాస్తులను సేకరిస్తున్నామని జిల్లా కలెక్టర్ తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరిని ఓటరు జాబితాలో చేర్చేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. బీఎల్ఓల సంప్రదింపు వివరాలను ఓటర్లకు విస్తృతంగా తెలియజేశామని, ఓటర్లు తమ సందేహాలు, దరఖాస్తులు, అవసరమైన పత్రాల సమర్పణకు సంబంధించి బీఎల్ఓలను సంప్రదించేలా అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. మున్సిపల్ ప్రాంతాల్లో వార్డు అధికారులు, ఇతర సిబ్బంది భాగస్వామ్యం మున్సిపల్ ప్రాంతాల్లో ఎస్ఐఆర్-2026 కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించేందుకు వార్డు అధికారులు, ఇతర సిబ్బంది కూడా కార్యక్రమంలో భాగస్వాములై పనిచేస్తున్నారని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. బీఎల్ఓలకు అవసరమైన సహకారం అందిస్తూ, ఇంటింటి సర్వే, పత్రాల సేకరణ, ఓటర్ల సందేహాల పరిష్కారంలో క్షేత్రస్థాయిలో సహకరిస్తున్నారని వివరించారు.ఎస్ఐఆర్ ప్రక్రియలో ప్రతి దశలో నిబంధనలను పాటిస్తూ, పారదర్శకంగా పనులు చేపట్టాలని, అర్హులైన ఓటర్ల వివరాలు తుది జాబితాలో సక్రమంగా నమోదయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ బి. బాల మాయాదేవి సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో ఆర్డీవోలు గంగయ్య, సురేష్, సంబంధిత ఎన్నికల అధికారులు, తహసీల్దార్లు, బీఎల్ఓలు, మున్సిపల్ అధికారులు, ఇతర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రతి ఫిర్యాదు దరఖాస్తును పరిశీలించి చర్యలు తీసుకోవాలి

● స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ శ్రీజ

ఖమ్మం ప్రతినిధి, అక్టోబర్ 02: ప్రతి ఫిర్యాదు దరఖాస్తును పరిశీలించి త్వరగా పరిష్కరించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ జిల్లా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ ప్రజల అర్జీలను స్వీకరించారు. తిరుమలాయపాలెం మండలం హస్నాబాద్ గ్రామ పంచాయతీకి చెందిన మాజీ సర్పంచ్ బొబ్బిలి భరత్ చంద్ర తనకు పంచాయతీ నుంచి 17 లక్షల 3 వేల 450 రూపాయల బిల్లులు పెండింగ్ ఉన్నాయని వీటిని త్వరగా చెల్లించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, జిల్లా పంచాయతీ అధికారికి రాస్తూ పరిశీలించి అక్టోబర్ 10 నాటికి విచారణ నివేదిక సమర్పించాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, బీసీ డాక్టర్ బి. ఆర్ అంబేద్కర్ సేవా సంఘం ప్రతినిధులు ప్రైవేట్ పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా కొనసాగిస్తున్నారని వీటిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, జిల్లా విద్యాశాఖ అధికారికి రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. ఖమ్మం జిల్లాకు చెందిన బోడ యమున తాను బీటెక్ పూర్తి చేశానని, కుటుంబ పరిస్థితుల కారణంగా తనకు ఖమ్మం జిల్లాలో లేదా సమీప ప్రాంతాలలో ఏదైనా ఉద్యోగం కల్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, జిల్లా ఉపాధి అధికారికి రాస్తూ అవకాశం మేరకు చర్యలు తీసుకోవాలని అన్నారు. తిరుమలాయపాలెం మండలం హస్నాబాద్ గ్రామ పంచాయతీకి చెందిన మామిడాల అనసూర్య తన కోడలు నుంచి జీవనభృతి ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, జిల్లా సంక్షేమ అధికారికి రాస్తూ అవసరమైన చర్యలు చేపట్టాలని అన్నారు. - జి. వెంకటస్వామి (కాక) జయంతి సందర్భంగా అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ నివాళులు జి. వెంకటస్వామి (కాక) జయంతి సందర్భంగా సోమవారం ఖమ్మం కలెక్టరేట్లో ప్రజావాణి కార్యక్రమం ప్రారంభానికి ముందు అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ వారి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ

సందర్భంగా జి. వెంకటస్వామి (కాక) సేవలను, పేదలు, అట్టడుగు వర్గాల అభ్యున్నతికి చేసిన కృషిని స్మరించుకున్నారు. మంత్రిగా, వివిధ కీలక పదవుల్లో పనిచేస్తూ ప్రజల సమస్యల పరిష్కారానికి, పేదల సంక్షేమానికి జి. వెంకటస్వామి విశేష కృషి చేశారని అదనపు కలెక్టర్ పేర్కొన్నారు. కార్మికులు, పేదలు, అట్టడుగు వర్గాల సంక్షేమం కోసం వారు అందించిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. మహనీయుల ఆశయాలు, సేవా స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని ఈ సందర్భంగా జిల్లా అధికారులకు అదనపు కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కామారెడ్డి గాంధారి ఏకలవ్య ఆదర్శ గురుకుల పాఠశాలను రాష్ట్రస్థాయిలో నంబర్ వన్గా నిలిపేందుకు సమష్టిగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు

కామారెడ్డి ప్రతినిధి : కామారెడ్డి జిల్లా ఏకలవ్య పాఠశాలను రాష్ట్రస్థాయిలో నంబర్ వన్గా నిలపాలి పాఠశాల సమస్యలను తక్షణమే పరిష్కరించాలి జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి నియోజకవర్గంలో గాంధారి మండలంలోగల ఏకలవ్య ఆదర్శ గురుకుల పాఠశాలను రాష్ట్రస్థాయిలో నంబర్ వన్గా నిలిపేందుకు సమష్టిగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్లోని మినీ సమావేశ మందిరంలో నిర్వహించిన ఏకలవ్య ఆదర్శ గురుకుల పాఠశాల జిల్లా స్థాయి పాలక మండలి సమావేశంలో పాఠశాల ప్రగతిపై కలెక్టర్ సమీక్షించారు. పాఠశాలలోని సమస్యలను గుర్తించి తక్షణమే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా స్థాయి పాలక మండలి సభ్యులు వారానికి ఒకరు చొప్పున పాఠశాలను సందర్శించి, అక్కడి పరిస్థితులపై నివేదిక సమర్పించాలని సూచించారు. పాఠశాలలో చేపడుతున్న ఇంజినీరింగ్ పనులను ఈ నెలలోనే పూర్తి చేస్తామని డీఈఈ సంపత్ కుమార్ కలెక్టర్కు వివరించారు. తదుపరి పాలక మండలి సమావేశాన్ని జనవరిలో నిర్వహించాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి చందర్ నాయక్, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి పి. చంద్రశేఖర్, ప్రాంతీయ సమన్వయ అధికారి గంగారాం నాయక్, జిల్లా సంక్షేమ అధికారి సౌజన్య, ప్రధానాచార్యులు శ్యామలదేవి, అమర్ సింగ్, మాధవరావు, రవీంద్ర కుమార్, సంతోష్ శుక్లా తదితరులు పాల్గొన్నారు.

కాకరవాయి గ్రామ కంఠం (ప్రభుత్వ) భూములను రక్షించాలని ప్రజావాణిలో వినతిపత్రం

ఖమ్మం ప్రతినిధి, అక్టోబర్ 05: తిరుమలాయపాలెం మండలం కాకరవాయి గ్రామంలో గ్రామకంఠం ప్రభుత్వ భూములను రక్షించాలని సోమవారం సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ (ప్రజాపంథా) ఆధ్వర్యంలో ఖమ్మం లో కలెక్టరేట్ జరిగిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్ శ్రీజ కు ప్రతినిధి బృందంగా వినతిపత్రం ఇవ్వడం జరిగింది. కాకరవాయి గ్రామంలో ఎన్నోసార్లు రెవిన్యూ అధికారులకి పంచాయతీ అధికారులకు ఫిర్యాదులు చేసిన పట్టించుకోకుండా ఆక్రమించుకున్న వ్యక్తులకి సహకరిస్తూ వారి పేరు మీద రిజిస్ట్రేషన్ చేయడం వెనకాల ప్రజా ప్రతినిధులు. ప్రభుత్వ అధికారుల హస్తం ఉందని అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం (ఏఐపీకేఎంఎస్) ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి తిమ్మిడి హనుమంతరావు అన్నారు. కాకరవాయిలో ఆక్రమించుకుంటున్న భూ బకాసురులపై వెంటనే చర్యలు తీసుకొని గ్రామ కంట భూములను కాపాడాలని అన్నారు. బచ్చోడు గ్రామాన్ని నూతన మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని మరియు బచ్చోడు లోప్రభుత్వ రంగ ఎస్బిఐ బ్యాంకులను ఏర్పాటు చేయాలని సోమవారం ప్రజావాణిలో అదనపు కలెక్టర్ శ్రీజ కి, ఎస్బిఐ ఖమ్మం వరంగల్ రీజనల్ మేనేజర్ రామ్మూర్తి గార్లకు ప్రతినిధి బృందంతో వినతి పత్రం సోమవారం ఇవ్వడం జరిగింది. బచ్చోడు లో బ్యాంకు ఏర్పాటు కోసం ప్రజా సేకరణ చేస్తామని మేనేజర్ తెలిపారని తిమ్మిడి హనుమంతరావు అన్నారు. ఈ కార్యక్రమంలో సోమనపల్లి వెంకటేశ్వర్లు, పరికపల్లి మధు, కొత్తపల్లి శివప్రసాద్, తోకల సీతారాములు, పోలే పొంగు ఉప్పలయ్య, బోర ఎలమంచి, ఎస్ కే సర్దార్, విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల పోస్టర్ల విడుదల

లక్షెట్టిపేట, అక్టోబర్ 05 : దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నిర్వహించనున్న వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. శ్రీ సాయి గణేష్ భక్తమండలి ఆధ్వర్యంలో నిర్వహించనున్న కార్యక్రమాల పోస్టర్లను సీఐ నారాయణమూర్తి, ఎస్సై గోపతి సురేష్, మున్సిపల్ కమిషనర్ విజయ్ కుమార్, వేద పండితులు, కాలనీ సభ్యులు కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఐ నారాయణమూర్తి మాట్లాడుతూ, శరన్నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని సూచించారు. ఉత్సవాలకు వచ్చే భక్తుల భద్రతకు ప్రతి ఒక్కరూ సహకరించాలని, చిన్నపిల్లలు, వృద్ధుల విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమాల సమయంలో ట్రాఫిక్కు అంతరాయం కలగకుండా నిర్వాహకులు, ప్రజలు పోలీసులకు సహకరించాలని సూచించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని కోరారు. నవరాత్రుల్లో భాగంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, కుంకుమార్చనలు, భజనలు తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్సై గోపతి సురేష్, మున్సిపల్ కమిషనర్ విజయ్ కుమార్, వేద పండితులు, కాలనీ సభ్యులు, భక్తమండలి నిర్వాహకులు పాల్గొన్నారు.

ప్రజావాణి అర్జీలను వెంటనే పరిష్కరించాలి

అధికారులకు కలెక్టర్ మను చౌదరి ఆదేశం

మేడ్చల్, అక్టోబర్ 05: ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలను ఎలాంటి జాప్యం లేకుండా నిబంధనల ప్రకారం వెంటనే పరిష్కరించాలని మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఫైజాన్ అహ్మద్తో కలిసి కలెక్టర్ ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా రెవెన్యూ, పంచాయతీరాజ్, పౌరసరఫరాలు, మున్సిపల్ తదితర శాఖలకు సంబంధించిన మొత్తం 110 దరఖాస్తులను ప్రజల నుంచి స్వీకరించినట్లు కలెక్టర్ తెలిపారు. వివిధ ప్రాంతాల నుంచి తమ సమస్యలను పరిష్కరించాలంటూ ప్రజావాణికి వచ్చిన అర్జీదారుల సమస్యలకు అధికారులు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి నిబంధనల మేరకు వేగంగా పరిష్కారం చూపాలని ఆదేశించారు. ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులపై చేపట్టిన చర్యల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్లైన్లో నమోదు చేయాలని సంబంధిత శాఖల అధికారులకు కలెక్టర్ సూచించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం, జాప్యం లేకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో డీఆర్వో మాలతి, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సింగరేణి వాస్తవ లాభాలను ప్రకటించాలి

● 36% వాటా కార్మికులకు చెల్లించాలి ● అభివృద్ధి పేరిట కోతలు లేకుండా ఇవ్వాలి ● ఆర్.జీ-త్రీ అన్ని గనుల్లో టీబీజీకేస్ శ్రేణుల వినతి పత్రం

రామగిరి, అక్టోబర్ 05:- కార్మికుని చెమటతో ఎన్నో కష్టనష్టాలను ఓర్చుకొని అనారోగ్య సమస్యలను తెచ్చుకొని ప్రమాదాల సుడిగుండంలో పనిచేస్తూ బొగ్గును వెలికితీస్తూ కార్మికులు కంపెనీకి లాభాలను తీసుకువస్తున్నారని యాజమాన్యం గత ఆర్థిక సంవత్సరంలో కంపెనీకి వచ్చిన లాభాలను వెంటనే ప్రకటించి 36 శాతం లాభాల వాటాను కార్మికులకు చెల్లించాలని తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం ఆర్జీ-త్రీ , ఏపీఏ ఉపాధ్యక్షుడు నాగేల్లి సాంబయ్య డిమాండ్ చేశారు. సోమవారం తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం కేంద్ర కమిటీ గౌరవ అధ్యక్షుడు కొప్పుల ఈశ్వర్ అధ్యక్షులు మిర్యాల రాజిరెడ్డి ఆదేశాల మేరకు డివిజన్లోని అన్ని గనులు, డిపార్ట్మెంట్ల వద్ద మేనేజర్లకు ఇతర ఉన్నతాధికారులకు వినతి పత్రం అందించారు. ఓసీ-వన్ ఫిట్ సెక్రటరీ గీటుకు శ్రీనివాస్, ఓసి-టూ బేస్ వర్క్ షాప్ ఫిట్ సెక్రటరీ చిప్ప సురేష్ , సిహెచ్పి పిట్ సెక్రటరీ బుద్దే ఉదయ్,ఏ ఎల్ పి అసిస్టెంట్ ఫిట్ సెక్రటరీలు పూసాలశేఖర్, గొర్రె క్రాంతి యాదవ్, కొప్పుల సురేష్, ఎస్ అండ్ పి సి పిట్ సెక్రెటరీ దేవరకొండ తిరుపతి ఓసి-వన్ బేస్ వర్క్ షాప్ పిట్ సెక్రటరీ భోగం పూర్ణాకర్ ల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సెంట్రల్ డిప్యూటీ జనరల్ సెక్రెటరీ పింగిలి సంపత్ రెడ్డి, సెంట్రల్ జాయింట్ మరియు ఆర్గనైజింగ్ సెక్రటరీలు దేవ శ్రీనివాస్, ఈసంపల్లి రమేష్, గట్టు శ్రీనివాస్, బోయినపల్లి శ్రీకాంత్ రావు, బ్రాంచ్ సెక్రటరీలు అల్లం తిరుపతి, దాసరి మల్లేష్, బోట్ల శివశంకర్ ముఖ్య అతిథులుగా పాల్గొనగా డివిజన్ పిట్ కమిటీ కమిటీ నాయకులు ఇతర కార్మికులతో కలిసి నాయకులు ఆయా గనుల మేనేజర్లకు హెచ్ఓడీలకు ర్యాలీగా నినాదాలు చేసుకుంటూ వెళ్లి వినతి పత్రాలు సమర్పించారు. అభివృద్ధి నిధుల పేరిట కోతలు ఈ సందర్భంగా నాగేల్లి సాంబయ్య మాట్లాడుతూ 2022--23 ఆర్థిక సంవత్సరంలో సింగరేణి ?2,222 కోట్లు లాభాలు గడించగా 32% శాతం లాభాలను కార్మికులకు చెల్లించారు. టీబీజీకేఎస్ హయాంలో సంస్థ అభివృద్ధి కోసం ఎలాంటి నిధులను పక్కన పెట్టలేదన్నారు. ఏఐటీయూసీ-ఐఎన్ టీ యూ ప్రాతినిధ్యంలో 2023--24 ఆర్థిక సంవత్సరంలు అర్జించగా లాభాల వాటా 33 శాతం అని ప్రకటించి సంస్థ అభివృద్ధి పేరిట ?2,289 కోట్లు ప్రక్కన పకులకు మాత్రం 2412 కోట్లు మాత్రమే లాభాల వాటా పంపిణీ చేశారు ఇది 16.9% శాతం మాత్రమే అన్నారు. 2024--25 ఆర్థిక సంవత్సరం కూడా సింగరేణి 6,394 కోట్లు లాభాలు వచ్చాయని తెలుపుతూ సంస్థ అభివృద్ధి పేరిట ప్రక్కన పెట్టిన డబ్బులు 4,034 కోట్లు పొగా మిగిలిన డబ్బులలో కార్మికులకు పంచినవి కేవలం 2360 కోట్లు మాత్రమేనని ఇది. లాభాల వాటా ప్రకారం 12.5,% మాత్రమే అని దీనివల్ల కార్మికులు ఆర్థికంగా తీవ్ర నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. అప్పటి గుర్తింపు ప్రాతినిధ్య సంఘాలు ఏమాత్రం పట్టింపు లేకుండా కనీసం నిలదీయకుండా ఉండడంతో కార్మికులకు అన్యాయం జరిగిందన్నారు. 2023--24 మరియు 2024--25 సంవత్సరాల్లో కలిపి ?6,323 కోట్లు సంస్థ అభివృద్ధి కోసం పక్కన పెట్టడం జరిగింది. అట్టి నిధులతో ఇలాంటి అభివృద్ధి చేశారు కంపెనీ కోసం కొత్త వాహనాలను సమకూర్చారో వెల్లడించాలన్నారు. అదే విధంగా, తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం హయాంలో సంస్థ అభివృద్ధి కోసం ఎలాంటి నిధులు పక్కన పెట్టలేదనే అంశాన్ని కూడా కార్మికులు గమనించాలి. ఈ గణాంకాలను కార్మిక లోకం పరిశీలించి, సంస్థ భవిష్యత్తు మరియు కార్మికుల ప్రయోజనాల దృష్ట్యా వాస్తవాలను గమనించాలని వివరిస్తూ వెంటనే వాస్తవ లాభాలను ప్రకటించి అట్టి లాభాలలో 36% వాటా ఇలాంటి కోతలు లేకుండా కార్మికులకు దసరాకు వారం పది రోజుల ముందే పంపిణీ చేయాలని వినతి పత్రం ద్వారా అధికారులను కోరారు. ఆలస్యం జరిగిన పక్షంలో కార్మికుల అందరితో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమించేందుకు సిద్ధంగా ఉన్నామని వెల్లడించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ టీబీజీకేఎస్ నాయకులు ఇచ్చిన వినతి పత్రాన్ని ఉన్నతాధికారులకు పంపిస్తామని తెలియపరిచారు. ఈ కార్యక్రమంలో నాయకులు సెంట్రల్ జాయింట్ సెక్రటరీలు సుద్దాల తిరుపతి, కూతాటి వెంకటయ్య, సత్యనారాయణ, శ్రీనివాస్, రవీందర్, చుక్కల కుమార్, బండి బాబురావు ,మల్లేష్ సత్యనారాయణ, నరసయ్య, రవి ఏ ఎల్ పి నాయకులు మహేష్, వేదవ్యా స్ ,కిరణ్, సదన్ శ్రీనివాస్ ,ఆనంద్ ,మధు పటేల్ ,సందీప్ ,చిరంజీవి రాజేష్ ,వెంకటేష్ ,వెంకి ఓసి-టూ నాయకులు ఆర్గనైజింగ్ సెక్రటరీ కొండపర్తి తిరుపతి ,మోసం రమేష్ , కుమ్మరి కుంట వెంకటేశం, లింగం గట్టయ్య, పాపేశ్వరరావు ,నగునూరి శ్రీధర్ గౌడ్ ,అంకం రాయమల్లు నలివేణి సదానందం, శశి కుమార్ బీరం సంజీవ్, పేరల తిరుపతిరావు, పిడుగు సురేష్ ,గాండ్ల సతీష్ కుమార్ ,గూడ సంతోష్ కుమార్ ,కామ రాయమల్లు మోహన్, చిప్ప సదన్ రాజన్న ,సేగం శ్యామ్ ,మోరే శ్రీను ,బాపు సిహెచ్ పి నాయకులు పిడుగురాళ్ల చంద్రయ్య, బిల్లా రవీందర్, రవీందర్ రెడ్డి ,చిప్పరాజు,ఎష్ట్ర స్వామి, పూర్ణచందర్, రాజ్ కుమార్, ఎస్ ఎన్ పి సి నాయకులు పొన్నం సదయ్య, కొత్తపల్లి సదానందం, పల్కపాటి రామయ్య, గోట్టే శ్రీనివాస్, బొడ్డు సమ్మయ్య, కాసర్ల తిరుపతి, గోమాస దేవాజీ, మామిడిపెల్లి శ్రీనివాస్, కొట్టే వెంకటస్వామి, ఆకుల కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పై గుంతకు.. త్రివర్ణ పతాకమే ది(క్కు)క్కా..?

● నెల రోజులకు పైగా ప్రధాన రహదారిపై ఇదే దుస్థితి ● అధికారుల కళ్లకు కనిపించని గుంత! ● రిఫ్లెక్టర్లు పెట్టాల్సిన చోట జాతీయ జెండాతో ప్రమాద హెచ్చరిక ● జమ్మికుంట-తనుగుల రహదారి పై కనిపించిన దృశ్యం ● ప్రత్యేక కథనం...

బ్యూరో,: జమ్మికుంట నుంచి తనుగుల మీదుగా గోదావరిఖనికి వెళ్లే ప్రధాన రహదారి అది. నిత్యం అధికారులు, పోలీసులు, ప్రజాప్రతినిధులు, వందలాది వాహనాలు రాకపోకలు సాగించే మార్గం. అలాంటి ప్రధాన రహదారిపై ఏర్పడిన ఓ ప్రమాదకర గుంత దగ్గర మాత్రం నెల రోజులకు పైగా త్రివర్ణపతాకమే హెచ్చరిక రిబ్బన్ లాగా దర్శనమిస్తోందని ప్రయాణికులు చెబుతున్నారు.

అయితే గుంతను పూడ్చాల్సిన అధికారులు పట్టించుకోలేదు. కనీసం ప్రయాణికులను అప్రమత్తం చేసేందుకు రిఫ్లెక్టర్లు, హెచ్చరిక బోర్డు, బ్యారికేడ్లు ఏర్పాటు చేయలేదు. దీంతో చివరకు ఎవరో ఒకరు గుంత వద్ద త్రివర్ణ పతాకాన్ని నిలబెట్టి.. "ఇక్కడ ప్రమాదం ఉంది.. జాగ్రత్త!" అంటూ ప్రయాణికులకు హెచ్చరిక చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ఇక్కడే అసలు ప్రశ్న మొదలవుతోంది. జాతీయ పతాకాన్ని ఎగురవేసేటప్పుడు అది వంగకుండా, నేలను తాకకుండా, తలకిందులుగా కాకుండా అత్యంత గౌరవంతో ప్రదర్శించాలనే నిబంధనలు ఉన్నాయి. చిన్నపాటి నిర్లక్ష్యంపైనా జాతీయ పతాక గౌరవం గురించి ప్రశ్నలు తలెత్తుతాయి. మరి అలాంటి త్రివర్ణ పతాకాన్ని ఒక ప్రధాన రహదారిపై గుంతకు ప్రమాద సూచికగా నెల రోజులకు పైగా నిలబెట్టాల్సిన పరిస్థితి ఎందుకొచ్చింది?

జెండా గౌరవం గురించి పట్టించుకునే అధికారులు.. జెండా పెట్టాల్సిన పరిస్థితి తెచ్చిన గుంతను ఎందుకు పట్టించుకోవడం లేదు?

ఇదే రహదారిపై పోలీసులు నిత్యం పహారా తిరుగుతుంటారు. అధికారులు, నాయకులు ఎందరెందరో రాకపోకలు సాగిస్తున్నారు. అయినా నెల రోజులకు పైగా ఉన్న ఈ గుంత ఎవరి కంటా పడకపోవడం ఏమిటి? కనిపించలేదా..? కనిపించినా పట్టించుకోలేదా..?

రోడ్డుపై ప్రమాదకర గుంత ఏర్పడితే వెంటనే హెచ్చరిక బోర్డు, రిఫ్లెక్టర్లు, బ్యారికేడ్లు ఏర్పాటు చేసి ప్రయాణికులను అప్రమత్తం చేయాలి. ఆ తర్వాత గుంతను పూడ్చి రహదారిని సురక్షితంగా మార్చాలి. కానీ ఇక్కడ మాత్రం గుంత అలాగే.. ప్రమాదం అలాగే.. అధికారుల నిర్లక్ష్యం కూడా అలాగే!

ముఖ్యంగా రాత్రివేళ ఈ గుంత మరింత ప్రమాదకరంగా మారే అవకాశం ఉంది. ద్విచక్ర వాహనదారులు అదుపుతప్పినా, ఎదురుగా వచ్చే వాహనాన్ని తప్పించుకునే క్రమంలో గుంతలో పడినా తీవ్ర ప్రమాదం జరిగే అవకాశం ఉంది. ప్రజల ప్రాణాలకు రిఫ్లెక్టర్ అవసరం లేదా?

జమ్మికుంట- తనుగుల రహదారిపై గుంతలో దర్శనమిస్తున్న మూడు రంగుల జెండా

ప్రమాదం కనిపించేందుకు హెచ్చరిక బోర్డు అవసరం లేదా? గుంత పూడ్చడానికి అధికారులకు నెల రోజులు కూడా సరిపోవా? చివరకు ప్రయాణికులే రోడ్డుపై జెండా పెట్టి అధికారులకు గుంత చూపించాల్సిన పరిస్థితి రావడం రహదారి నిర్వహణపై ఎన్నో ప్రశ్నలు లేవనెత్తుతోంది. అధికారుల కళ్లకు కనిపించని గుంతను.. ప్రయాణికులు జెండా పెట్టి చూపించాలా? గుంతకు త్రివర్ణ పతాకమే దిక్కయితే.. రోడ్డు భద్రతకు బాధ్యత ఎవరిది? ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గుంతను పూడ్చడంతో పాటు, రహదారిపై భద్రతా హెచ్చరికలు ఏర్పాటు చేసి ప్రయాణికులకు ప్రమాదం లేకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. జాతీయ పతాకానికి గౌరవం ఎంత ముఖ్యమో.. ఆ పతాకాన్ని గుంతకు హెచ్చరికగా పెట్టాల్సిన దుస్థితి రాకుండా చూడటం కూడా అంతే ముఖ్యం అంటున్నారు ప్రయానికులు.

గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో ఘనంగా బొడ్డెమ్మ వేడుకలు

ధర్మపురి, అక్టోబర్ 5, : ధర్మపురి పట్టణంలోని గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో సోమవారం బొడ్డెమ్మ వేడుకల్ని ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్ని ప్రతి సంవత్సరం పితృ అమావాస్యకు ముందు నిర్వహించడం గంగపుత్రు ఆనవాయితీగా వస్తోందని ఇక్కడి మహిళలు తెలిపారు. ఈ బొడ్డెమ్మ వేడుకల్ని గంగపుత్ర మహిళలు ఒక చోట చేరి పేర్చడం జరుగుతుంది. ఇలా పేర్చిన బొడ్డెమ్మ ను కుల సంఘంలోని పెళ్ళి కానీ అమ్మాయి కి ఎత్తడం వీరి ఆనవాయితీగా వస్తోంది. ఇలా ఎత్తిన బొడ్డెమ్మ ను ఊరేగింపు గా మహిళలు అందురు బాజా బజంత్రీల నడుమ కోలాటాలు ఆడుతూ పట్టణంలో ని ప్రధాన వీధులు అయిన నది చౌరస్తా అక్కడి నుండి శ్రీ లక్ష్మీ నృసింహ స్వామి దేవాలయం ముందు నుండి గోదావరికి వెళ్లి బొడ్డెమ్మ అంపడం జరుగుతుందని మహిళలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణానికి చెందిన పలువురు ప్రముఖులు, వివిధ పార్టీల నాయకులు గంగపుత్ర సంఘం సభ్యులు, పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

బాధితుల సమస్యలకు త్వరిత పరిష్కారం చూపాలి

రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆదేశం

గ్రీవెన్స్ డేలో ఫిర్యాదులు స్వీకరించిన పోలీస్ కమిషనర్

గోదావరిఖని క్రైమ్ : ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం పోలీసులను ఆశ్రయించాలని, అందిన ఫిర్యాదులపై చట్టబద్ధంగా వేగంగా స్పందించాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అన్నారు. సోమవారం కమిషనరేట్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ డేలో ఆయన బాధితులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకుని ఫిర్యాదులను స్వీకరించారు. ప్రతి ఫిర్యాదును సమగ్రంగా పరిశీలించి బాధితులకు న్యాయం జరిగే విధంగా అవసరమైన చర్యలు వెంటనే చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఫిర్యాదుల పరిష్కారంలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ఆయా కేసుల్లో చేపట్టిన చర్యల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని సూచించారు. ప్రజలకు నాణ్యమైన పోలీస్ సేవలు అందించేందుకు అన్ని విభాగాల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని, బాధితుల సమస్యలను సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని పోలీస్ కమిషనర్ స్పష్టం చేశారు. కార్యక్రమంలో అదనపు డీసీపీ కె. శ్రీనివాస్ పాల్గొన్నారు.

డా.బి.ఆర్. అంబేడ్కర్‌పై వ్యాఖ్యల విషయంలో అభిజీత్ దీప్కే వివరణ ఇవ్వాలి

చారిత్రక మహనీయుల పాత్రను గౌరవప్రదంగా చర్చించాలి: బండి శ్రీనివాస్ శ్రీ సన్

కరీంనగర్ టౌన్, అక్టోబర్4: డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చారిత్రక పాత్రకు సంబంధించి కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే ఇటీవల చేసిన వ్యాఖ్యలు చర్చకు దారితీశాయని భారతీయ నవజీవన్ పార్టీ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు బండి శ్రీనివాస్ శ్రీసన్ తెలిపారు. మాజీ ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ వల్లే డా. బి.ఆర్. అంబేద్కర్‌కు ప్రాధాన్యం లభించిందన్న భావన కలిగించేలా వచ్చిన వ్యాఖ్యలపై అభిజీత్ దీప్కే మరింత స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. డా. బి.ఆర్. అంబేద్కర్ సేవలు, ఆలోచనలు, రాజ్యాంగ నిర్మాణంలో ఆయన పోషించిన పాత్ర దేశ చరిత్రలో ప్రత్యేకమైనవి. ఆయన కృషిని చర్చించేటప్పుడు చారిత్రక వాస్తవాలను సమగ్రంగా పరిగణనలోకి తీసుకోవడం, ఆయనను గౌరవించే కోట్లాది ప్రజల భావాలను కూడా దృష్టిలో ఉంచుకోవడం అవసరం అని బండి శ్రీనివాస్ శ్రీ సన్ పేర్కొన్నారు. జవహర్‌లాల్ నెహ్రూ సహా దేశ నిర్మాణంలో పాత్ర పోషించిన ప్రతి చారిత్రక నాయకుడి సేవలను వారి కాలం, పరిస్థితులు, చారిత్రక ఆధారాల నేపథ్యంలోనే చర్చించడం సముచితమని ఆయన అన్నారు. రాజకీయ భేదాలు ఏవైనా చారిత్రక మహనీయుల గురించి మాట్లాడేటప్పుడు పరస్పర గౌరవం, సంయమనం పాటించడం ప్రజాస్వామ్య సంప్రదాయాలకు అనుగుణంగా ఉంటుందని బండి శ్రీనివాస్ శ్రీ సన్ అన్నారు. అంబేద్కర్ వారసత్వం ఏ ఒక్క పార్టీకి, ఏ ఒక్క వర్గానికి పరిమితమైనది కాదు. భారత రాజ్యాంగం, సమానత్వం, సామాజిక న్యాయం వంటి విలువలతో ఆయన పేరు ముడిపడి ఉంది. అందువల్ల ఆయన పాత్రపై జరిగే ప్రతి చర్చ వాస్తవాధారంగా, గౌరవప్రదంగా సాగాలి" అని ఆయన తెలిపారు. అభిజీత్ దీప్కే తన వ్యాఖ్యల ఉద్దేశాన్ని స్పష్టంగా తెలియజేసి, ఎవరి మనోభావాలైనా దెబ్బతిన్నట్లయితే సానుకూలంగా స్పందించి, అవసరమైతే క్షమాపణ చెప్పాలని బండి శ్రీనివాస్ శ్రీ సన్ కోరారు. భారతీయ నవజీవన్ పార్టీ రాజ్యాంగ విలువలు, సమానత్వం, సామాజిక న్యాయం, ప్రజాస్వామ్య స్ఫూర్తికి ప్రాధాన్యత ఇస్తుందని ఆయన స్పష్టం చేశారు.

సహారా ఖాతాదారుల సమస్యల పరిష్కారానికి ఉద్యమమే మార్గం

జమ్మికుంటలో నూతన కార్యవర్గం ఎన్నిక

జమ్మికుంట అక్టోబర్ 5 : సహారా ఇండియా ఖాతాదారులు, కార్యకర్తల సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయాలని సహారా ఖాతాదారుల మరియు కార్యకర్తల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వడ్ల బాలయ్య పిలుపునిచ్చారు. సోమవారం జమ్మికుంటలో సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు పరిణెం రవీందర్ రెడ్డి, రాష్ట్ర ప్రచార కార్యదర్శి మద్దెల రమేష్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు వడ్ల బాలయ్య మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అనుమతులతో 48 సంవత్సరాలుగా కొనసాగిన సహారా ఇండియా సంస్థలో దేశవ్యాప్తంగా కోట్లాది మంది పేద, మధ్యతరగతి ప్రజలు తమ జీవితకాల పొదుపులను డిపాజిట్ చేశారని తెలిపారు. పిల్లల చదువులు, ఇళ్ల నిర్మాణం, ఆడపిల్లల వివాహాలు తదితర అవసరాల కోసం కాలపరిమితి ఉన్న పథకాల్లో డబ్బులు జమ చేసిన ఖాతాదారులు, తమ సొమ్ము తిరిగి వస్తుందని ఏళ్లుగా ఎదురుచూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా సుమారు 13 కోట్ల మంది ఖాతాదారులకు రూ.2 లక్షల కోట్ల మేరకు చెల్లింపులు రావాల్సి ఉందని, సంస్థకు భారీగా ఆస్తులు ఉన్నప్పటికీ ఖాతాదారులకు పూర్తి స్థాయిలో డబ్బులు అందడం లేదని అన్నారు. యాజమాన్యం నుంచి ఖాతాదారులకు సరైన సమాచారం అందకపోవడం వల్ల వారు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని పేర్కొన్నారు. ఖాతాదారుల సమస్యలపై ఇప్పటికే ఎంపీలు, ఎమ్మెల్యేలను కలిసి వినతిపత్రాలు సమర్పించినప్పటికీ ఆశించిన స్థాయిలో స్పందన రాలేదన్నారు. ఈ నేపథ్యంలో ఖాతాదారుల హక్కుల కోసం ఉద్యమించడమే ఏకైక మార్గమని భావించి జమ్మికుంటలో ఉద్యమ కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సహారా ఖాతాదారుల సొమ్ము తిరిగి చెల్లించేలా ప్రభుత్వాలు తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జమ్మికుంట నూతన కార్యవర్గం అధ్యక్షులు: మారెళ్ల ప్రభాకర్ ఉపాధ్యక్షులు: నాస్ట్ర తిరుపతి, మ్యాక శ్రీనివాస్ ప్రధాన కార్యదర్శి: రేపాల శ్రీనివాస్ కోశాధికారి: దయ్యాల తిరుపతి కార్యవర్గ సభ్యులు: భోగ శ్రీనివాస్, కల్లేపల్లి మల్లయ్య, కొక్కుల లక్ష్మీపతి, గందు రవీందర్, చర్లంచ ఎల్లయ్య తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ సహారా ఖాతాదారుల సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా పోరాడుతామని తెలిపారు.

ట్రాఫిక్ ఉల్లంఘనలపై కఠిన చర్యలు

పెద్దపల్లి డీసీపీ బి. రామ్ రెడ్డి: మైనర్ డ్రైవింగ్, ముగ్గురు ప్రయాణం, సిగ్నల్ ఉల్లంఘనలపై నిఘా

గోదావరిఖని క్రైమ్ : ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటూ రోడ్డు ప్రమాదాలను తగ్గించేలా సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగాలని పెద్దపల్లి డీసీపీ బి. రామ్ రెడ్డి సూచించారు. రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆదేశాల మేరకు గోదావరిఖని ఏసీపీ ఎం. రమేష్ ఆధ్వర్యంలో గోదావరిఖని 1 టౌన్ పోలీస్ స్టేషన్లో ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ నిర్వహణపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. గోదావరిఖని 1 టౌన్, 2 టౌన్, రామగుండం సర్కిల్, పెద్దపల్లి ప్రాంతాల్లో ప్రమాదాలకు కారణమవుతున్న బ్లాక్ స్పాట్లు, మలుపులు, కూడళ్లు, రద్దీ ప్రదేశాలను గుర్తించి అక్కడ తగిన భద్రతా చర్యలు చేపట్టాలని డీసీపీ అధికారులకు సూచించారు. సంబంధిత శాఖలతో కలిసి రంబుల్ స్టిక్స్, హెచ్చరిక బోర్డులు, ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేయడంతో పాటు భారీ వాహనాల అక్రమ పార్కింగ్‌ను నియంత్రించాలని ఆదేశించారు. వ్యతిరేక దిశలో వాహనాలు నడపడం, మైనర్లు వాహనాలు నడపడం, ముగ్గురు ప్రయాణించడం, సిగ్నల్ దాటడం వంటి ఉల్లంఘనలను అరికట్టేందుకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని తెలిపారు. ఆటోలు, పాఠశాల వ్యాన్లు, బస్సుల్లో నిబంధనలకు విరుద్ధంగా అధిక సంఖ్యలో విద్యార్థులను తరలించకుండా తనిఖీలు నిర్వహించాలని సూచించారు. రహదారులపై వాహనాల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించి, ప్రమాదకర ప్రాంతాల్లో వాహనదారులకు ముందుగానే సమాచారం అందేలా సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణతో పాటు ప్రజల ప్రాణ రక్షణకు పోలీస్ శాఖ, ఇతర సంబంధిత విభాగాలు సమన్వయంతో నిరంతర చర్యలు చేపట్టాలని డీసీపీ ఆదేశించారు. సమావేశంలో రామగుండం సీఐ కృష్ణ కుమార్, గోదావరిఖని 1 టౌన్ ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేన రెడ్డి, గోదావరిఖని 2 టౌన్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ రావు, రామగుండం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాజేశ్వర్ రావు, పెద్దపల్లి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

నూతన విద్యుత్ సబ్‌స్టేషన్లకు ప్రభుత్వ స్థలాలు కేటాయించండి

● ఇస్నాపూర్ నూతన పోలీస్ స్టేషన్‌కు రెండు ఎకరాలు కేటాయించాలని విజ్ఞప్తి ● కొల్లూరులో స్థానిక అవసరాలకే మిగులు భూమి వినియోగించాలని కోరిన ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి - ● జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌తో ఎమ్మెల్యే జిఎంఆర్ సమావేశం

సంగారెడ్డి జిల్లా: శరవేగంగా అభివృద్ధి చెందుతున్న పటాన్ చేరు నియోజకవర్గంలో భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతులను బలోపేతం చేసేందుకు ప్రభుత్వ స్థలాలను కేటాయించాలని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌ను పటాన్ చేరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి కోరారు. సోమవారం సాయంత్రం సంగారెడ్డిలోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌తో ఎమ్మెల్యే జిఎంఆర్ సమావేశమై నియోజకవర్గానికి సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చించారు. విద్యుత్ సబ్‌స్టేషన్లకు స్థలాల కేటాయింపు. నియోజకవర్గంలో వేగంగా జరుగుతున్న పట్టణీకరణ, రియల్ ఎస్టేట్ అభివృద్ధి నేపథ్యంలో విద్యుత్ డిమాండ్ కూడా పెరుగుతోందని ఎమ్మెల్యే తెలిపారు. ఘనాపూర్, ఈదుల నాగులపల్లి, కర్దనూరు చౌరస్తా, వెలిమల తండా ప్రాంతాల్లో 33/11 కేవీ నూతన విద్యుత్ సబ్‌స్టేషన్ల ఏర్పాటుకు ప్రభుత్వ స్థలాలను కేటాయించాలని కోరారు. స్థలాలు అందుబాటులోకి వస్తే విద్యుత్ శాఖ తరఫున పరిపాలనా అనుమతుల ప్రక్రియను ముందుకు తీసుకెళ్లేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. నూతన సబ్‌స్టేషన్ల ఏర్పాటుతో ఆయా ప్రాంతాల ప్రజలకు మెరుగైన, నాణ్యమైన విద్యుత్ సరఫరా అందుబాటులోకి వస్తుందని వివరించారు. ఇస్నాపూర్ పోలీస్ స్టేషన్‌కు రెండు ఎకరాలు. ఇస్నాపూర్ పరిధిలో నూతన పోలీస్ స్టేషన్ మంజూరైన నేపథ్యంలో శాశ్వత భవన నిర్మాణానికి సర్వే నంబర్ 496లో రెండు ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని కేటాయించాలని ఎమ్మెల్యే కోరారు. ప్రజలకు సులభంగా అందుబాటులో ఉండే ప్రాంతంలో స్థలం కేటాయించి, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా పోలీస్ స్టేషన్ భవనాన్ని నిర్మించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కొల్లూరు భూములు స్థానిక అవసరాలకే, తెల్లాపూర్ డివిజన్ పరిధిలోని కొల్లూరులో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కోసం కేటాయించిన భూమిని స్థానిక ప్రజల అవసరాలకు వినియోగించాలని ఎమ్మెల్యే కోరారు. సర్వే నంబర్ 203లో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణం కోసం కేటాయించిన 145 ఎకరాల్లో సుమారు 25 ఎకరాల భూమి నిరుపయోగంగా ఉన్నట్లు పేర్కొంటూ, ఆ భూమిని ఇతర అవసరాలకు కేటాయించే బదులు స్థానిక ప్రజల అవసరాలకు ఉపయోగించాలని కోరారు. ముఖ్యంగా కొల్లూరులో మోడల్ మార్కెట్ ఏర్పాటు, హిందూ--ముస్లిం--క్రైస్తవ స్మశాన వాటికలకు స్థలాల కేటాయింపు వంటి ప్రజా అవసరాలను దృష్టిలో ఉంచుకుని భూమిని వినియోగించాలని కలెక్టర్‌ను అభ్యర్థించారు. అర్హులైన జర్నలిస్టులకు స్థలాలు కేటాయించాలి, ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేస్తున్న అర్హులైన జర్నలిస్టుల సమస్యలను కూడా ఎమ్మెల్యే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. పటాన్ చేరు నియోజకవర్గ పరిధిలో అర్హులైన జర్నలిస్టులకు స్థలాల కేటాయింపుపై కూడా సానుకూలంగా పరిశీలించి చర్యలు తీసుకోవాలని కోరారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం కలెక్టర్ ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ప్రస్తావించిన అంశాలపై జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సానుకూలంగా స్పందించారు. సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుని ఆయా సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ఆసుపత్రుల్లో నాణ్యమైన వైద్య సేవలు అందించాలి: డీఎంహెచ్ఓ డా. వై. పవిత్ర

● కూనారం, శ్రీరాంపూర్ పీహెచ్‌సీలను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా వైద్యారోగ్య అధికారి ● సీజనల్ వ్యాధులపై సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశం

పెద్దపల్లి/కూనారం, అక్టోబర్ 5: ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ప్రజలకు నాణ్యమైన, మెరుగైన వైద్య సేవలు అందేలా సిబ్బంది తగిన చర్యలు తీసుకోవాలని పెద్దపల్లి జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి డా. వై. పవిత్ర సూచించారు. సోమవారం ఆమె పీఓ ఎంహెచ్ఎన్ డా. లక్ష్మీ భవానితో కలిసి కూనారం, శ్రీరాంపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆకస్మికంగా సందర్శించి, అక్కడ అందుతున్న వైద్య సేవలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని వార్డులు, ఫార్మసీ గదులను తనిఖీ చేసిన డీఎంహెచ్ఓ సిబ్బందికి పలు కీలక సూచనలు చేశారు. ప్రస్తుతం జ్వరాలు, సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ఆరోగ్య సిబ్బంది అంతా అత్యంత అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. జ్వరంతో పీహెచ్‌సీలకు వచ్చే ప్రతి రోగిని ఆలస్యం చేయకుండా సకాలంలో పరీక్షించి, అవసరమైన వైద్యాన్ని తక్షణమే అందించాలన్నారు. డెంగ్యూ, మలేరియా తదితర సీజనల్ వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గ్రామీణ ప్రాంత ప్రజలకు క్షేత్రస్థాయిలో విస్తృతంగా అవగాహన కల్పించాలని స్పష్టం చేశారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, వారికి అవసరమైన అన్ని రకాల మందులను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంచేలా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. ఆసుపత్రి పరిసరాలు, వార్డులు, ఇతర ప్రాంతాల్లో ప్రతి 15 రోజులకు ఒకసారి ఫ్యూమిగేషన్ నిర్వహించి పారిశుధ్యాన్ని మెరుగ్గా నిర్వహించాలని సూచించారు. అదేవిధంగా అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయడం, రికార్డులను సక్రమంగా నిర్వహించడం, సిబ్బంది హాజరును పర్యవేక్షించడం, పారిశుధ్యాన్ని కాపాడటంతో పాటు రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని డా. పవిత్ర సిబ్బందిని ఆదేశించారు. ప్రజారోగ్యం విషయంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆయా పీహెచ్‌సీల వైద్యాధికారులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలను కోటీశ్వరులను చేయడమే ప్రభుత్వ లక్ష్యం

● ప్రభుత్వ విప్ చింతకుంట విజయరమణారావు ● పెద్దపల్లి జిల్లా కేంద్రంలో రూ.5 కోట్లతో 'ఇందిరా మహిళా శక్తి భవనం' సిద్ధం ● భూపతిపూర్‌లో 'చైతన్య జ్యోతి' పెట్రోల్ పంపు ప్రారంభాన్ని గుర్తుచేసిన ఎమ్మెల్యే ● మహిళా సంఘాలకు రూ.6.94 కోట్ల బ్యాంక్ లింకేజీ రుణాలు, ఇందిరమ్మ చీరల పంపిణీ

సుల్తానాబాద్, అక్టోబర్ 05: మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసి వారిని కోటీశ్వరులను చేయాలనే మహోన్నత లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం పలు విప్లవాత్మక కార్యక్రమాలను అమలు చేస్తోందని రాష్ట్ర ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. సుల్తానాబాద్ పట్టణంలోని యశోద నరహరి ఫంక్షన్‌హాల్‌లో సోమవారం నిర్వహించిన 'ఇందిరా మహిళా శక్తి' కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళా సంఘాలకు రూ. 6.94 కోట్ల బ్యాంకు లింకేజీ రుణాల మెగా చెక్కును అందజేయడంతో పాటు, మహిళల ఆత్మగౌరవానికి ప్రతీకగా నాణ్యమైన ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ప్రభుత్వ విప్ విజయరమణారావు మాట్లాడుతూ.. మహిళలు కేవలం గృహిణులుగానే కాకుండా వ్యాపారవేత్తలుగా ఎదగాలన్నదే ప్రభుత్వ సంకల్పమని పేర్కొన్నారు. ఇందులో భాగంగానే మహిళా సంఘాలకు పెట్రోల్ బంకులు, ఇందిరమ్మ బస్సులు, ఇందిరా మహిళా క్యాంటీన్ల ఏర్పాటు ద్వారా విస్తృతంగా స్వయం ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని స్పష్టం చేశారు. ఇటీవల భూపతిపూర్‌లో మహిళా స్వశక్తి సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'చైతన్య జ్యోతి' పెట్రోల్ పంపును విజయవంతంగా ప్రారంభించినట్లు ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. రూ.5 కోట్లతో ఇందిరా మహిళా శక్తి భవనం: మహిళా సంఘాల సౌకర్యార్థం పెద్దపల్లి జిల్లా కేంద్రంలో రూ. 5 కోట్ల భారీ వ్యయంతో నిర్మించిన 'ఇందిరా మహిళా శక్తి భవనం' పూర్తి అయిందని, ఇది త్వరలోనే ప్రారంభానికి సిద్ధంగా ఉందని ఎమ్మెల్యే వెల్లడించారు. విద్యారంగానికి పెద్దపీట: మహిళా సాధికారతతో పాటు విద్యారంగ సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని ఆయన అన్నారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీలలో చదివే ఇంటర్మీడియట్ విద్యార్థుల కోసం కూడా మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తున్నామని, పేద విద్యార్థులు ఆకలితో అలమటించకుండా ఉన్నత చదువులు చదువుకోవాలనేదే దీని ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ ఆర్థిక తోడ్పాటును, ఉపాధి అవకాశాలను మహిళలు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా మరింత పైకి ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ మహిళా సంఘాల ప్రతినిధులు, అధికారులు , పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

కాక గడ్డం వెంకటస్వామి సేవలు చిరస్మరణీయం

● కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మద్దుల గోపాల్ రెడ్డి.. ● పేదల పక్షపాతి గడ్డం వెంకటస్వామి ఆశయాలను కొనసాగిద్దాం.. ● గోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా కాక వెంకటస్వామి జయంతి వేడుకలు...

ఎండపల్లి, అక్టోబర్05(: కాంగ్రెస్ పార్టీ దివంగత సీనియర్ నాయకులు, పేదల పక్షపాతి గడ్డం వెంకటస్వామి (కాక) 97వ జయంతి వేడుకలను సోమవారం జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలంలోని రాజారంపల్లి గ్రామంలోని మినీ క్యాంపు కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మద్దుల గోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మద్దుల గోపాల్ రెడ్డి గారు మాట్లాడుతూ..గడ్డం వెంకటస్వామి 1929లో జన్మించి 1957 నుంచి 2009 వరకు ప్రజా జీవితంలో కొనసాగుతూ రెండుసార్లు అసెంబ్లీ సభ్యులుగా, ఒకసారి రాష్ట్ర కార్మిక, పౌర సరఫరాల శాఖ మంత్రిగా, ఏడుసార్లు పార్లమెంట్ సభ్యులుగా రాష్ట్రానికి విశేష సేవలందించారని గుర్తు చేశారు. ఇందిరాగాంధీ ప్రభుత్వంలో సప్లై, పునరావాస శాఖ డిప్యూటీ మంత్రిగా, పీవీ నరసింహారావు ప్రభుత్వంలో జౌళి, గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రిగా, అనంతరం టెక్స్టైల్స్, కార్మిక శాఖల మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారని తెలిపారు. పేదలకు పెద్ద ఎత్తున ఇందిరమ్మ ఇళ్లు అందించడంతో పాటు, పేద ప్రజలతో అత్యంత సన్నిహితంగా ఉంటూ వారికి అన్ని విధాలా అండగా నిలిచారని, నిష్పక్షపాతంగా వ్యవహరించిన మహోన్నత నాయకుడని కొనియాడారు. అందుకే నియోజకవర్గ ప్రజలు ప్రేమతో ఆయనను గుడిసెల వెంకటస్వామి గా పిలుచుకునేవారని తెలిపారు. వెంకటస్వామి వారసులు కూడా ఆయన సేవా స్ఫూర్తి, ఆదర్శాలను పుణికిపుచ్చుకుని విశాఖ ట్రస్టు స్థాపించి, దాని ద్వారా అనేక సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని మద్దుల గోపాల్ రెడ్డి పేర్కొన్నారు. వెంకటస్వామి ఆశయాలను ముందుకు తీసుకెళ్లడం ప్రతి కాంగ్రెస్ కార్యకర్త బాధ్యత అని అన్నారు.ఈ కార్యక్రమంలో పాక్స్ చైర్మన్ గూడ రాంరెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గెల్లు చంద్రశేఖర్, మండల ప్రధాన కార్యదర్శి కందికట్ల రాజేష్, సర్పంచుల ఫోరం అధ్యక్షులు సంగ రమేష్,సర్పంచ్ లు బాలసాని శారద మల్లేశం, పడిదం లావణ్య మొగిలి, కొంగల జగదీశ్వర్ రెడ్డి, కోడిపెల్లి కొమురమ్మ శ్రీనివాస్, మంతెన నర్సయ్య, దేవి రవీందర్,ఏలేటి చంద్రారెడ్డి, బురగడ్డ శ్రీనివాస్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ

మేడ్చల్ : కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నాయని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. సోమవారం డాక్టర్ ఏఎస్‌రావునగర్ డివిజన్ పరిధిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కాప్రా మండలానికి చెందిన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి 9 మంది లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద కుటుంబాలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. చెక్కుల పంపిణీ ప్రక్రియలో పారదర్శకత పాటించాలని సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించిన విధంగా కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల కింద రూ.1,00,116 ఆర్థిక సాయంతో పాటు తులం బంగారం అందించే అంశాన్ని ఎమ్మెల్యే ప్రస్తావించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై అర్హులైన ప్రజలకు అవగాహన కల్పించి, దరఖాస్తు ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు సహకరించాలని కోరారు. లబ్ధిదారులకు నేరుగా ప్రయోజనం అందేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. చెక్కులు అందుకున్న లబ్ధిదారులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాప్రా మండల తహసీల్దార్ ఎస్.ఏ. మతీన్, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అధికారులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలు

రామగిరి,అక్టోబర్ 05: కమాన్ పూర్ మండలం గుండారం గ్రామం వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. పెద్దపల్లి- మంథని ప్రధాన రహదారి గుండారం వద్ద రెండు వాహనాలు ఎదురెదురుగా ఢీకొట్టుకున్నాయి. పెద్దపల్లి నుండి రామగిరి మండలం నాగేపల్లి గ్రామానికి చెందిన తాటి శ్రీనివాస్ గౌడ్ కు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే సమాచారం అందుకున్న 108 పైలట్ రాజు ఈఎంటి డి సుమన్ పెద్దపల్లి ఆసుపత్రికి తరలించారు. సంఘటన స్థలానికి కమాన్ పూర్ ఎస్సై కొట్టే ప్రసాద్ వెళ్లి సంఘటన వివరాలను సేకరించారు. అలాగే అక్కడి పరిస్థితిని పరిశీలించారు.

ఆల్ ఇండియా స్పోర్ట్స్ ఛాంపియన్‌షిప్‌లో గీతాంజలి విద్యార్థుల ప్రతిభ

రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి : వైఎస్‌డీఏ ఆధ్వర్యంలో నిర్వహించిన 2026 ఆల్ ఇండియా స్పోర్ట్స్ ఛాంపియన్‌షిప్‌లో కొండాపూర్‌లోని గీతాంజలి ది గ్లోబల్ స్కూల్ విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయిలో సత్తా చాటారు. తెలంగాణ జట్లు ఖో-ఖో, క్రికెట్ విభాగాల్లో ప్రథమ స్థానాన్ని, బ్యాడ్మింటన్‌లో ద్వితీయ స్థానాన్ని సాధించి రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచాయి. ఈ జాతీయ స్థాయి పోటీల్లో గీతాంజలి ది గ్లోబల్ స్కూల్‌కు చెందిన జగదీశ్వర్, హేమంత్, జతిన్, రిత్విక్, శౌర్య, సాత్విక్, అనిరుధ్, రుషికేష్, అక్షర, అరుషి, యోకల్య తెలంగాణ జట్లకు ప్రాతినిధ్యం వహించారు. పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జట్ల విజయాల్లో కీలకంగా నిలిచారు. విద్యార్థుల విజయాల వెనుక కోచ్‌లు మురళి, శ్రీనివాస్ అందించిన శిక్షణ, మార్గదర్శకత్వం కీలకంగా నిలిచింది. విద్యార్థుల్లోని క్రీడా ప్రతిభను గుర్తించి నిరంతరం ప్రోత్సహిస్తూ జాతీయ స్థాయికి తీసుకెళ్లిన కోచ్‌ల కృషిని పాఠశాల యాజమాన్యం అభినందించింది. 2026లో జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో విద్యార్థులు సాధించిన విజయాలు గీతాంజలి ది గ్లోబల్ స్కూల్ క్రీడా ప్రస్థానంలో మరో మైలురాయిగా నిలిచాయి. ఈ సందర్భంగా విజేత విద్యార్థులు, కోచ్‌లను పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించి, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటు కోసం నవంబర్ 6లోపు నమోదు చేసుకోవాలి: ఆరేకపూడి గాంధీ

రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి : హైదరాబాద్--రంగారెడ్డి--మహబూబ్‌నగర్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో అర్హత కలిగిన ప్రతి గ్రాడ్యుయేట్ తప్పనిసరిగా తమ ఓటును నమోదు చేసుకోవాలని పీఏసీ చైర్మన్ ఆరేకపూడి గాంధీ సోమవారం పిలుపునిచ్చారు. గ్రాడ్యుయేట్ ఓటరుగా నమోదు చేసుకునేందుకు ఫారం--18 ద్వారా 2026 నవంబర్ 6లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా గాంధీ స్వయంగా ఫారం--18ను నింపి గ్రాడ్యుయేట్ ఓటరుగా నమోదు చేసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాబోయే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోవాలనుకునే అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ గడువులోగా తమ పేరును ఓటర్ల జాబితాలో నమోదు చేసుకోవాలని కోరారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ల జాబితాను ప్రతి ఎన్నికకు ముందు కొత్తగా రూపొందిస్తారని తెలిపారు. గతంలో గ్రాడ్యుయేట్ ఓటరుగా నమోదై ఉన్నవారు కూడా ప్రస్తుత ఎన్నిక కోసం మళ్లీ ఫారం--18 సమర్పించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. సాధారణ అసెంబ్లీ ఓటర్ల జాబితాలో పేరు ఉన్నంత మాత్రాన గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు లభించదని, ఇందుకోసం ప్రత్యేకంగా ఫారం--18 ద్వారా నమోదు చేసుకోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు. అర్హత కలిగిన గ్రాడ్యుయేట్లు ఫారం--18లో తమ అసెంబ్లీ ఈపీఐసీ నంబర్, ఓటరు వివరాలను నమోదు చేసుకోవచ్చని, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటు కోసం ప్రత్యేకంగా మరో ఈపీఐసీ నంబర్ అవసరం లేదని గాంధీ తెలిపారు. గడువు ముగిసేలోపు అర్హులైన ప్రతి గ్రాడ్యుయేట్ నమోదు ప్రక్రియ పూర్తి చేసుకుని తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

స్పోర్ట్స్

ప్రయోగాలు చేయడానికి ఎక్కువ సమయం లేదు

వరల్డ్ కప్ టీమ్ పై తేల్చేసిన శుబ్ మాన్ గిల్..!

వచ్చే ఏడాది భారత్ వేదికగా జరిగే వన్డే క్రికెట్ వరల్డ్ కప్ పై టీమిండియా కెప్టెన్ శుభ్ మన్ గిల్ కీలక వ్యాఖ్యలు చేశాడు. నిన్న వెస్టిండీస్ తో జరిగిన మూడో వన్డేలో భారత్ ఓటమి పాలైన నేపథ్యంలో గిల్.. వచ్చే వరల్డ్ కప్ లో జట్టు కూర్పుపై ఈ వ్యాఖ్యలు చేశాడు. వరల్డ్ కప్ కోసం టీమ్ లో ప్రయోగాలు చేయడానికి ఎక్కువ సమయం లేదని, త్వరగా కుదురుకోవాల్సి ఉందని జట్టులో ఆటగాళ్లను ఉద్దేశించి వ్యాఖ్యానించాడు. వెస్టిండీస్ తో తొలి రెండు వన్డేలు ఆడిన జట్టులో పలు మార్పులు చేసి మూడో వన్డేలో బరిలోకి దిగి జట్టు ఓటమి పాలైన నేపథ్యంలో గిల్ వ్యాఖ్యలకు ప్రాధాన్యం ఏర్పడింది. ముఖ్యంగా తర్వాతి సిరీస్ నుండే ప్రపంచ కప్‌లో ఆడబోయే జట్టు కూర్పుతో బరిలోకి దిగాలని గిల్ భావిస్తున్నాడు. డిసెంబర్ 2019 తర్వాత స్వదేశంలో వెస్టిండీస్ చేతిలో భారత్ తన మొదటి వన్డే ఓటమిని చవిచూడటంతో ఇకపై ప్రయోగాల జోలికి వెళ్లకుండా వరల్డ్ కప్ ఆడే జట్టుతోనే బరిలోకి దిగాలని గిల్ ప్లాన్ చేస్తున్నాడు. వెస్టిండీస్ తో తొలి రెండు వన్డేలు ఆడిన జట్టులో పలు మార్పులు చేసి మూడో వన్డేలో బరిలోకి దిగి జట్టు ఓటమి పాలైన నేపథ్యంలో గిల్ వ్యాఖ్యలకు ప్రాధాన్యం ఏర్పడింది. ముఖ్యంగా తర్వాతి సిరీస్ నుండే ప్రపంచ కప్‌లో ఆడబోయే జట్టు కూర్పుతో బరిలోకి దిగాలని గిల్ భావిస్తున్నాడు. డిసెంబర్ 2019 తర్వాత స్వదేశంలో వెస్టిండీస్ చేతిలో భారత్ తన మొదటి వన్డే ఓటమిని చవిచూడటంతో ఇకపై

ప్రయోగాల జోలికి వెళ్లకుండా వరల్డ్ కప్ ఆడే జట్టుతోనే బరిలోకి దిగాలని గిల్ ప్లాన్ చేస్తున్నాడు. విండీస్ తో సిరీస్ గెల్చుకున్నా, మూడో వన్డేలో ఓటమి తర్వాత గిల్ కీలక వ్యాఖ్యలు చేశాడు. నిజాయితీగా చెప్పాలంటే, ప్రయోగాలు చేయడానికి అంత సమయం లేదన్నాడు. తాము ఆడాలనుకుంటున్న జట్టు కూర్పుతోనే బరిలోకి దిగాలని అనుకుంటున్నట్లు వెల్లడించాడు. తదుపరి సిరీస్ నాటికి తమకు కావాల్సిన ఆటగాళ్లందరూ అందుబాటులోకి వస్తారని ఆశిస్తున్నానని గిల్ తెలిపాడు. ప్రపంచ కప్‌లో తాము ఏ కూర్పుతో ఆడాలనుకుంటున్నామో, ఆ కూర్పుతోనే ఆడటం ప్రారంభించాలనుకుంటున్నామని తేల్చిచెప్పేశాడు. వాస్తవానికి విండీస్ తో సిరీస్ జరుగుతున్న సమయంలోనే 2026 ఆసియా క్రీడలు కూడా జరగడంతో, ఆ జట్టులో సభ్యుడిగా ఉన్న టీమిండియా ప్రధాన పేసర్ జస్ప్రీత్ బుమ్రా ఈ సిరీస్‌కు దూరమయ్యాడు. అలాగే గాయం కారణంగా హార్దిక్ పాండ్యా కూడా జట్టుకు అందుబాటులో లేడు. వివిధ కారణాల వల్ల ఆటగాళ్లు జట్టుకు దూరమవ్వడం నిరాశ కలిగించే విషయమని గిల్ అభిప్రాయపడ్డాడు. దీంతో రాబోయే సిరీస్ లకు బుమ్రా, హార్దిక్ లను జట్టులోకి తీసుకుని ఆడించేందుకు గిల్ సిద్ధమవుతున్నాడు.

మరో సిరీస్ నుంచి హార్దిక్ పాండ్యా అవుట్

ఆస్ట్రేలియా ఎ జట్టుతో పుదుచ్చేరి వేదికగా జరిగే మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్ కోసం భారత ఎ జట్టులో కీలక మార్పు చోటుచేసుకుంది. టీమిండియా స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా తాజా గాయం కారణంగా ఈ సిరీస్ మొత్తానికి దూరం అయ్యాడు. అతని స్థానంలో ముంబైకి చెందిన సూర్యాంశ్ షెడ్గె ఎంపికయ్యాడు. ఈ నెల 6, 9, 11 తేదీల్లో టీమిండియా ఏ- ఆస్ట్రేలియా ఏ జట్ల మధ్య ఈ మ్యాచ్ లు జరుగనున్నాయి. తన సత్తా నిరూపించుకోవడానికి షెడ్గెకు సువర్ణావకాశాన్ని లభించినట్టయింది. హార్దిక్ పాండ్యాను వరుస గాయాల బెడద వదలట్లేదు. బెంగళూరు నేషనల్ క్రికెట్ అకాడమీలో ఫిట్‌నెస్ టెస్ట్ సందర్భంగా అతని కుడి పిక్క భాగంలో తీవ్ర అసౌకర్యం తలెత్తింది. అనంతరం నిర్వహించిన ఎంఆర్ఐ స్కానింగ్‌లో అతనికి మైల్డ్ ఇంట్రామెడుల్లరీ ఎడెమా సమస్య ఉన్నట్లు డాక్టర్లు గుర్తించారు. ఫలితంగా.. రాబోయే న్యూజిలాండ్ పర్యటనకు సైతం అతను ఎంపిక కావడం అనుమానమే. ఈ సిరీస్ కంటే ముందే పూర్తి ఫిట్‌నెస్ సాధించి జాతీయ జట్టులోకి తిరిగి రావాలనే పాండ్యా సుదీర్ఘ నిరీక్షణకు మళ్లీ గట్టి ఎదురుదెబ్బ తగిలింది. హార్దిక్ పాండ్యాతో పాటు హర్షిత్ రాణా కూడా ఇప్పట్లో కోలుకోవడం కష్టంగానే కనిపిస్తోంది. గాయం కారణంగా సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ లో రిహాబిలిటేషన్ లో ఉంటోన్నాడీ ఫాస్ట్ బౌలర్. దీనివల్ల ఇప్పటికే ఆఫ్ఘనిస్తాన్, వెస్టిండీస్ సిరీస్ లను చేజార్చుకోవాల్సి వచ్చింది. ఆసియా గేమ్స్ కూ దూరం అయ్యాడు. ప్రస్తుతం అతని ఫిట్ నెస్ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుంటే న్యూజిలాండ్ పర్యటనకు కూడా అందుబాటులో ఉండకపోవచ్చని చెబుతున్నారు.అటు షెడ్గె కూడా కొంతకాలం పాటు గాయాలతో సతమతం అయ్యాడు. కండరాల నొప్పితో ఇబ్బంది పడ్డాడు. దేశవాళీ టోర్నీలకు దూరం అయ్యాడు. బెంగళూరులో బీసీసీఐకి చెందిన సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ లో రిహాబిలిటేషన్ లో గడిపాడు. తాజాగా అతను పూర్తి ఫిట్ నెస్ సాధించడంతో బీసీసీఐ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. తుది పరీక్షల అనంతరం పూర్తి ఫిట్‌నెస్ సాధించినట్లు నిర్ధారణ కావడంతో నేరుగా పుదుచ్చేరిలో ఉన్న భారత-ఎ తో చేరాడు. ఈ ఏడాది ఐర్లాండ్, ఇంగ్లాండ్, జింబాబ్వే పర్యటనల్లో భారత్ తరఫున మూడు అంతర్జాతీయ టీ20 మ్యాచ్‌లు ఆడాడు సూర్యాంశ్. సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో ముంబై చాంపియన్‌గా నిలవడంలో కీలక పాత్ర పోషించాడు. శ్రీలంకలో జరిగిన ముక్కోణపు సిరీస్‌లోనూ భారత్ 'ఎ' తరఫున అత్యుత్తమ ప్రదర్శన కనబరిచాడీ ఆల్ రౌండర్. అక్కడ మిడిల్ ఆర్డర్‌లో బ్యాటింగ్‌కు దిగి అయిదు మ్యాచ్‌ల్లో 147 పరుగులు చేశాడు. హార్దిక్ పాండ్యా తరహాలోనే బ్యాటింగ్, బౌలింగ్ రెండింట్లోనూ రాణించే సత్తా అతనికి ఉంది.

వైభవ్‌ను స్టార్‌గా తీర్చిదిద్దుతున్న టీమిండియా

టీమిండియాలోకి వచ్చిన యువ ఓపెనర్ వైభవ్ సూర్యవంశీని పెద్ద ఆటగాడిగా తీర్చిదిద్దేందుకు జట్టు మేనేజ్‌మెంట్ ప్రత్యేక దృష్టి పెడుతోంది. సీనియర్ ఆటగాళ్ల మధ్య ఉండటం, వాళ్లను గమనించడం, ప్రశ్నలు అడగడం ద్వారా 15 ఏళ్ల వైభవ్ ఎంతో నేర్చుకోగలడని భారత బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్ చెప్పాడు. వెస్టిండీస్‌తో మంగళవారం ప్రారంభమయ్యే ఐదు టీ20ల సిరీస్‌కు ముందు అతను ఈ వ్యాఖ్యలు చేశారు. వైభవ్‌కు తుది జట్టులో అవకాశం వచ్చినా.. రాకపోయినా అతడి ఎదుగుదల ఆగదని మోర్కెల్ అన్నారు. మ్యాచ్ ఆడకపోయినా డ్రెస్సింగ్ రూమ్‌లో సీనియర్ ఆటగాళ్లతో గడపడం, వాళ్లు ప్రాక్టీస్‌కు ఎలా సిద్ధమవుతున్నారు? ఇన్నింగ్స్‌ను ఎలా ప్లాన్ చేస్తున్నారు? పరిస్థితులకు తగ్గట్టుగా ఎలా స్పందిస్తున్నారు? అన్నది గమనించడం ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. "ప్రాక్టీస్‌లో ఈ ఆటగాడు ఏం చేస్తున్నాడో చూడు. అతడు తొలి 15 బంతులను ఎలా ఎదుర్కొంటున్నాడు? పిచ్ నుంచి సహకారం లభిస్తే ఎలా ప్లాన్ చేస్తున్నాడు? అని యువ ఆటగాళ్లను ఆలోచించేలా చేస్తాను" అని మోర్కెల్ తెలిపాడు. ప్రతి ప్రాక్టీస్ సెషన్ తర్వాత వైభవ్ ఏం నేర్చుకున్నాడో అడుగుతానని చెప్పాడు. "నేను ఫాస్ట్ బౌలర్‌ను. బ్యాటింగ్ గురించి ఎక్కువగా చెప్పలేను. కానీ బస్సులో అతడిని 'ఈ రోజు ఏం నేర్చుకున్నావు? ఆ ఆటగాడి బ్యాటింగ్‌లో ఏం గమనించావు?' అని అడుగుతాను. ఇలా అడగడం వల్ల అతడు ఆలోచిస్తాడు. తర్వాత నెట్స్‌లోకి వచ్చినప్పుడు ఆ విషయాలను గమనించి తన ఆటకు తగ్గట్టుగా మార్చుకుంటాడు" అని వివరించాడు. ఇక భారత్-వెస్టిండీస్ టీ20 సిరీస్ తొలి మ్యాచ్ లక్నోలోని ఏకానా స్టేడియంలో జరగనుంది. ఆసియా క్రీడల నుంచి తిరిగొచ్చిన ఆటగాళ్ల ఫిట్‌నెస్, ప్రయాణ అలసటను పరిశీలించిన తర్వాత తుది జట్టును ఎంపిక చేస్తామని మోర్కెల్ తెలిపాడు. గాయంతో కొంతకాలం దూరమైన మయాంక్ యాదవ్ తిరిగి జట్టులోకి రావడం కూడా భారత్‌కు కీలకమేనన్నారు. అతడి వేగం ప్రత్యేక ఆయుధమని చెప్పాడు. నెట్ బౌలర్‌గా మొదలై ఇప్పుడు భారత్ తరఫున ఆడే స్థాయికి చేరుకున్న ప్రిన్స్ యాదవ్ కష్టపడిన తీరును మోర్కెల్ ప్రశంసించాడు.

భారత కెప్టెన్‌గా భువనేశ్వర్ కుమార్

హాంకాంగ్ సిక్సెస్ టోర్నీకి సిద్ధమైన టీమిండియా

హాంకాంగ్ సిక్సెస్ టోర్నీ ఆడేందుకు టీమిండియా సిద్ధమైంది. భువనేశ్వర్ కుమార్ సారథ్యంలోని భారత జట్టును బీసీసీఐ ప్రకటించింది. భువనేశ్వర్ కుమార్‌తో పాటు కృనాల్ పాండ్యా, నితీష్ రాణా, శశాంక్ సింగ్, టీ నటరాజన్, రాహుల్ తెవాటియా, రాహుల్ త్రిపాఠి ఈ జట్టులో ఉన్నారు. న్యూజిలాండ్‌తో 2022లో చివరి టీ20 మ్యాచ్ ఆడిన భువనేశ్వర్ కుమార్.. మళ్లీ భారత్ తరఫున ఆడలేదు. ఇన్నాళ్లకు ఐసీసీ ఆమోదం ఉన్న హాంకాంగ్ సిక్సెస్ టోర్నీలో భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. అక్టోబర్ 30 నుంచి నవంబర్ 1 వరకు ఈ టోర్నీ జరగనుంది.ఐసీసీ ఆమోదంతో క్రికెట్ హాంగ్ కాంగ్ ప్రతీ ఏడాది ఈ భిన్నమైన టోర్నీని నిర్వహిస్తుంది. ఈ టోర్నీ ఫార్మాట్, నిబంధనలు.. ఐసీసీ రూల్స్‌కు భిన్నంగా ఉంటాయి. ఈ టోర్నీలో ప్రతీ జట్టులో ఆరుగురు ఆటగాళ్లు మాత్రమే ఉంటారు. బౌలర్, కీపర్ మినహాయించి మైదానంలో నలుగురు ఫీల్డర్లు మాత్రమే ఉంటారు. దాంతో బ్యాటర్లకు పరుగులు చేయడం సులువవుతోంది. ప్రతీ మ్యాచ్ 6 ఓవర్ల చొప్పున జరుగుతుంది. ఒక మ్యాచ్ సగటున 45 నిమిషాల్లోనే పూర్తవుతుంది. వికెట్ కీపర్ మినహా జట్టులోని ఐదుగురు ఆటగాళ్లు తప్పనిసరిగా బౌలింగ్ చేయాలి. ఒక బౌలర్ గరిష్టంగా 2 ఓవర్లు వేయవచ్చు. కానీ వరుసగా వేయడానికి లేదు. మిగిలిన నలుగురు ఆటగాళ్లు తప్పనిసరిగా ఒక్కో ఓవర్ వేయాలి. ఈ ఫార్మాట్ ఆల్‌రౌండర్లకు బాగా కలిసొస్తుంది. ఏ బ్యాటర్ అయినా వ్యక్తిగతంగా 50 పరుగులు పూర్తి చేయగానే నాటౌట్‌గా రిటైర్ కావాలి. ఒకవేళ జట్టులోని 5 వికెట్లు పడిపోతే, నాటౌట్‌గా మిగిలిన చివరి బ్యాటర్ ఒంటరిగానే బ్యాటింగ్ కొనసాగించవచ్చు. అయితే అతనితో పాటు రన్నింగ్ చేయడానికి నాన్-స్ట్రైకర్ ఎండ్‌లో ఒక రన్నర్ (ఔటైన ఆటగాడు) ఉంటాడు.జట్టు ఇన్నింగ్స్ ముగిసే సమయానికి ఓవర్లు మిగిలి ఉండి, చివరి వికెట్ పడిపోతే, అంతకుముందు 50 పరుగులు చేసి రిటైర్ అయిన బ్యాటర్ మళ్లీ క్రీజ్‌లోకి రావచ్చు. ప్రతి వైడ్ లేదా నో బాల్‌కి ప్రత్యర్థి జట్టుకు 2 పరుగులు అదనంగా ఇస్తారు. సాధారణంగా ఫైనల్ మ్యాచుల్లో మాత్రమే 5 ఓవర్లకు బదులుగా 8 ఓవర్లు లేదా ప్రత్యేక వైవిధ్యమైన రూల్స్ ఉపయోగిస్తుంటారు. ఈ టోర్నీలో భారత్, పాకిస్థాన్, ఆస్ట్రేలియా, ఇంగ్లండ్‌తో సహా మొత్తం 12 జట్లు పోటీపడుతాయి. ఈ 12 జట్లను 4 గ్రూప్‌లుగా ్రాశీశ్రీ్రూ, దీ, జ, ఐ విభజించారు. గ్రూప్ దశలో టాప్ స్థానాల్లో నిలిచే జట్లు నాకౌట్‌కు అర్హత సాధిస్తాయి. హాంకాంగ్ సిక్స్ సిరీస్ కోసం భారత జట్టు: భువనేశ్వర్ కుమార్, కృనాల్ పాండ్యా, శశాంక్ సింగ్, రాహుల్ ద్వివేది, నితీష్ రాణా, రాహుల్ త్రిపాఠి, డి నటరాజన్.

షాయ్ హోప్ సరికొత్త రికార్డు

ఇండియా, వెస్టిండీస్ మధ్య జరిగిన వన్డే సిరీస్ పరుగుల ప్రవాహంతో క్రికెట్ అభిమానులకు భారీ వినోదాన్ని అందించింది. మూడు మ్యాచ్‌ల ఈ సిరీస్‌లో ఇరు జట్ల బ్యాటర్లు ఏకంగా 10 సెంచరీలు బాది రికార్డు సృష్టించారు. కరీబియన్ కెప్టెన్ షాయ్ హోప్ రెండు సెంచరీలు బాది ప్రస్తుతం ఆడుతున్న క్రికెటర్ల జాబితాలో ఇంగ్లాండ్ స్టార్ జో రూట్‌ను అధిగమించాడు. అయితే వన్డే క్రికెట్‌లో అత్యధిక సెంచరీలు చేసిన యాక్టివ్ ప్లేయర్లలో భారత దిగ్గజాలు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ మొదటి రెండు స్థానాల్లో తిరుగులేని ఆధిక్యంలో కొనసాగుతున్నారు. ఈ సిరీస్‌లో కరీబియన్ కెప్టెన్ షాయ్ హోప్ అద్భుతమైన ఫామ్‌ను కనబరిచాడు. వరుసగా రెండు సెంచరీలు బాదడంతో వన్డేల్లో అతని శతకాల సంఖ్య 21కి చేరింది. కేవలం 152 ఇన్నింగ్స్‌ల్లోనే హోప్ ఈ మార్కును అందుకున్నాడు. దీనితో 184 ఇన్నింగ్స్‌ల్లో 20 సెంచరీలు చేసిన జో రూట్‌ను వెనక్కి నెట్టి హోప్ నాల్గో స్థానానికి చేరుకున్నాడు. విండీస్ జట్టుకు హోప్ సాధించిన ఈ ఘనత కొండంత కొండంత బలాన్నిచ్చింది.వన్డే ఫార్మాట్‌లో విరాట్ కోహ్లీకి ఎవరు పోటీ రాలేరని మరోసారి రుజువైంది. తిరువనంతపురం వన్డేలో 139 పరుగుల ధనాధన్ ఇన్నింగ్స్‌తో కోహ్లీ తన వన్డే కెరీర్‌లో 55వ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. ప్రపంచంలో వన్డేల్లో అత్యధిక సెంచరీలు చేసిన ప్లేయర్‌గా తన రికార్డును మరింత పటిష్టం చేసుకున్నాడు. అంతర్జాతీయ క్రికెట్ మొత్తంలో 86 సెంచరీలు పూర్తి చేసుకున్న కోహ్లీ, సచిన్ టెండూల్కర్ సెంచరీల సెంచరీ రికార్డుకు కేవలం 14 సెంచరీల దూరంలో ఉన్నాడు. 2027 ప్రపంచకప్ వరకు ఆడే యోచనలో ఉన్న కోహ్లీ ఈ మైలురాయిని సులభంగా దాటేలా కనిపిస్తున్నాడు.

డబ్ల్యూసీఎల్ నుంచి పాక్ జట్టు ఔట్!

పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత పాకిస్థాన్‌తో ఆడేందుకు నిరాకరించిన భారత మాజీ క్రికెటర్ల నిర్ణయంపై ఇప్పుడు మరోసారి చర్చ మొదలైంది. గత సీజన్‌లో పాక్‌తో మ్యాచ్ ఆడకుండా భారత్ తీసుకున్న నిర్ణయంపై క్షమాపణ చెప్పాలని పాకిస్థాన్ ఇప్పుడు డిమాండ్ చేసినట్లు సన్నిహిత వర్గాలను ఉటంకిస్తూ ఎన్‌డీటీవీ కథనం పేర్కొంది. ఎన్డీటీవీ కథనం ప్రకారం... ఈ డిమాండ్‌ను 'వరల్డ్ ఛాంపియన్‌షిప్ ఆఫ్ లెజెండ్స్' (డబ్ల్యూసీఎల్) నిర్వాహకులు తిరస్కరించడంతో పాకిస్థాన్ ఛాంపియన్స్ ప్రస్తుత టోర్నీ నుంచి వైదొలిగింది. పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత భారత్-పాక్ మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న సమయంలో.. భారత జట్టు పాక్‌తో మ్యాచ్ ఆడేందుకు నిరాకరించింది. ప్రజాభిప్రాయాన్ని దృష్టిలో పెట్టుకొని తీసుకున్న ఈ నిర్ణయంలో భారత్ వెనక్కి తగ్గలేదు. దీంతో గత సీజన్‌లో ఇరు జట్ల మధ్య జరగాల్సిన గ్రూప్ మ్యాచ్ రద్దయింది. సెమీఫైనల్లోనూ భారత్ ఇదే వైఖరిని కొనసాగించింది. పాక్‌తో ఆడేందుకు భారత ఆటగాళ్లు మైదానంలోకి దిగకపోవడంతో పాకిస్థాన్ వాకోవర్‌తో ఫైనల్‌కు చేరింది. భారత జట్టులో యువరాజ్ సింగ్, సురేశ్ రైనా, హర్భజన్ సింగ్, పీయూష్ చావ్లా, యూసుఫ్ పఠాన్, రాబిన్ ఉతప్ప వంటి మాజీ ఆటగాళ్లు ఉన్నారు. ఈసారి టోర్నీలో పాల్గొనేందుకు పాక్ ఆటగాళ్లకు పీసీబీ ఎన్‌ఓసీలు ఇచ్చేందుకు అంగీకరించింది. అయితే గత సీజన్‌లో తీసుకున్న నిర్ణయంపై భారత్ నుంచి లిఖితపూర్వక క్షమాపణ కోరింది. అంతేకాదు.. భారత ఆటగాళ్లు టోర్నీలో పాల్గొనకపోయినా అభ్యంతరం లేదని నిర్వాహకులు హామీ ఇవ్వాలని కూడా కోరింది. అయితే ఈ డిమాండ్లను డబ్ల్యూసీఎల్ నిర్వాహకులు అంగీకరించలేదు. దీంతో

పాకిస్థాన్ ఛాంపియన్స్ టోర్నీ నుంచి తప్పుకుంది. దీనిపై డబ్ల్యూసీఎల్ మాత్రం 'అనుకోని పరిస్థితుల కారణంగా' పాక్ జట్టు వైదొలిగినట్లు ప్రకటించింది. 'వరల్డ్ ఛాంపియన్‌షిప్ ఆఫ్ లెజెండ్స్' (డబ్ల్యూసీఎల్) అనేది మాజీ అంతర్జాతీయ క్రికెటర్లతో నిర్వహించే టీ20 లీగ్. ఇందులో వివిధ దేశాలకు చెందిన మాజీ స్టార్ క్రికెటర్లు ఆయా దేశాల పేర్లతో జట్లుగా బరిలోకి దిగుతారు. భారత్ తరఫున యువరాజ్ సింగ్, సురేశ్ రైనా, హర్భజన్ సింగ్ వంటి మాజీ ఆటగాళ్లు ఆడుతున్నారు. అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన ఆటగాళ్లకు మరోసారి మైదానంలో అభిమానులను అలరించే అవకాశం కల్పించడమే ఈ లీగ్ ప్రధాన ఉద్దేశం.

విశ్వజి

చాట్ జీపీటీ చెప్పింది.. లక్షల అప్పు తీరింది!



చాట్ జీపీటీ మన అనుమానాలను తీరుస్తుందనే ఇన్నాళ్లూ విన్నాం. కానీ అప్పులనూ తీర్చేలా పనిచేస్తుందని తెలుసా?! ఇది నిజం. అమెరికా డెలావర్ ప్రాంతంలో ఉండే ఓ మహిళా రియల్టర్ చాట్ జీపీటీ సలహాలను పాటిస్తూ కేవలం నెల రోజుల్లో 20 లక్షల రూపాయల అప్పును తీర్చగలిగింది. నిజజీవితంలో పనికొచ్చేలా అది చెప్పిన వివిధ సలహాలు పాటిస్తూ ముందుకెళ్లడమే తను అప్పుల ఊబి నుంచి కాస్త బయట పడటానికి కారణమని ఆమె చెబుతుండటం ఎవరికైనా ఆసక్తి కలిగించే విషయమే. మరి ఆమె ఎవరు? ఆ అప్పుల్ని ఎలా తీర్చగలిగారు?.. అన్నది తెలుసుకుందాం రండి. జెన్నీఫర్ అలాన్ అమెరికాలో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తుంటుంది. వయసు 35 సంవత్సరాలు. డబ్బులు బాగానే సంపాదించినా, వాటిని సక్రమంగా వినియోగించడం చేతకాక పోవడంతో ఒకానొక దశలో రోజువారీ ఖర్చుల కోసం కూడా అప్పు చేయాల్సిన స్థితికి చేరుకుంది. ముఖ్యంగా ఆమెకు ఓ బిడ్డ పుట్టాక ఖర్చులు మరింత పెరిగాయి. అలాగని తానేం విలాసవంతంగా బతకలేదు. సాధారణ జీవితం గడపడానికీ డబ్బులు సరిపోని పరిస్థితి ఏర్పడేసరికి సమస్యను తీర్చమంటూ చాట్ జీపీటీని ఆశ్రయించిందామె. నిజజీవితంలో ఆచరించగలిగేలా కొన్ని సూచనలు చేయమని దానికి చెప్పింది. అయితే నిజంగానే అది విలువైన సూచనలు చేసింది. వాటిని పాటించిన ఆమె ఒక్క నెలలో తన అప్పుల్లో సగం%ా% అంటే 20 లక్షలకు పైగా మొత్తాన్ని తిరిగి చెల్లించగలిగింది.

30 రోజుల చాలెంజ్

బ్యూటీ చాలెంజ్, వాటర్ చాలెంజ్, గ్రీన్ చాలెంజ్‌లలాగే తన అప్పు తీర్చేందుకు చాట్ జీపీటీతో కలిసి థర్టీ డే చాలెంజ్‌ను తీసుకుంది జెన్నీఫర్. అందుకోసం అప్పటికప్పుడు తాను చేయదగ్గ సలహాలు ఇమ్మంటూ కృత్రిమ మేధ ఆధారితంగా పనిచేసే చాట్ జీపీటీని అడిగింది. ముందుగా వాడని నెలవారీ, ఏడాది సబ్‌స్క్రిప్షన్‌లను తొలగించమని, నిరుపయోగంగా వదిలేసిన అకౌంట్లను పరిశీలించమని చెప్పింది అది. అలా కొన్ని సబ్‌స్క్రిప్షన్లు ఆపేసి, తర్వాత అకౌంట్లు, డిజిటల్ వ్యాలట్‌లను పరిశీలిస్తుండగా క్రియారహితంగా ఉన్న బ్రోకరేజ్ అకౌంట్‌లో ఆమెకు 10000 డాలర్లు కనిపించాయి. అంటే మన డబ్బుల్లో ఎనిమిదిన్నరల లక్షల పై చిలుకే. ఇక నెలవారీ కిరాణా ఖర్చులకు సంబంధించీ అది కొన్ని చిట్కాలు సూచించింది. ముందే కొని ఉన్న పదార్థాలతో ఆహారం తయారు చేసుకోవడం, అలాగే పాడయ్యే అవకాశంతో పాటు ఖరీదు కూడా ఎక్కువ ఉండే తాజా కూరలతో పోలిస్తే తక్కువ ఖరీదులో దొరికే క్యాన్డ్ ఫుడ్‌ను అంటే నిల్వ ఉండే ఆహార పదార్థాలను ఎంచుకోవడంలాంటివి చెప్పింది. దీని ద్వారా ఆమె నెలలో ఏకంగా 50 వేల రూపాయల దాకా మిగిల్చగలిగిందట. అలా 30 రోజుల చాలెంజ్ పూర్తయ్యే సరికి తన అప్పులో సగం అంటే సుమారు 20 లక్షల రూపాయలను తీర్చేసింది. ఇక, మిగతాది కూడా తీర్చడం కోసం మరో థర్టీ డే చాలెంజ్‌ను తీసుకోబోతున్నట్టు చెప్పింది జెన్నీ. అంకెలు చూసి భయపడకుండా ఏం చేయగలమో ఆలోచిస్తూ, దాన్ని ఆచరించే పనిలో పడితే నెమ్మదిగా అప్పులు వాటంతట అవే తరిగిపోతాయని ధైర్యంగా చెబుతున్నదామె! అధునాతన సాంకేతికత అనర్థాలనే కాదు, సరిగ్గా వినియోగిస్తే అద్భుత ఫలితాలనూ ఇస్తుందనడానికి ప్రత్యక్ష ఉదాహరణగా నిలుస్తుంది కదూ ఈ సంఘటన.

ముప్పై ఏళ్లకే ముప్పు!

ఒకప్పుడు అరవై దాటితేనే దాడిచేసే గుండెపోటు.. ఇప్పుడు ముప్పై ఏళ్లకే ముప్పుగా పరిణమిస్తున్నది. ఉరుకులు పరుగుల నేటి జీవితంలో.. యువతలోనూ ఒత్తిడి విపరీతంగా పెరుగుతున్నది. ఇది.. దీర్ఘకాలంలో గుండె ఆరోగ్యాన్ని దెబ్బతీస్తున్నది. వెంటనే ప్రభావం చూపకుండా.. చాపకింద నీరులా ప్రమాదాన్ని పెంచుతున్నది. ఎలాంటి హెచ్చరికలు లేకుండానే.. నిండు ప్రాణాలను బలి తీసుకుంటున్నది.
జీవనశైలిలో చిన్నచిన్న మార్పులు చేసుకుంటే.. 'గుండె'కు అండ దొరుకుతుంది. ఇప్పుడు ప్రతి ఒక్కరి జీవితంలోనూ 'ఒత్తిడి' మామూలు విషయంగా మారిపోయింది. నిద్రలేమి, వేళాపాళ లేని భోజనం, డిజిటల్ స్క్రీన్లకు గంటల తరబడి అతుక్కుపోవడం, పని ఒత్తిడి.. ఇవన్నీ యువత గుండెకు హాని కలిగిస్తున్నాయి. నైట్ డ్యూటీలు కూడా.. అగ్గికి ఆజ్యం పోస్తున్నాయి. రాత్రంతా మేల్కొని ఉండటంతోపాటు నిద్ర రాకుండా ఉండేందుకు టీ-కాఫీలను ఎక్కువగా ఆశ్రయించాల్సి వస్తున్నది. ఇక ధూమపానం, మద్యంతోపాటు ప్రాసెస్ చేసిన ఆహార పదార్థాలు కూడా తోడై.. గుండెకు చేటు చేస్తున్నాయి. ఫలితంగా.. శరీరంలో కార్టిసాల్, అడ్రినలిన్ లాంటి హార్మోన్లు దారి తప్పుతున్నాయి. అన్నీ కలిసి హృదయ స్పందనల రేటును పెంచుతున్నాయి. ఇక రక్తపోటు, రక్తంలో చక్కెర స్థాయులు పెరిగి.. హృదయానికి హానికరంగా పరిణమిస్తున్నాయి... లక్షణాలు అంతంతే!
ఒత్తిడి లక్షణాలు అంత త్వరగా బయటపడవు. ముఖ్యంగా.. 30 %-% 40 ఏళ్లలోపు చాలామంది ఆరోగ్యంగా ఉన్నట్టే కనిపిస్తారు. ఇలాంటివారిలో హెచ్చరిక లక్షణాలు కూడా తక్కువగానే ఉంటాయి. అసౌకర్యంగా ఉండటం, అజీర్ణం, అసాధారణ అలసట వంటివి కనిపిస్తాయి. కానీ, వీటిని చాలామంది అంతగా పట్టించుకోరు. చిన్నచిన్న ఇబ్బందులుగానే భావిస్తారు. కానీ, గుండెపోటు రావడానికి ముందు.. కొన్ని సంకేతాలు కనిపిస్తాయి. ఛాతీలో నొప్పి, శ్వాస ఆడకపోవడం, వికారం-వాంతులతోపాటు అధికంగా చెమటలు పడతాయి. కొందరిలో తల తిరగడం, తీవ్రమైన అలసట కనిపిస్తుంది. వీటిని నిర్లక్ష్యం చేస్తే.. మరింత ప్రమాదకరంగా మారుతుంది.
జాగ్రత్తలు తప్పనిసరి.. సమతుల ఆహారం తీసుకోవడం, రోజుకు కనీసం 30 నిమిషాల వ్యాయామం, సరైన వేళల్లో నిద్రపోవడం, డిజిటల్ స్క్రీన్ల నుంచి విరామాలు తీసుకోవడం వల్ల గుండె ఆరోగ్యానికి భరోసా ఇవ్వొచ్చు. యోగా, ధ్యానంతో శరీరంతోపాటు మనసూ రీసెట్ అవుతుంది. క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేసుకోవాలి. ఈసీజీ, కొలెస్ట్రాల్ టెస్ట్, బీపీ పరీక్షలు, ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ ఉండాలి. దీనివల్ల సమస్యను ముందుగానే గుర్తించే అవకాశం ఉంటుంది. కరోనరీ క్యాల్షియం స్కోరింగ్, హై సెన్సిటివిటీ ట్రోపోనిన్ లాంటి పరీక్షలు గుండె సమస్యలను ప్రారంభంలోనే గుర్తించగలవు. ఇక స్మార్ట్‌వాచ్‌లూ హృదయ స్పందన రేటును ఎప్పటికప్పుడు చెబుతుంటాయి.

ఏఐతో మెదడుకు చేటు!



కృత్రిమ మేధ (ఏఐ)ను పరిమితికి మించి వాడితే.. మెదడుపై ప్రతికూల ప్రభావం చూపుతుందట. దీర్ఘకాలంలో మనిషి ఆలోచనా శక్తి తగ్గిపోయే ప్రమాదం కూడా ఉన్నదట. అమెరికాలోని మసాచుసెట్స్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నిర్వహించిన తాజా అధ్యయనం ఈ విషయాన్ని వెల్లడించింది. సర్వేలో భాగంగా 54 మందిని ఎంపిక చేశారు. ఒక్కొక్కరితో మూడేసి వ్యాసాలను రాయించారు. మొదటిసారి వారినే సొంతంగా ఆలోచించి రాయమని చెప్పారు. రెండోసారి గూగుల్‌లో వెతికి.. ఆ తర్వాత, ఏఐ సాయంతోనూ వ్యాసాలను రాయించారు. ఈ సందర్భంగా వారి మెదడులో జరిగే ఎలక్ట్రానిక్ కార్యకలాపాలను పరిశీలించారు. ఆశ్చర్యంగా.. సొంతంగా ఆలోచించి వ్యాసాలు రాసినప్పుడు మెదడు ఎక్కువ ఉత్సాహంగా పనిచేసినట్టు కనుగొన్నారు. మెదడు పనితీరు కూడా మెరుగుపడ్డట్టు గుర్తించారు. ఇక గూగుల్‌లో వెతికినప్పుడు ఆ ఉత్సాహం తగ్గినట్టు కనిపిస్తే.. ఏఐ సాయంతో వ్యాసం రాసేటప్పుడు మెదడు ప్రభావం ఏమాత్రం లేనట్టు చెప్పుకొచ్చారు. దీర్ఘకాలంలో ఈ అలవాటు మెదడుకు చేటు చేస్తుందని అధ్యయనకారులు ఆందోళన వ్యక్తం చేశారు. సరికొత్త సాంకేతికత ఎప్పుడు వచ్చినా, మనిషి సామర్థ్యాన్ని దెబ్బతీస్తూనే ఉన్నదని వారు ఈ సందర్భంగా గుర్తుచేశారు. 'క్యాలిక్యులేటర్' అందుబాటులోకి వచ్చిన తర్వాత.. విద్యార్థులు చేతితో లెక్కలు చేయడం తగ్గిపోయిందని చెప్పుకొచ్చారు. దీర్ఘకాలంలో చిన్నచిన్న లెక్కలను కూడా సొంతంగా చేసుకోలేని పరిస్థితి వచ్చిందని వెల్లడించారు. ఏఐ కూడా ఈ విధంగానే మనుషుల మెదడుపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉన్నదని పేర్కొన్నారు. కాబట్టి, ఏఐని పరిమితంగానే వాడుకోవాలని వారు సూచిస్తున్నారు.

మాన్‌సూన్.. మసాలా!

సుగంధ ద్రవ్యాలు.. ఆహార పదార్థాలకు అద్భుతమైన రుచిని అందిస్తాయి. ఘాటైన వాసనలతో వంటలను పరిమళ భరితంగా మార్చేస్తాయి. అంతేకాదు.. ఆరోగ్యాన్ని కాపాడటంలోనూ ఇవి ముందుంటాయి. అయితే, మాన్‌సూన్ సీజన్‌లో.. మసాలా దినుసులు త్వరగా పాడవుతాయి. వర్షాకాలపు తేమతో.. సుగంధాన్ని కోల్పోయి పనికిరాకుండా పోతాయి. అలా కాకుండా ఉండాలంటే.. ఈ చిట్కాలు ఎంతగానో ఉపయోగపడతాయి.
వర్షాకాలంలో గాలిలో తేమ పెరుగుతుంది. దాంతో మసాలా పొడులు ముద్దగా అయిపోతాయి. ఇతర దినుసులు, సుగంధ ద్రవ్యాలపై బూజు, ఫంగస్ లాంటివి పెరుగుతాయి. అందుకే.. నిల్వ చేయడానికి ముందే సుగంధ ద్రవ్యాలను కొద్దిగా వేయించాలి. దీనివల్ల వాటిల్లో తేమ తగ్గిపోతుంది. నిల్వ సామర్థ్యం పెరుగుతుంది. అంతేకాదు, ఈ సింపుల్ డ్రై రోస్టింగ్‌తో అవి మరింత రుచికరంగా మారుతాయి. తేమ వల్ల ఇనుప డబ్బాలు తుప్పు పడుతుంటాయి. వాటిలో నిల్వచేసిన మసాలాల్లోనూ ఈ తుప్పు కలిసిపోయి.. అనారోగ్యాన్ని కలిగిస్తాయి. కాబట్టి, సుగంధ ద్రవ్యాలను గాజు పాత్రలలో నిల్వ చేయండి. గాలి చొరబడని ఎయిర్‌టైట్ కంటైనర్లను వాడండి. కిచెన్‌లో తేమ ఎక్కువగా ఉండే సింక్, వాష్ ఏరియాలకు మసాలా డబ్బాలను దూరంగా ఉంచండి. అలాగే, ఆ డబ్బాలపై సూర్యకాంతి నేరుగా పడకుండా చూసుకోండి. మసాలా దినుసులను వాడటానికి ముందు.. చేతులను శుభ్రంగా కడుక్కొని, పొడి వస్త్రంతో బాగా తుడుచుకోవాలి. లేకుంటే.. సూక్ష్మక్రిములు, బ్యాక్టీరియాతో అవి కలుషితమైపోతాయి. చాలామంది అన్ని దినుసులను ఒక్క డబ్బాలోనే నిల్వచేస్తారు. దీనివల్ల వాటి సహజసిద్ధమైన రుచి మారుతుంది. బదులుగా.. ఒక్కో దినుసును ఒక్కో డబ్బాలో నిల్వచేయండి.

మార్కెట్

స్వల్ప లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు..

270 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్..

దేశీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం లాభాల్లో ముగిశాయి. యూఎస్ సుంకాల ఉద్రిక్తతలు సెంటిమెంట్‌పై ప్రభావం చూపడంతో మార్కెట్లు నిదానంగా కదలాడాయి. భారత్-యూఎస్ వాణిజ్య చర్చలు నిలిచిన నేపథ్యంలో పెట్టుబడిదారులు అప్రమత్తంగా వ్యవహరించారు. మార్కెట్లు ఉదయం నష్టాల్లో మొదలైనా.. చివరి సెషన్‌లో కోలుకోవడంతో లాభాల్లో ముగిశాయి. క్రితం సెషన్‌తో పోలిస్తే సెన్సెక్స్ 83,387.03 పాయింట్ల వద్ద నష్టాల్లో మొదలైంది. ఇంట్రాడేలో 83,320.95 పాయింట్ల కనిష్టానికి చేరిన సెన్సెక్స్.. గరిష్టంగా 83,812.31 పాయింట్లకు పెరిగింది. చివరకు 270.01 పాయింట్ల లాభంతో 83,712.51 వద్ద స్థిరపడింది. మరో వైపు నిఫ్టీ సైతం 61.20 పెరిగి 25,522.50 వద్ద ముగిసింది. ట్రేడింగ్‌లో దాదాపు 1,889 షేర్లు లాభాల్లో కొనసాగగా.. 1,990 షేర్లు నష్టాల్లో ముగిశాయి. విస్తృత మార్కెట్లు స్వల్పంగా నష్టపోయాయి. ప్రైవేట్ బ్యాంకింగ్ స్టాక్‌ల లాభాలతో బ్యాంక్ నిఫ్టీ ఇండెక్స్ దాదాపు 60 బేసిస్ పాయింట్లు లాభపడింది. ఐటీ, రియాలిటీ, మీడియా సూచీలు లాభాలను నమోదు చేశాయి. మరోవైపు, ఫార్మా, పబ్లిక్ బ్యాంకింగ్, ఎఫ్ఎంసీజీ స్టాక్‌లు పడిపోయాయి.

మొబైల్ చార్జీలకు రెక్కలు?

న్యూఢిల్లీ : మొబైల్ ఫోన్ వినియోగదారులకు మరోసారి చార్జీల మోత మోగనున్నది. ఎకనామిక్ టైమ్స్ (ఈటీ) టెలికం నివేదిక ప్రకారం.. దేశీయ టెలికం కంపెనీలైన భారతీ ఎయిర్‌టెల్, రిలయన్స్ జియో, వొడాఫోన్ ఐడియాలు ఈ ఏడాది ఆఖరుకల్లా ప్లాన్ల ధరల్ని 10 నుంచి 12 శాతం పెంచాలని యోచిస్తున్నట్టు తెలుస్తున్నది. ఇదే జరిగితే కస్టమర్లపై చార్జీల భారం ఆయా ప్లాన్లు, వాటి కాలపరిమితి, రోజువారీ డాటానుబట్టి గరిష్ఠంగా రూ.500 వరకు పడటం ఖాయం. నాడు 23% వరకు.. ఏడాది క్రితం జూలైలోనే భారతీయ టెలికం సంస్థలు తమ మొబైల్ ఫోన్ ప్లాన్ల ధరల్ని 11 నుంచి 23 శాతం వరకు పెంచాయి. దీంతో ప్లాన్ వ్యవధి, దాని డాటా, ఇతరత్రా ఆఫర్లనుబట్టి గరిష్ఠంగా రూ.900 వరకు ధరలు పెరగడం గమనార్హం. నిజానికి పాపులర్ ప్లాన్ల ధరలు ఇప్పటికే రూ.200కుపైగా పెరగడంతో మొబైల్ ఫోన్ యూజర్లు



ఇబ్బందులు పడుతున్న పరిస్థితి. ఈ క్రమంలో మళ్లీ భారీ ఎత్తునే చార్జీల పెంపునకు వీలుందన్న వార్తలు.. కస్టమర్లకు గుబులు పుట్టిస్తున్నాయి. సహజంగా మార్కెట్‌లో 3 నెలల ప్లాన్లు ఎక్కువగా అమ్ముడుపోతాయి. దీంతో డిసెంబర్‌కల్లా వాటి ధరలు ఇంకో రూ.70-85 మేర పెరిగే వీలున్నది.
పెరిగిన యాక్టివ్ సబ్‌స్క్రైబర్లు..ఈ ఏడాది మే నెలలో టెలికం సంస్థల యాక్టివ్ సబ్‌స్క్రైబర్లు భారీగా పెరిగారు. ఈ నేపథ్యంలోనే రిచార్జ్ ధరల్ని టెల్కోలు పెంచాలని భావిస్తున్నట్టు మార్కెట్ నిపుణులు విశ్లేషిస్తున్నారు. అయితే ధరలు పెంచితే మరో టెలికం నెట్‌వర్క్‌లోకి తమ వినియోగదారులు వెళ్లకుండా టెలికం సంస్థలు ఓ నిర్దిష్ట విధానంపైనా దృష్టి పెడుతున్నాయి. ఈ క్రమంలోనే ఆయా ప్లాన్లపై ఆకర్షణీయ ఆఫర్లు వచ్చే వీలుందని ఇండస్ట్రీ వర్గాలు అంచనా వేస్తున్నాయి. నిజానికి కస్టమర్లు ఒక సంస్థ నుంచి మరో సంస్థకు వెళ్లిపోతుంటే కంపెనీలు చార్జీల పెంపునకు వెనుకాడుతాయి. అలాకాకుండా ఒకే సంస్థలో కొనసాగుతున్నట్లైతే ధరల మోతకు సాహసిస్తాయి. ఇప్పుడిదే వాతావరణం పరిశ్రమలో కనిపిస్తున్నదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కాగా, ప్రస్తుతం దేశంలో 100 కోట్లకుపైగానే టెలికం వినియోగదారులున్నట్టు గణాంకాలు చెప్తున్నాయి.

ఒక్కరోజే 54 పైసలు డౌన్

డాలర్‌ముందు రూపాయి విలవిల

ముంబై : అగ్రరాజ్యం అమెరికా డాలర్ దెబ్బకు రూపాయి మారకానికి భారీ చిల్లులుపడ్డాయి. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ సోమవారం ఒకేరోజు 54 పైసలు పడిపోయి 85.94కి జారుకున్నది. అంతర్జాతీయ మార్కెట్లో క్రూడాయిల్ ధరలు భగ్గుమనడం, డాలర్ బలోపేతం కావడంతో ఇతర కరెన్సీలు తీవ్రంగా నష్టపోయాయి. ప్రతీకార సుంకాల విధింపుపై అనిశ్చిత పరిస్థితులు కొనసాగుతుండటంతో దేశీయ కరెన్సీపై తీవ్ర ప్రభావం చూపిందని ఫారెక్స్ డీలర్ వెల్లడించారు. 85.53 వద్ద ప్రారంభమైన డాలర్-రుపీ ఎక్స్ఛేంజ్ రేటు 85.51-86.03 స్థాయిలో కదలాడింది. చివరకు గత ముగింపుతో పోలిస్తే 54 పైసలు కోల్పోయి 85.94 వద్ద స్థిరపడింది. గతవారంలో రూపాయి విలువ 20 పైసలకు పైగా పెరిగిన విషయం తెలిసిందే. బ్రెంట్ క్రూడాయిల్ బ్యారెల్ ధర స్వల్పంగా పెరిగి 68.48 డాలర్లకు చేరుకున్నది.

రాయలసీమ పౌరుషమంటే గొడ్డలి పోట్లు కాదు

జలజీవన్ మిషన్ నిధులను నిర్వీర్యం చేసిన జగన్
ప్రాంతీయ వివక్ష లేకుండా అభివృద్ధి పనులు
ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్
ప్రొద్దుటూరులో అమరజీవి జలధార పథకానికి శ్రీకారం
పాల్గొన్న డిప్యూటీ సిఎం జనసేన అధినేత పవన్ కల్యాణ్

ప్రొద్దుటూరు, అక్టోబర్ 05 : యుద్ధం వచ్చినప్పుడు, హద్దులు దాటినప్పుడు నా గొంతు ఎలా ఉంటుందో మీకు తెలుసు. కానీ ఇది శాంతి సమయం. ప్రజలకు అభివృద్ధి చేయాల్సిన సమయం. అందుకే రాయలసీమ పౌరుషానికి తగిన స్పీచ్ మాట్లాడట్లేదు. రాయలసీమ అభివృద్ధికి అవసరమైన విధంగా మాట్లాడుతున్నా. గొడవలు, కొట్లాటలు, గొడ్డలి పోట్లు కాకుండా అభివృద్ధి లక్ష్యంగా ముందుకు వెళ్దాం" అంటూ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ రాయలసీమ పౌరుషాన్ని ప్రస్తావిస్తూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. గొడవలకు, పౌరుషానికి ప్రతీకగా నిలిచిన ఈ నేల రూపురేఖలను అభివృద్ధి పథంలో మార్చాలని ఆయన పిలుపునిచ్చారు. కడప జిల్లా ప్రొద్దుటూరులో ముఖ్యమంత్రి చంద్రబాబుతో కలిసి రూ.30,156 కోట్ల విలువైన 'అమరజీవి జలధార' పథకానికి శంకుస్థాపన చేసిన సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో పవన్ కల్యాణ్ తనదైన శైలిలో ప్రసంగించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు పేరు మీద ఈ బృహత్తర తాగునీటి పథకాన్ని ప్రారంభించడం సంతోషంగా ఉందని పవన్ అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 3.27 కోట్ల మంది ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందించే లక్ష్యంతో 24,601 ఆవాసాల్లో 50,315 పనులను ఈ పథకం కింద చేపట్టనున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా గత ప్రభుత్వంపై ఆయన తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. "ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించిన 'హర్ ఘర్ జల్ – జలజీవన్ మిషన్'కు 2019–24 మధ్య అధికారంలో ఉన్న ప్రభుత్వం తూట్లు పొడిచింది. రూ.26,000 కోట్ల విలువైన పనులకు ప్రతిపాదనలు పంపి, ఐదేళ్లలో కేవలం రూ.2,700 కోట్లు మాత్రమే ఖర్చు చేసి ఏ ఒక్క ప్రాజెక్టునూ పూర్తి చేయలేదు. ప్రజల తాగునీటి కష్టాలను ఏమాత్రం పట్టించుకోలేదు" అని దుయ్యబట్టారు. 2024లో ఈ పథకం ముగిసిపోవాల్సిన తరుణంలో, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే తాను, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కలిసి ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులు సి.ఆర్. పాటిల్, నిర్మలా సీతారామన్‌లను కలిసి విజ్ఞప్తి చేశామని గుర్తుచేశారు. వారి సహకారంతో ఈ పథకాన్ని 2028 వరకు పొడిగించుకుని, పనులను వేగవంతం చేశామని తెలిపారు. "గత ప్రభుత్వం ఖర్చు చేయగా మిగిలిన పనులతో పాటు, ఇప్పటికే మేము రూ.4,500 కోట్ల విలువైన పనులను పూర్తి చేశాం. మీరు మాపై ఉంచిన నమ్మకమే మాకు శ్రీరామరక్ష" అని పవన్ పేర్కొన్నారు. తమది కక్షసాధింపుల ప్రభుత్వం కాదని, ప్రజాభివృద్ధిని మాత్రమే లక్ష్యంగా పెట్టుకుందని పవన్ స్పష్టం చేశారు. "దశాబ్దాలుగా తాగునీటి సమస్యతో అల్లాడుతున్న పులివెందుల నియోజకవర్గంలో అసంపూర్తిగా నిలిచిపోయిన పథకాలకు రూ.280 కోట్లు కేటాయించి 7 మండలాల్లోని 299 గ్రామాలకు నీరందిస్తున్నాం. అలాగే, వైసీపీ ఎంపీ ఉన్నప్పటికీ అల్లూరి సీతారామరాజు జిల్లాలోని అరకు, పాడేరు నియోజకవర్గాల్లో రూ.2,500 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టాం. మాకు పార్టీలు కాదు, ప్రజల సమస్యలే ముఖ్యం" అని ఉద్ఘాటించారు. గత ప్రభుత్వ హయాంలో తమ పార్టీకి మద్దతిచ్చారనే కారణంతో ప్రొద్దుటూరు నియోజకవర్గంలోని తాళ్లమాపురం గ్రామ ప్రజలను నాటి శాసనసభ్యుడు తీవ్రంగా అవమానించారని, వారి వినతిపత్రాన్ని కళ్లెదుటే నలిపి పడేశారని పవన్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆ గ్రామాల అభివృద్ధి కోసం తక్షణమే రూ.3.5 కోట్లతో సీసీ రోడ్లు, తాగునీటి పథకాలను మంజూరు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి సమక్షంలో ప్రకటించారు. రాష్ట్ర చరిత్రలో మునుపెన్నడూ లేని విధంగా మౌలిక వసతులను కల్పిస్తున్నామని గణాంకాలతో వివరించారు. "రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి 2024 వరకు నిర్మించిన వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్లు, రిజర్వాయర్ల సామర్థ్యానికి అదనంగా 50 శాతం నుంచి 175 శాతం వరకు కేవలం ఈ ఐదేళ్లలోనే నిర్మించబోతున్నాం" అని తెలిపారు. నీటిని అందించడం ప్రభుత్వ బాధ్యత అయితే, దాన్ని కాపాడుకోవడం మనందరి బాధ్యత అని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

అప్పాజీపేటలో అర్ధరాత్రి మిస్టరీ

అనంతపురం : అనంతపురం జిల్లాలో అప్పాజీపేటలో వారం రోజులుగా గాల్లోంచి రాళ్లు పడుతున్నాయి. అవి ఎక్కడ నుంచి వస్తున్నాయో.. ఎలా పడుతున్నాయో అర్థం కాక గ్రామస్థులు భయాందోళనకు గురవుతున్నారు. దీనిపై పోలీసులకు కూడా ఫిర్యాదు చేశారు. పోలీసులు నిఘా పెట్టిన సమయంలో ఈ రాళ్లు పడ్డాయి. దీంతో ఇది ఏ దెయ్యం పనో అని గ్రామస్థులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. స్వామిజీల దగ్గరకు పరుగులు తీస్తున్నారు. అయితే ఆకతాయిల పని అయి ఉంటుందని పోలీసులు అనుమానిస్తున్నట్టు తెలుస్తుంది. ప్రజలు మాత్రం రాత్రిపూట నిద్రపోలేకపోతున్నామని, ఈ సమస్యను త్వరగా పరిష్కరించమని కోరుతున్నారు.అనంతపురం జిల్లాలో అప్పాజీపేటలో ఓ వింత పరిస్థితి నెలకొంది. ఆ గ్రామంలో వారం రోజులుగా గాల్లోంచి రాళ్లు పడుతున్నాయి. ఈ పరిణామంతో రాత్రైతే చాలు వణికిపోతున్న జనం.. ఆ ఊర్లో ఉండాలంటే భయపడిపోతున్నారు. ఈ ఘటన వల్ల ఇప్పటికే చాలా ఇళ్లు డ్యామేజ్ అయ్యాయి. ఇళ్ల పైకప్పులు పగిలిపోయాయి. ఆ రాళ్లు ఎక్కడ నుంచి వస్తున్నాయో తెలియక ఆ ఊరి ప్రజలు అయోమయానికి గురవుతున్నారు. రాత్రి పూట అందరూ ఒకే చోటకు చేరుతున్నారు. ఈ విషయంపై ప్రజలు రకరకాలుగా ఆలోచనలు చేస్తున్నారు. ఎవరైనా కావాలనే చేస్తున్నారా? దైవం పనా? దెయ్యం పనా? అనే ఊహాగానాలు జోరందుకున్నాయి.ఈ బాధ భరించలేక ప్రజలు చివరి పోలీసులను ఆశ్రయించారు. దీనిపై ఫిర్యాదు అందుకున్న తర్వాత నలుగురు పోలీసులు ఆ గ్రామంలో గస్తీ కూడా నిర్వహించారు. ఆ సమయంలో కూడా గాల్లోంచి రాళ్లు పడ్డాయి. అయినా ఫలితం లేకపోయింది. ఈ విషయంపై ప్రజలు స్వామీజీల దగ్గరకు పరుగులు తీస్తున్నారు. పోలీసులతో పాటు సుమారు 20 మంది యువకులు కూడా ఈ మిస్టరీని ఛేదించడానికి కొండపైకి వెళ్లి పరిశీలించారు. అప్పుడు కూడా ఇళ్లపై రాళ్లు వచ్చి పడ్డాయి.దీంతో ఆ గ్రామ ప్రజలు ఇది కచ్చితంగా అదృశ్య శక్తుల పనే.. అని అనుమానిస్తున్నారు. అయితే అలాంటి దానికి ఆస్కారం లేదని, ఇది ఆకతాయిలు చేస్తున్న పనిగా కనిపిస్తుందని పోలీసులు భావిస్తున్నట్టు సమాచారం. ఇందులో భాగంగానే పోలీసులు నిఘా ఉన్న సమయంలో రాళ్లు ఎలా పడుతున్నాయో గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నారు. కొందరు వ్యక్తులే కావాలనే రాళ్లు విసురుతూ భయాందోళనకు గురి చేస్తున్నారా? దీనికి ఇంకేదైనా కారణముందా? అనే కోణంలో దర్యాప్తు సాగుతుంది. అయితే రాళ్ల దాడి వల్ల ప్రజలు రాత్రిళ్లు ప్రశాంతంగా నిద్రపోలేకపోతున్నారు. ఎక్కువగా సాయంత్రం 7 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు రాళ్లు పడ్డాయని స్థానికులు చెబుతున్నారు. చాలామంది గ్రామానికి వచ్చి వీడియోలో, ఫోటోలు తీసుకెళ్తున్నారని కానీ సమస్య మాత్రం పరిష్కారం కావడం లేదని వాపోతున్నారు. దీంతో తమకు భద్రత కల్పించాలని గ్రామస్థులు పోలీసులను కోరుతున్నారు.అయితే తెలుగు రాష్ట్రాల్లో కూడా ఇలా జరిగిన ఘటనలు అనేకం జరిగాయి. ప్రకాశం జిల్లా, నిజామాబాద్, కరీంనగర్ జిల్లాలోని గ్రామాల్లో అచ్చం ఇలాగే రాత్రైతే ఇళ్లపై రాళ్లు పడేవి. 'జన విజ్ఞాన వేదిక' ప్రతినిధులు, పోలీసులు నైట్ విజన్ కెమెరాలు పెట్టి దర్యాప్తు చేశారు. ఆ విచారణలో గ్రామస్థులే ఆస్తి తగాదాల వల్ల ఈ రాళ్లు విసిరినట్టు తెలిసింది. ఈ నేపథ్యంలో అప్పాజీపేటలో కూడా పోలీసులు సాధారణ గస్తీని నిర్వహించే బదులు సీసీ కెమెరాలు, డ్రోన్లు లేదా నైట్ విజన్ కెమెరాలు ఉపయోగిస్తే ఈ రాళ్ల వాన మిస్టరీ త్వరగా వీడే అవకాశం ఉంటుంది.

మళ్లీ బ్యాలెట్లతో ఎన్నికలకు ఖర్గే డిమాండ్

న్యూఢిల్లీ : కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే దేశవ్యాప్తంగా జరిగిన లోక్‌సభ , అన్ని రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు పూర్తిగా అక్రమమని, ప్రధాని నరేంద్ర మోదీ, హోంమంత్రి అమిత్ షా సహా దేశంలోని ముఖ్యమంత్రులంతా అక్రమ ప్రక్రియ ద్వారానే పదవుల్లోకి వచ్చారని ఆరోపణలు చేశారు. ప్రస్తుత లోక్‌సభతో పాటు అన్ని రాష్ట్రాల అసెంబ్లీలను తక్షణమే రద్దు చేసి, బ్యాలెట్ పేపర్ పద్ధతిలో సరికొత్తగా ఎన్నికలు నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలను, రాజ్యాంగబద్ధ ఎన్నికల ప్రక్రియను ఇంత తీవ్రంగా కించపరిచే ప్రకటన దేశంలోని అత్యంత పురాతన జాతీయ పార్టీ అధ్యక్షుడి స్థాయి నుంచి రావడం విడ్డూరంగా మారింది.ఎన్నికల ఫలితాలు అనుకూలంగా వచ్చినప్పుడు ప్రజాస్వామ్యం గెలిచిందని, పరాజయం ఎదురైనప్పుడు వ్యవస్థలన్నీ మేనేజ్ అయిపోయాయని నిందించడం కాంగ్రెస్ పార్టీకి అలవాటుగా మారిందన్న విమర్శలు ఎప్పటినుంచో ఉన్నాయి. అయితే ఈసారి ఖర్గే ఏకంగా దేశంలోని యావత్ ఎన్నికల ప్రక్రియనే చట్టవిరుద్ధం అని ప్రకటించడంతో, పరోక్షంగా భారత రాజ్యాంగం, దేశ ప్రజల తీర్పునే ఆయన అవమానించినట్లయింది. ఈవీఎంల దుర్వినియోగం, ఓటర్ల జాబితాల సవరణ అంటూ సాకులు వెతుకుతూ, క్షేత్రస్థాయిలో వరుస ఓటములకు ఎన్నికల సంఘంపై నెపం నెట్టే ప్రయత్నం కాంగ్రెస్ వైఫల్యాన్ని కప్పిపుచ్చుకుంటున్నారు. ఖర్గే చెప్పినట్లు దేశంలో జరిగిన ఎన్నికలన్నీ చట్టవిరుద్ధమే అయితే, ఆ వ్యవస్థ ద్వారానే ఏర్పడిన ప్రభుత్వాలు కూడా అక్రమమే కావాలి. మరి అదే నిజమైతే, కాంగ్రెస్ పార్టీ తన వాదనల్లో ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా తక్షణమే చేతల్లో చూపించాల్సిన అవసరం ఉంది.కాంగ్రెస్ అధికారంలో ఉన్న కర్ణాటక, తెలంగాణ, హిమాచల్ ప్రదేశ్ వంటి రాష్ట్రాల్లోనూ ముఖ్యమంత్రులు, ఎమ్మెల్యేలు ఎన్నికైంది ఇదే ఈవీఎంల ద్వారా, ఇదే ఎన్నికల సంఘం పర్యవేక్షణలోనే. మరి ఆ రాష్ట్రాల్లో కాంగ్రెస్ సాధించిన విజయాలు కూడా అక్రమమైనవేనా అన్న ప్రశ్నకు ఆ పార్టీ నేతలు ఏం సమాధానం చెబుతారు? కాంగ్రెస్ పార్టీకి ప్రజాస్వామ్యంపై, దేశ ప్రజల ముందు తమ వైఖరిపై నిజాయితీ ఉంటే.. ఇతరుల రాజీనామాలను డిమాండ్ చేయడానికి ముందుగా తాము పాలించే రాష్ట్రాల్లో నైతిక బాధ్యతను చాటుకోవాలి. కర్ణాటక, తెలంగాణ, హిమాచల్ ప్రదేశ్ అసెంబ్లీలను తక్షణమే రద్దు చేయించి, కాంగ్రెస్ ముఖ్యమంత్రులతో రాజీనామాలు చేయించాలి. మేము ఈ ఎన్నికల ఫలితాలను గుర్తించడం లేదు, అందుకే మా పదవులను త్యజించి బ్యాలెట్ పేపర్ ఎన్నికలను కోరుతున్నాం అని తమ ప్రభుత్వాలను రద్దు చేసినప్పుడే ఖర్గే వాదనలకు దేశంలో కనీస విశ్వసనీయత లభిస్తుంది.అధికారంలో ఉన్న రాష్ట్రాల గద్దెలను అంటిపెట్టుకుని ఉంటూ, కేంద్రంలోని ప్రభుత్వంపై మాత్రం అక్రమం అనే ముద్ర వేసి లోక్‌సభ రద్దును కోరడం పూర్తిగా రాజకీయ ద్వంద్వ ప్రమాణాలకు నిదర్శనం. కాంగ్రెస్ గెలిస్తే ప్రజాతీర్పు, ఓడిపోతే వ్యవస్థల కుట్ర అనే కుంటిసాకులు ఇక ఏమాత్రం ప్రజాక్షేత్రంలో చెల్లవు. కాంగ్రెస్ హైకమాండ్ నిజంగానే ప్రస్తుత ఎన్నికల వ్యవస్థను తిరస్కరిస్తే.. ముందుగా తమ సొంత రాష్ట్రాల్లో అధికారాన్ని వదులుకుని రాజీనామాలతో మొదలుపెట్టాలి.

బీసీ రిజర్వేషన్లు ఓటు బ్యాంక్ డ్రామాలు

విజయవాడ : ఆంధ్రప్రదేశ్ స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియలో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన జీవోలను ఏపీ హైకోర్టు కొట్టివేసింది. ఎస్సీ, ఎస్టీ, బీసీల మొత్తం రిజర్వేషన్లు 50 శాతానికి మించకూడదన్న సర్వోన్నత న్యాయస్థానం నిబంధనలకు ఈ జీవోలు విరుద్ధమని స్పష్టం చేస్తూ, ఆరు వారాల్లో ప్రక్రియ ప్రారంభించి ఎన్నికలు పూర్తి చేయాలని హైకోర్టు ఆదేశించింది. అయితే, ఈ తీర్పుపై సుప్రీంకోర్టుకు వెళ్తామని సీఎం చంద్రబాబు ప్రకటించినప్పటికీ, న్యాయపరంగా ఇది నిలబడదని తెలిసి కూడా వేస్తున్న రాజకీయ ఎత్తుగడగానే స్పష్టమవుతోంది.రాజ్యాంగబద్ధమైన పరిమితులను అధిగమించి రిజర్వేషన్లు కల్పించడం సాధ్యం కాదని రాజ్యాంగ ధర్మాసనాలు ఎన్నోమార్లు స్పష్టం చేశాయి. సుప్రీంకోర్టు స్పష్టమైన మార్గదర్శకాలను ఇచ్చింది. స్థానిక సంస్థల్లో రాజకీయోచిత వెనుకబాటుతనాన్ని నిర్ధారించేందుకు త్రిసభ్య కమిషన్ ద్వారా ట్రిపుల్ టెస్ట్ నిర్వహించకుండా , 50 శాతం సీలింగ్‌ను దాటుకుని ఏ రాష్ట్రమూ రిజర్వేషన్లు పొడిగించకూడదని పేర్కొంది. ఈ తీర్పులు ఉన్నప్పటికీ 34 శాతం కోటాతో జీవోలు తెచ్చి, అది కోర్టుల్లో చెల్లదని తెలిసీ సుప్రీంకోర్టుకు వెళ్లడం కేవలం రాజకీయ వ్యూహాల్లో భాగంగానే జరుగుతోంది. ఈ తరహా రాజకీయ వ్యూహాలు తెలుగు రాష్ట్రాలకు కొత్తవేమీ కావు. ఉమ్మడి ఏపీ సమయం నుంచి మొన్నటి తెలంగాణ పంచాయతీ ఎన్నికల వరకు కూడా ప్రభుత్వాలు 50 శాతానికి మించి బీసీ కోటాను పెంచుతూ నిర్ణయాలు తీసుకోవడం, న్యాయస్థానాలు వాటిని అడ్డుకోవడం క్రమబద్ధమైన పరిణామంగా మారింది. తెలంగాణలోనూ బీసీ రిజర్వేషన్లపై గతంలో తెచ్చిన ఆర్డినెన్సులు కోర్టుల్లో నిలబడలేక చివరకు 50 శాతం లోపే ఎన్నికలు నిర్వహించాల్సి వచ్చింది. ప్రభుత్వాలు రాజ్యాంగ నిపుణుల సలహాలు తీసుకోకుండా లేదా తెలిసీ విస్మరించి, ఎన్నికల ముందు భారీ రిజర్వేషన్ల హామీలు ఇవ్వడం ఒక అనవసర సంప్రదాయంగా మారింది. ఈ తరహా పరిమితికి మించిన రిజర్వేషన్ల హామీలు వెనుకబడిన వర్గాల సంక్షేమం కోసం ఇచ్చేవి కావు. ఇవి ప్రధానంగా ఓటు బ్యాంకులను ఆకట్టుకునేందుకు ఆడే రాజకీయ క్రీడ. బీసీ వర్గాల్లో అత్యాశలు, ఆకాంక్షలు రేకెత్తించడం, ఆపై జీవోలను సిద్ధం చేయడం, న్యాయస్థానాలు రాజ్యాంగ చట్రంలో వాటిని కొట్టేయగానే మేము బీసీలకు న్యాయం చేయాలని చూశాం, కానీ కోర్టులు అడ్డుకున్నాయి అంటూ సానుభూతి పొందేందుకు ప్రయత్నించడం రాజకీయ పార్టీల పరిపాటిగా మారింది. దీనివల్ల అసలైన లబ్ధిదారులకు న్యాయం జరగకపోగా, స్థానిక సంస్థల ఎన్నికలు సుదీర్ఘకాలం పాటు వాయిదా పడి స్థానిక పాలన స్తంభించిపోతోంది. వాస్తవానికి, బీసీలకు స్థానిక సంస్థల్లో చట్టబద్ధమైన అధిక ప్రాతినిధ్యం కల్పించాలనే నిజమైన చిత్తశుద్ధి ప్రభుత్వాలకు ఉంటే, ముందుగా ట్రిపుల్ టెస్ట్ ద్వారా క్షేత్రస్థాయి డాటాను సేకరించి, రాజ్యాంగ సవరణల కోసం కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలి. లేదా 50 శాతం పరిమితికి లోబడే బీసీలకు గరిష్ఠంగా లబ్ధి చేకూరేలా సీట్ల కేటాయింపు చేయాలి. కానీ, ఆచరణాత్మక పరిష్కారాలను విస్మరించి, న్యాయపోరాటం పేరుతో కాలయాపన చేయడం వల్ల సమయం, ప్రజాధనం వృథా కావడం తప్ప మరే ఫలితం ఉండదు. హైకోర్టు తీర్పు ను బట్టి చూస్తే సుప్రీంకోర్టుకు వెళ్లినా ఏపీ ప్రభుత్వానికి ఉపశమనం లభించే అవకాశాలు అత్యల్పం. కాబట్టి కోర్టుల వల్ల జరగలేదనే రాజకీయ నెపం నెట్టడం ఆపి, సుప్రీంకోర్టు నిర్దేశించిన 50 శాతం పరిమితికి లోబడి ఎన్నికల ప్రక్రియను వీలైనంత త్వరగా పూర్తి చేయడమే ప్రజాస్వామ్య బద్ధమైన మార్గం. బీసీ సమాజం కూడా కేవలం కాగితాలపై ఇచ్చే 34 శాతం హామీల కంటే, చట్టబద్ధంగా అమలుకు సాధ్యమయ్యే ప్రాతినిధ్యంపైనే స్పష్టమైన రాజకీయ చైతన్యాన్ని ప్రదర్శించాల్సిన అవసరం ఉందన్న అభిప్రాయం వినిపిస్తోంది. డేటాను పూర్తిగా పరిశీలించకుండానే 2025 డిసెంబర్ నుంచి రాష్ట్ర ప్రభుత్వం ఫ్యామిలీ సర్వే నిర్వహించింది. రాష్ట్ర జనాభా, సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగం, ఇళ్లు, ఆస్తుల స్థితిగతులతో పాటు అన్ని కీలక వివరాలను సేకరించింది. 2026 జూన్‌లో ఈ వివరాలను స్థానిక సంస్థల ముందుంచి ప్రజలు వెరిఫై చేసుకునే అవకాశం కల్పించింది. మొత్తం 39 అంశాలపై సామాజిక ధ్రువీకరణ చేపట్టారు. ఈ డేటా ఆధారంగా రాష్ట్ర జనాభాలో బీసీలు దాదాపు 50.42% (గ్రామీణ ప్రాంతాల్లో 48.84%, పట్టణాల్లో 54.35%) ఉన్నట్లు తేలింది. ఈ మేరకు బీసీలకు పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లో 1/3వ వంతు, గ్రామీణ స్థానిక సంస్థల్లో 34% రిజర్వేషన్లు కల్పించడానికి రెండు జీవోలను రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసింది. అయితే, సుప్రీంకోర్టు గతంలో కె.కృష్ణమూర్తి, వికాస్ కిషన్‌రావ్ గావ్లీ, సురేష్ మహాజన్, బిర్రు ప్రతాప్‌రెడ్డి కేసుల్లో ఇచ్చిన తీర్పు ప్రకారం రిజర్వేషన్లు 50%కి మించకూడదంటూ ప్రతివాదులు ఈ జీవోలను హైకోర్టులో సవాల్ చేశారు. ఆ తీర్పులు వెలువడే నాటికి, నేటికీ పరిస్థితులు మారాయని సమగ్ర కుటుంబ సర్వే తేల్చిందని రాష్ట్ర ప్రభుత్వం వాదించింది. రాజకీయ రిజర్వేషన్లను కేవలం జనాభా ఆధారంగా కాకుండా సామాజిక, ఆర్థిక పరిస్థితుల ఆధారంగా చేపడుతున్నట్లు హైకోర్టుకు వివరించినట్లు ప్రభుత్వం తెలిపింది. అయినప్పటికీ రిజర్వేషన్లు 50%కి మించకూడదన్న కారణంతో హైకోర్టు ఆ రెండు జీవోలను రద్దు చేసింది. కె.కృష్ణమూర్తి, వికాస్ గావ్లీ కేసుల్లో తీర్పులను లోతుగా విచారించి సేకరించిన డేటా అందుబాటులో ఉంటే రిజర్వేషన్లు 50 శాతం మించొచ్చు. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం కుటుంబ సర్వే ద్వారా సేకరించిన సమాచారాన్ని స్థానిక సంస్థలన్నీ ధ్రువీకరించాయి. ఆ ప్రక్రియ సరిగా జరిగిందా లేదా అని పరిశీలించడానికి బదులు హైకోర్టు దాన్ని పూర్తిగా రద్దు చేయడం సరికాదని సుప్రీంకోర్టు పిటిషన్‌లో పేర్కొంది. రిజర్వేషన్లపై 50% పరిమితి అన్నివేళలా తప్పనిసరిగా పాటించాల్సిన నిబంధనేమీ కాదని 'జనహిత్ అభియాన్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా' కేసులో సుప్రీంకోర్టు తీర్పులో పేర్కొందని ఏపీ ప్రభుత్వం గుర్తుచేసింది. స్థానిక సంస్థల పాలక వర్గాల కాలపరిమితి ముగిసిపోయిన నేపథ్యంలో ఎన్నికలు పూర్తి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం రిజర్వేషన్ల ఖరారుకు తగిన కసరత్తు చేసిందని, కేవలం జనాభా ప్రాతిపదికన ఉజ్జాయింపుగా బీసీలకు 34% రిజర్వేషన్లను ఖరారు చేయలేదని స్పష్టం చేసింది.

జనసేనలో పవర్ పోరు..

కాకినాడ : జనసేన పార్టీలో ప్రస్తుతం పదవులు మరియు టికెట్ల కోసం అంతర్గత పోటీ మరియు ఆశావహుల సంఖ్య గణనీయంగా పెరిగింది. 2024 ఎన్నికల్లో 100 శాతం స్ట్రైక్ రేట్‌తో విజయం సాధించి, ప్రస్తుతం అధికార కూటమిలో భాగస్వామిగా ఉండటంతో పార్టీకి ఆదరణ పెరిగింది. రాబోయే 2026 స్థానిక సంస్థల ఎన్నికలనేపథ్యంలో క్షేత్రస్థాయిలో పోటీ మరింత తీవ్రరూపం దాల్చింది.ఈ పరిస్థితికి దారితీసిన ముఖ్య కారణాలు మరియు తాజా పరిణామాలు క్రింది విధంగా ఉన్నాయి. పాత కమిటీల రద్దు చేయడంతో కొత్త నియామకాలపై ఆశలు పెరిగాయి. పార్టీని క్షేత్రస్థాయి నుంచి మరింత బలోపేతం చేసేందుకు వీలుగా జనసేన అధినేత, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఇటీవల పాత కమిటీలను రద్దు చేశారు. త్వరలోనే నూతన సంస్థాగత కమిటీల నియామకం చేపట్టనుండటంతో, పదవుల కోసం దశాబ్ద కాలంగా కష్టపడిన పాత జనసైనికులతో పాటు కొత్తగా పార్టీలోకి వచ్చిన వారి మధ్య గట్టి పోటీ నెలకొంది. రాబోయే మున్సిపల్, పంచాయతీ, జడ్పీటీసీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఆశావహుల సంఖ్య భారీగా పెరిగింది. ముఖ్యంగా గత ఎన్నికల త్యాగాలను గుర్తుచేస్తూ తమకు ప్రాధాన్యత ఇవ్వాలని కేడర్ డిమాండ్ చేస్తోంది. స్థానిక ఎన్నికల వ్యూహాలను పర్యవేక్షించేందుకు పవన్ కళ్యాణ్ ఐదుగురు సభ్యులతో కూడిన ప్రత్యేక ప్యానెల్‌ను నియమించారు. దీనికి మంత్రి కందుల దుర్గేష్ సమన్వయకర్తగావ్యవహరిస్తున్నారు.పొత్తుల నేపథ్యంలో సీట్లు తగ్గుతాయన్న ప్రచారంపై పవన్ కళ్యాణ్ కేడర్‌కు స్పష్టతనిచ్చారు."మళ్లీ సీట్లు తగ్గిస్తామంటే కుదరదు" అని స్పష్టం చేస్తూ, స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేనకు తగినన్ని స్థానాలు దక్కాలని పట్టుబడుతున్నారు.ఒకవేళ ఒకే వార్డు లేదా స్థానంలో మిత్రపక్షాల మధ్య ఏకాభిప్రాయం కుదరని పరిస్థితి వస్తే, స్నేహపూర్వక పోటీకైనా సిద్ధపడాలని, ఎక్కడా వెనక్కి తగ్గవద్దని నాయకులకు దిశానిర్దేశం చేశారు. సీట్ల కేటాయింపు మరియు అంతర్గత సర్దుబాట్ల విషయంలో కేడర్ అసంతృప్తికి లోనుకాకుండా ఉండేందుకు పార్టీ పీఏసీ చైర్మన్ మరియు మంత్రి నాదెండ్ల మనోహర్ నిరంతర సమీక్షలు జరుపుతున్నారు. సీట్ల కేటాయింపులపై తుది నిర్ణయం పూర్తిగా పవన్ కళ్యాణ్‌దేనని, కేడర్ అంతా క్రమశిక్షణతో ఎన్నికల సన్నద్ధతపై దృష్టి పెట్టాలని స్పష్టం చేశారు. ప్రస్తుతం పార్టీ అధికారంలో ఉండటం మరియు సభ్యత్వ నమోదు కార్యక్రమాలకు భారీ స్పందన వస్తుండటంతో, జనసేనలో పదవుల కోసం అంతర్గత పోటీ ఆరోగ్యకరమైన స్థాయిని దాటి కొన్ని చోట్ల తీవ్రంగా మారుతోంది. అయితే కమిటీల పునర్వ్యవస్థీకరణ ద్వారా ఈ అసంతృప్తులను సర్దుబాటు చేయాలని అధిష్ఠానం భావిస్తోంది. ఒక్కొక్క పంచాయతీ నుంచి మున్సిపాలిటీ వరకూ ఆశావహుల సంఖ్య భారీగా పెరిగింది. వారిని సంతృప్తి పర్చడం అంత తేలిక కాదు. అందరినీ ఒప్పించి, మెప్పించడం పవన్ కళ్యాణ్ కు కత్తిమీద సాము వంటిదేనని అంటున్నారు.

వారంలో ఎన్నికల నోటిఫికేషన్

గుంటూరు : స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్ర ఎన్నికల సంఘం ఏర్పాట్లు దాదాపుగా పూర్తి చేసాయి. గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలు, జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికల నగారా మోగించేందుకు ముహూర్తం ఖరారు చేసుకున్నారు. ఈ నెల 7న అమరావతి నుంచి రాష్ట్ర ఎన్నికల కమిషనర్? అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులు, ఎస్పీలు , పోలీస్ కమిషనర్లతో అత్యున్నత స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించనున్నారు.సమావేశంలో ఎన్నికల నిర్వహణకు సంబంధించిన క్షేత్రస్థాయి సంసిద్ధతను కమిషన్ నిశితంగా పరిశీలించనుంది. ఓటర్ల జాబితా ఖరారు, పోలింగ్ కేంద్రాల గుర్తింపు, బ్యాలెట్ బాక్సులు లభ్యత, ఎన్నికల నిర్వహణా సిబ్బంది కేటాయింపు , సమస్యాత్మక ప్రాంతాల్లో గట్టి బందోబస్తు ఏర్పాటు వంటి అంశాలపై కలెక్టర్లు, ఎస్పీలకు ఎస్ఈసీ స్పష్టమైన దిశానిర్దేశం చేయనుంది. నిష్పాక్షికంగా, పారదర్శకంగా ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయడమే లక్ష్యంగా యంత్రాంగాన్ని సన్నద్ధం చేస్తున్నారు.కలెక్టర్లు, ఎస్పీల భేటీ ముగిసిన వెంటనే? ఈ నెల 8 లేదా 9 తేదీల్లో మున్సిపల్ ఎన్నికల నోటిఫికేషన్‌ను ఎస్ఈసీ అధికారికంగా విడుదల చేసే అవకాశం ఉంది. రాష్ట్రంలో ఎన్డీయే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జరుగుతున్న మొదటి స్థానిక పోరు కావడంతో అందరూ ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. కూటమి తమ పట్టును మరింత బలోపేతం చేసుకోవాలని భావిస్తుంటే? ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీ క్షేత్రస్థాయిలో పుంజుకోవడానికి ఈ ఎన్నికలను సవాలుగా తీసుకుంటోంది.సుప్రీంకోర్టులో బీసీ రిజర్వేషన్లపై ఎలాంటి తీర్పు వచ్చినా దానికి తగ్గట్లుగా నోటిఫికేషన్ ఇవ్వనున్నారు

వైసీపీకి అభ్యర్థుల కష్టాలు

నెల్లూరు : ఆంధ్రప్రదేశ్‌లో రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో వైసీపీకి అనేక ఇబ్బందులున్నాయి. అభ్యర్థుల ఎంపిక నుంచి వ్యయంతో పాటు అధికార పార్టీని ఎదుర్కొనడం అంత సులువుకాదు. మంచి అభ్యర్థులున్నా అధికార పార్టీని తట్టుకోవడం అంత ఈజీ కాదు. ఎందుకంటే.. అన్ని వైపుల నుంచి వత్తిడులు ఉంటాయి. ప్రజలు సహజంగా అధికార పార్టీ కి మద్దతుగా నిలిచేందుకు ఇష్టపడతారు. దీంతో ప్రత్యక్ష ఎన్నికలు కావడంతో అభ్యర్థుల వ్యయం కూడా వైసీపీకి ఇబ్బందిగా మారనుంది. మరొకవైపు పోలీసు కేసులు, ఇతర ఇబ్బందులు పార్టీ కార్యకర్తలను పోలింగ్ కేంద్రాల వద్దకు రావడం కూడా అంత సులువు కాదు. ఇవన్నీ అధిగమించడంతో పాటు ఓటర్లను తమ వైపునకు తిప్పుకునేందుకు ఇబ్బందులు కలగొచ్చు. ఆంధ్రప్రదే హైకోర్టు తీర్పు వెలువరించడం మరియు క్షేత్రస్థాయిలో ఉన్న పరిస్థితుల నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ ఎదుర్కొంటున్న ప్రధాన ఇబ్బందులు, సవాళ్లు అనేకం ఉన్నాయి. ఎన్నికల వాయిదా ప్రయత్నాలు విఫలమయ్యాయి. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ పూర్తయ్యే వరకు ఎన్నికలు నిర్వహించకూడదని వైసీపీ వేసిన పిటిషన్‌ను ఏపీ హైకోర్టు కొట్టివేసింది. ఆరు వారాల్లోపు ఎన్నికల ప్రక్రియ ప్రారంభించాలని ఆదేశించడంతో వైసీపీ వ్యూహానికి ఎదురుదెబ్బ తగిలింది. గత సార్వత్రిక ఎన్నికల ఓటమి తర్వాత పార్టీ క్యాడర్‌లో ఇంకా పూర్తి స్థాయిలో మనోధైర్యం రాలేదని, క్షేత్రస్థాయిలో నాయకులు, అభ్యర్థుల లభ్యతపై సందిగ్ధత ఉందనే చర్చ జరుగుతోంది.అన్ని స్థానాల్లోనూ కచ్చితంగా పోటీ చేయాలని పార్టీ అధినేత వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినప్పటికీ, అధికార కూటమి ప్రభుత్వంలో స్థానికంగా ఎదురుదెబ్బలు తగులుతాయనే ఆందోళన కొందరిలో ఉంది. అందుకే ఈ ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఇష్టపడే అభ్యర్థులు కూడా కొంత కష్టంగానే కనిపిస్తారుఅభ్యర్థులను బలవంతంగా ఎంపిక చేసినప్పటికీ వారు ఖర్చు పెట్టుకునేందుకు ముందుకు రారు. అధికార పార్టీకి ధీటుగా తాము ఖర్చు చేయలేమని ముందుగానే చేతులెత్తాస్తారు. అది పార్టీ నియోజకవర్గ ఇన్ ఛార్జులకు భారంగా మారనుంది. ఆర్థిక భారాన్ని ఇన్ ఛార్జులు భరిస్తారా? లేక పార్టీ నాయకత్వం భరిస్తుందా? అన్న దానిపై స్పష్టత లేదు. దీంతో స్థానిక నియోజకవర్గాల ఇన్ ఛార్జులు మాత్రమే ఈ ఖర్చును భరాయించుకోవాల్సి వస్తే పోటీకి అయితే నిలబెడతారు కానీ, ఖర్చు మాత్రం ఎక్కువగా పెట్టరన్నది అందరికీ సత్యమే. ఖర్చు పెట్టని పరిస్థితుల్లో స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ, అందులోనూ ప్రత్యక్ష ఎన్నికల్లో గెలవడం అంత సులువు కాదు. అదే ఇప్పుడు వైసీపీకి మైనస్ పాయింట్ గా కనిపిస్తుంది. జగన్ కేంద్ర పార్టీ ఆఫీసులో కూర్చుని ఎన్ని ఆదేశాలు జారీ చేసినప్పటికీ చివరకు ఖర్చు చేయాల్సి రావడం లోకల్ లీడర్లే కావడంతో అంతగా సుముఖంగా ఉండరు. ఇవన్నీ వైసీపీ విజయాలకు బ్రేకులు వేస్తాయన్న విశ్లేషణలు మాత్రం జోరుగా వినిపిస్తున్నాయి

సవాళ్లతో ఏకం... సాధ్యమేనా

విజయవాడ : దేశవ్యాప్తంగా, ముఖ్యంగా ఏపీ ఎన్నికల్లో తన సర్వేల ద్వారా సోషల్ మీడియాలో క్రేజ్ సంపాదించిన 'కేకే సర్వేస్' అధినేత కిరణ్ కొండేటి ఇప్పుడు డైరెక్ట్ రాజకీయాల్లోకి రంగప్రవేశం చేస్తున్నారు. ఇప్పటివరకు తెరవెనుక కూర్చుని ఓట్ల శాతం, సీట్ల అంచనాలు చెప్పిన ఆయన, ఇకపై ప్రత్యక్ష రాజకీయాల్లోకి అడుగుపెట్టాలని నిర్ణయించుకున్నారు. ఇందులో భాగంగా విజయవాడలోని ఓ స్టార్ హోటల్‌లో ప్రత్యేకంగా మీటింగ్ ఏర్పాటు చేసి 'ఏకం' అనే కొత్త రాజకీయ పార్టీని అధికారికంగా ప్రకటించారు.రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయాలనే ఆసక్తి, అర్హత ఉన్న సాధారణ ప్రజలను ప్రోత్సహించడమే ఈ 'ఏకం' పార్టీ ప్రధాన లక్ష్యమని కిరణ్ తెలిపారు. కుల, మత, జాతి భేదాలకు అతీతంగా ప్రజలను ఒకే వేదికపైకి తెచ్చి రాజకీయాల్లోకి తీసుకురావడమే తన ధ్యేయమన్నారు. పంచాయతీ, మండల పరిషత్ ఎన్నికల నుంచి మొదలుపెట్టి, భవిష్యత్తులో అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లోనూ ఏకం అభ్యర్థులు పోటీ చేస్తారని ఆయన స్పష్టం చేశారు.గతంలో కొన్ని ఎన్నికల ఫలితాలను అంచనా వేసి లైమ్‌లైట్‌లోకి వచ్చిన కిరణ్ కొండేటి, ఆ తర్వాత ఇచ్చిన కొన్ని సర్వే అంచనాలు తలకిందులు కావడంతో సోషల్ మీడియాలో విమర్శలు ఎదుర్కొన్నారు. సర్వేల పేరుతో ప్రజల ముందుకు వెళ్తే ఇక ఫలితం ఉండదనే వాస్తవాన్ని గుర్తించే ఈసారి నేరుగా రాజకీయాల్లోకి వస్తున్నారని ప్రచారం సాగుతోంది.ఏపీలోని స్థానిక సంస్థల ఎన్నికలంటే గ్రామస్థాయిలో గ్రూప్ తగాదాలు, బలమైన కేడర్, భారీగా డబ్బుతో ముడిపడి ఉండే సున్నితమైన అంశం.

ఆహాలో హోంటౌన్ వెబ్ సీరిస్

పాతరోజులు గుర్తుకు వచ్చాయన్న రాజీవ్ కనకాల

రాజీవ్ కనకాల, ఝాన్సీ ప్రధాన పాత్రల్లో నటించిన వెబ్ సిరీస్ 'హోం టౌన్' మనసుని హత్తుకునే కుటుంబ కథతో రూపొందింది. ఈ సిరీస్‌కు శ్రీకాంత్ దర్శకత్వం వహించారు. ఆహా వేదికగా శుక్రవారం నుంచి ఇది స్ట్రీమింగ్ కానుంది. ఈ నేపథ్యంలోనే గురువారం మీడియా వాళ్ల కోసం ప్రత్యేకంగా సిరీస్‌ను ప్రదర్శించారు. ఈ సందర్భంగా రాజీవ్ కనకాల మాట్లాడారు. ఇది తప్పకుండా ప్రేక్షకులకు నచ్చుతుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. సిరీస్ చూసిన తర్వాత ప్రేక్షకులకు చిన్ననాటి రోజులు గుర్తుకు వస్తాయన్నారు. మేము కూడా ఇప్పుడే ఈ సిరీస్‌ను పూర్తిగా చూశాం. కొన్ని ఎపిసోడ్స్ చూస్తుంటే 35 సంవత్సరాలు వెనక్కి వెళ్లిపోయాను. నా చిన్ననాటి లవ్‌స్టోరీలు, స్నేహితులతో చేసిన అల్లరి అన్నీ గుర్తుకువస్తున్నాయి. నటీనటులందరూ చక్కగా యాక్ట్ చేశారు. శ్రీకాంత్ దీనిని ఎంతో హృద్యంగా రూపొంది ంచారు. మాతోపాటు– సిరీస్ చూసిన వారి రియాక్షన్స్ చూసి ఆనందంగా అనిపించింది. సిరీస్‌ను రూపొందించడంలో నిర్మాత మాకెంతో సపోర్ట్‌గా నిలిచారని రాజీవ్ తెలిపారు. అనంతరం నిర్మాత నవీన్ మాట్లాడుతూ.. తర్వాత సంస్థ నుంచి వస్తోన్న వెబ్ సిరీస్ ఇది. అందులో యాక్ట్ చేసిన ముగ్గురు పిల్లలు ఓవర్ నైట్‌లో స్టార్స్ అయ్యారు. అదే ఇప్పుడు రిపీట్ కావాలని కోరుకుంటు–న్నా. ఈ సిరీస్‌లో రాజీవ్ గారి పాత్ర.. మొదటి నుంచి లాస్ట్ వరకూ ఉంటుంది. ఆ సిరీస్‌కు ఎంతటి పాపులారిటీ వచ్చిందో ఈ సిరీస్‌కూ వస్తుందని భావిస్తున్నా అని అన్నారు.

స్పిరిట్‌లో రామ్‌గోపాల్ వర్మ ?

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ హీరోగా, డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా కాంబోలో 'స్పిరిట్' అనే భారీ చిత్రం తెరకెక్కబోతున్న విషయం తెలిసిందే. ఈ సినిమా ప్రకటన వచ్చినప్పటి నుంచి షూటింగ్ ఎప్పుడు మొదలవుతుందా ? అని ఎదురుచూస్తున్నారు ఫ్యాన్స్. అయితే రీసెంట్ గా ఉగాది పండుగా వేడుకలలో పాల్గోన్న సందీప్ మాట్లాడుతూ.. ప్రభాస్ స్పిరిట్ సినిమా షూటింగ్‌ను మెక్సికోలో జరుపబోతున్నట్లు– ప్రకటించాడు. ఇంతకంటే ఏం అప్‌డేట్ ఇవ్వలేమని తెలిపాడు. ఇదిలా ఉంటే ఈ మూవీలో స్పెషల్ క్యారెక్టర్ చేయబోతున్నారనే వార్తలపై తాజాగా దర్శకుడు రామ్ గోపాల్ వర్మ స్పందించాడు. వర్మ ఇంతకు ముందు ప్రభాస్ 'కల్కి 2898 ఏడీ' చిత్రంలో స్పెషల్ క్యామియో చేసిన సంగతి తెలిసిందే. చీఫ్ చింటు అనే స్ట్రీట్ ఫుడ్ వ్యాపారిగా ఆయన ఈ మూవీలో కనిపించాడు. ఆయన కనిపించిన సీన్స్ కొద్ది సేపే అయిన థియటర్లో ఆడియన్స్ నుంచి మంచి రెస్పాన్స్ వచ్చింది. దీంతో సందీప్ రెడ్డి తీస్తున్న 'స్పిరిట్' సినిమాలోనూ ఆర్జీవీ నటిస్తారని టాక్ నడిచింది. ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న వర్మ.. ప్రభాస్ తో మరోసారి కలిసి స్క్రీన్ షేర్ చేసుకోవడం పై క్లారిటీ– ఇచ్చాడు.. ' 'స్పిరిట్' సినిమాలో నేను ఓ క్యారెక్టర్ ప్లే చేస్తున్నాననే వార్త చాలా రోజులుగా వింటు–న్నాను. కానీ ఇందులో ఏమాత్రం నిజం లేదు. ఎందుకంటే అసలు నేను సందీప్ వంగాని ఎప్పుడూ అడగలేదు. దాని గురించి నాకు ఏమీ తెలియదు. నాకు అశ్వినీ దత్, ప్రభాస్ తెలుసు. సరదాగా 'కల్కి' లో చేయమని అడిగారు.. చేశాను అంతే. దాని కోసం పెద్దగా ఆలోచించి చేసిందేమీ లేదు. కానీ 'కల్కి' సినిమాలో నా పాత్రకి జనాల నుంచి వచ్చిన రియాక్షన్ చూసి సర్ప్రైజ్ అయ్యాను' అని క్లారిటీ– ఇచ్చారు వర్మ.

సిద్దార్థ్....భాస్కర్ మధ్య గ్యాప్

అదంతా సినిమాలో మామూలే అని వివరణ

సిద్దార్థ్ జొన్నలగడ్డ హీరోగా నటిస్తూ, బొమ్మరిల్లు భాస్కర్ దర్శకత్వంలో 'జాక్' అనే సినిమా రూపొందింది. ఈ నెల 10న విడుదల కానున్న ఈ చిత్రం చిత్రీకరణ సమయంలో వీరిద్దరి మధ్య గ్యాప్ పెరిగిందని, సిద్దార్థ్, దర్శకత్వంలోనూ ఆసక్తి చూపిస్తూ సృజనాత్మక పనుల్లో ఎక్కువగా పాల్గొంటున్నాడని, ఇది భాస్కర్‌కు అసంతృప్తి కలిగించిందని, ఒక పాటను భాస్కర్ లేకుండా చిత్రీకరిం చారని సోషల్ మీడియాలో రకరకాల వార్తలు వ్యాపించాయి. ట్రైలర్ విడుదల కార్యక్రమంలో సిద్దార్థ్ మరియు భాస్కర్ ఈ అంశంపై స్పష్టత ఇచ్చేందుకు ప్రయత్నించారు. సినిమా అనేది టీం వర్క్ తో కూడిన ప్రక్రియ, అందరూ చిత్రం కోసం శ్రమిస్తారు, తమ డిస్కషన్ గదిలోకి వెళ్తే అది ఒక యుద్ధ రంగంలా అనిపిస్తుందని, సినిమా కోసం తాము వాదించుకుంటాం, తిట్టుకుంటాం కొట్టుకునేదాకా వెళ్తాము, కానీ ఆ గది నుంచి బయటకు వచ్చిన తర్వాత అన్నీ మర్చిపోతామని భాస్కర్ అన్నారు. సిద్దార్థ్‌కు అన్ని విషయాలపై లోతైన అవగాహన ఉందని, అది సినిమాకు ఒక బలంగా మారుతుందని, ఒక సన్నివేశాన్ని అతనికి అప్పగించి నిశ్చింతగా ఉండవచ్చని, కెమెరా వద్ద 'రోలింగ్..కట్' అని చెప్పడమే సరిపోతుందని భాస్కర్ అభిప్రాయపడ్డారు. సిద్దార్థ్ కూడా గండిపేట వద్ద ఒక పాటను దర్శకుడు లేకుండా తీశామని, అయితే ఆ సమయంలో భాస్కర్ ఎడిటింగ్ పనుల్లో నిమగ్నమై ఉన్నారని అన్నారు, 'మీరు ఏసీ గదిలో పని చేయండి, మేము ఎండలో కష్టపడతాం' అని ఇద్దరూ సరదాగా మాట్లాడు కున్నామని, భాస్కర్‌కు తెలియకుండా లేదా ఆయన అనుమతి లేకుండా సాంగ్ షూట్ ఎలా సాధ్యమవుతుందని సిద్దూ జొన్నలగడ్డ మీడియాను ప్రశ్నించారు.

ఆదాయపు పన్ను సోదాలపై రకుల్ ప్రీత్ సింగ్ క్లారిటీ..

వాటితో నాకు ఎలాంటి సంబంధం లేదు ..

హీరోయిన్ రకుల్ ప్రీత్ సింగ్ పేరు ఇటీవల వార్తలలో తెగ నిలుస్తుంది. ఆదాయపు పన్ను శాఖ సోదాలకు సంబంధించి కూడా రకుల్ హాట్ టాపిక్‌గా మారింది. అయితే తనపై వస్తున్న వార్తలపై రకుల్ స్పందిస్తూ.. ఇందులో ఎలాంటి వాస్తవం లేదని సోషల్ మీడియా వేదికగా సుదీర్ఘ వివరణ ఇచ్చింది. ఆ సోదా లకు నాకు ఎలాంటి సంబంధం లేదు అని రకుల్ ప్రీత్ సింగ్ స్పష్టం చేసింది. వాస్తవాలను నిర్ధారించు కోకుండా తన పేరును ఈ వ్యవహారంతో ముడిపెట్టి వార్తలు ప్రచురించారని ఆమె పేర్కొంది. ఇలాంటి తప్పుడు ప్రచారం తన ప్రతిష్ఠను దెబ్బతీస్తుందని ఆవేదన వ్యక్తం చేసింది. తాను సాయుధ దళాల కుటుంబ నేపథ్యం నుంచి వచ్చానని, ఎంతో కష్టపడి తన కెరీర్‌ను నిర్మించుకున్నానని రకుల్ తెలిపింది. తనకు 20 ఏళ్ల వయసు నుంచే పన్నులు చెల్లిస్తున్నానని పేర్కొంది. చట్టబద్ధంగా తన ఆర్థిక వ్యవహారాలను నిర్వహి స్తున్నానని ఆమె చెప్పింది. అంతేకాకుండా అక్రమ విదేశీ నగదు బదిలీలతో తనకు ఎలాంటి సంబంధం లేదని రకుల్ స్పష్టం చేసింది. వ్యక్తిగతంగా కానీ, ఏదైనా నిర్మాణ సంస్థ తరఫున కానీ ఇలాంటి అక్రమ లావాదేవీల్లో తాను పాల్గొన లేదని వెల్లడించింది. భారత్‌లో కానీ, విదేశాల్లో కానీ మరెవరి పేరుతోనైనా బినామీ ఆస్తులు కలిగి ఉన్నానన్న ప్రచారాన్ని కూడా ఆమె ఖండించింది. తనపై వచ్చిన వార్తలను "తప్పుడు, దురుద్దేశ పూరితమైన, ఊహాజనిత కథనాలు"గా రకుల్ అభివర్ణించింది. ఇలాంటి వార్తలను ప్రచురించిన వారు వాటిని ఉపసంహరించుకుని వాస్తవాలను స్పష్టం చేయాలని ఆమె కోరింది. మీడియా సంస్థల వాణిజ్య ప్రయోజనాల కోసం వాస్తవాలను పక్కన పెట్టకూడదని రకుల్ పేర్కొంది. వార్తల కోసం, వాణిజ్య ఒత్తిళ్లు, ఒక వ్యక్తి ప్రతిష్ఠ, వాస్తవాలు, జీవనోపాధిపై ప్రభావం చూపే స్థాయికి వెళ్లకూడదని ఆమె సూచించింది. తనపై వస్తున్న ప్రచారానికి సంబంధించి రాకుల్ ప్రీత్ సింగ్ ఇలా తన వాదనను బహిరంగంగా వెల్లడించడంతో.. ఈ వ్యవహారంలో తనకు ఎలాంటి సంబంధం లేదన్న విషయాన్ని ఆమె స్పష్టం చేసినట్లయింది.



రాహుకేతు పూజలో పాల్గొన్న పూజాహెగ్డే

శ్రీకాళహస్తీశ్వర ఆలయాన్ని సినీ నటి పూజా హెగ్డే దర్శించుకున్నారు. కుటుంబ సభ్యులతో కలసి ఆమె రాహుకేతు సర్ప దోష నివారణ పూజలు చేశారు. అనంతరం శ్రీ వాయు లింగేశ్వర స్వామి సమేత శ్రీ జ్ఞాన ప్రసూనాంబిక దేవిని దర్శించుకున్నారు. వేద పండితులు ఆశీర్వచనం, తీర్థ ప్రసాదాలను అందజేశారు. ప్రముఖ హీరోయిన్ పూజా హెగ్డే అనతి కాలంలోనే దాదాపు అందరు స్టార్ హీరోలతో నటించిన ఈ అమ్మడుకి ఇప్పుడు తెలుగు సినిమాలలో అవకాశాలు తగ్గాయి. ఎంత త్వరగా తెలుగులో మార్కెట్ వచ్చిందో అంతే త్వరగా తన ఫేమ్ కూడా పోగొట్టుకుందని చెప్పాలి. హెగ్డే దాదాపు రెండున్నరేళ్ల నుంచి తెలుగు సినిమాలో కనిపించలేదు. ఇక ఇలా తెలుగు సహా సౌత్ సినిమాల్లో కనుమరుగు అయిపోయింది అనుకున్న పూజా హెగ్డే, మళ్ళీ ఇపుడు వరుస సినిమాలు లైన్ లో పెట్టింది. కోలీవుడ్ స్టార్ హీరో సూర్య నటిస్తున్న 'రెట్రో' లో హీరోయిన్ గా కనిపిస్తుంది. అలాగే, రజినీకాంత్ 'కూలీ' సినిమాలో పూజా స్పెషల్ సాంగ్ చేయనుంది. రాఘవ లారెన్స్ 'కాంచన 4' మూవీలో కూడా నటించనున్నట్లు సమాచారం. అలాగే హిందీలో కూడా ఓ మూవీ చేస్తోంది. అయితే అవకాశాలు వచ్చాయి కానీ అవి ఎంతవరకు హిట్ అనేది విడుదల అయిన తర్వాత తెలుస్తుంది. దీంతో తాజాగా ఈ అమ్మడు తన కెరీర్ కోసం ప్రత్యేక పూజలో పాల్గొంటుంది.

Printed, Published & Owned by Dr. JBL, Printed at Abhyudaya Publications,& Printers Algunoor, MDI: Thimmapur District, Karimnagar. 505001(T.S) Published at H.NO. 6-3-289,Kishan Nagar, Karimnagar MDI: District karimnagar- 505001(T.S), RNI NO. APTEL/2006/19056